ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-9-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 228 పేజీలు: 10+4 వెల: 6.50



ఛత్తీస్‌గఢ్‌లో 10 మంది నక్సలైట్లకు ఉరిశిక్ష 3

పాస్‌పోర్టు ర్యాంకుల్లో భారత్ 73వ స్థానం 5




## పీఎఫ్ సీలింగ్ 25వేలకు పెంపు

అదనంగా 51లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం

ప్రభుత్వంపై రూ.11,339 కోట్ల అదనపు భారం

కేంద్ర కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి అశ్విని వైష్ణవ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) పరిధిలోకి తప్పనిసరిగా వచ్చే ఉద్యోగుల కోసం వేతన పరిమితిని నెలకు రూ.15వేల నుండి రూ.25వేలకు పెంచడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల అదనంగా 51 లక్షల మందికి పైగా ఉద్యోగులు తప్పనిసరి ఇపిఎఫ్ఒ పరిధిలోకి వస్తారని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా ప్రావిడెంట్ ఫండ్

>>2

# కెసిఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ




## తక్షణమే నోటీసులు ఇచ్చి భూమిని స్వాధీనం చేసుకోండి

శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తా

### అసెంబ్లీ వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు16:** తెలంగాణ శాసనసభ వేదికగా భూ ఆక్రమణలు, 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సంచలన నిర్ణయాలు ప్రకటించారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్‌ను లక్ష్యంగా చేసుకుంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ 700 ఎకరాలు, అందులో 388 ఎకరాలకు రికార్డులు లేవని, ఈ ప్రభుత్వ భూమిపై తక్షణమే విచారణ జరిపాలని,సంబంధిత రెవెన్యూ అధికారులు వెంటనే కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోని భూములపై విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. విచారణలో ఆ స్థలం ప్రభుత్వ భూమిగా నిర్ధారణ అయితే, దానిని స్వాధీనం చేసుకుని పేద దళితులకు పంపిణీ చేస్తామని సీఎం అసెంబ్లీలో ప్రకటించారు. ఈ విచారణ ప్రక్రియలో ఏమాత్రం అలసత్వం వహించినా, సకాలంలో ప్రక్రియ పూర్తి చేయకుంటే బాధ్యులైన అధికారులు,

>>2



బుధవారం అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

## ప్రైవేటు భూములు 3,73,930 ఎకరాలపైనే వివాదం

ధరణిని అడ్డంపెట్టుకొని భూములు కొల్లగొట్టిన వ్యవహారంపై 'సెట్' ఏర్పాటు చేస్తాం: అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి

2

# 22ఎపై నెలలో న్యాయం

నిషేధిత జాబితా వివాదాల పరిష్కారానికి హైపవర్ కమిటీ

12 అంశాలపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం

ఎల్బీనగర్‌లో జిఒ 118 వర్తించే వారందరికి త్వరలోనే శుభవార్త: అసెంబ్లీలో రేవంత్ హామీ

**హైదరాబాద్, సెప్టెంబరు16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో నిరుపేదలకు సంబంధించిన ఆస్తులపై 30 రోజుల్లోగా న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభ వేదికగా ప్రకటించారు. 22ఏ నిషేధిత జాబితా వివాదాల పరిష్కారానికి సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఉన్నతాధికారితో కూడిన హైపవర్ ఆఫీసర్స్ కమిటీని నియమిస్తున్నట్టు తెలిపారు. నిషేధిత జాబితా 22ఏ పై బుధవారం శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చపై ముఖ్యమంత్రి సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. నిజాం కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆ తర్వాత తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు భూములకు సంబంధించి చేసిన చట్టాలు, వాటి చారిత్రక పరిణామ క్రమాన్ని సభలో వివరించారు. న్యాయమైన, చట్టబద్ధమైన అంశాల్లో నిరుపేదలకు అన్యాయం జరక్కుండా అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం


>>2

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

చెరువులో దిగిన ఆరుగురు విద్యార్థులు మృతి

**పటాన్ చెరులోని ప్రాచిన్ ఆస్పత్రిలో నర్సింహా రాజు, సుమంత్, గణేష్, ఉదయ్ కిరణ్, తేజ, సిద్ధార్థ్ మృతదేహాలు**

2



## ప్రముఖ కన్నడ నటుడు అనంత్‌నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే

22న గుజరాత్‌లో ప్రదానం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అత్యున్నత పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు 2024 సంవత్సరానికి గాను అధికారికంగా ప్రకటించారు. కన్నడ మూవీ ఇండస్ట్రీతో పాటు భారతీయ సినిమాకు చేసిన చిరస్మరణీయ సేవలను గుర్తించి, ప్రముఖ నటుడు అనంత్

>>2




## నేడు పోటా పోటీగా సెప్టెంబర్ 17 ఉత్సవాలు

**హైదరాబాద్, సెప్టెంబరు16,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెప్టెంబర్ 17 ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నాయి. నిజాం సర్కార్ నుంచి తెలంగాణ విడిపోయి భారత దేశంలో కలిసిపోయింది. ఆయా చారిత్రాత్మక ఘటనల నేపథ్యంలో సెప్టెంబర్ 17ను తెలంగాణ భారత్‌లో విలీనం అయిన దినంగా కొందరు, నిజాం నుంచి తెలంగాణ విమోచనం పొందిన దినంగా ఇంకొందరు భావిస్తున్నారు. బిజెపి కేంద్రం ప్రభుత్వం ద్వారా అధికారికంగా హైదరాబాద్‌లో తెలంగాణ విమోచన దినోత్సవం

>>2




న్యూఢిల్లీలోని నేషనల్ క్రాఫ్ట్స్ మ్యూజియంలో ఏర్పాటుచేసిన బ్రిక్స్ బజార్‌ను వీక్షించేందుకు బుధవారం భారీగా విచ్చేసిన సందర్శకులు

## సెప్టెంబర్ 17 ఉత్సవాలు

>> జరిపేందుకు ఘనంగా ఏర్పాట్లు చేసింది. గురువారం ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ఈ ఉత్సవానికి ఈసారి ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ హాజరువుతున్నారు. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బిజెపి కీలక నేతలు పాల్గొంటారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 17 దినోత్సవాన్ని అధికార కాంగ్రెస్ గాంధీ భవన్‌లో విలీన దినోత్సవంగా జరుపుకునేందుకు సిద్ధమైంది. బిఆర్‌ఎస్ కూడా తెలంగాణ భవన్‌లో జాతీయ జెండాను ఎగుర వేయనుంది. కమ్యూనిస్టు పార్టీలు సెప్టెంబర్ 17న విలీన ఉత్సవంగా నిర్వహిస్తున్నాయి. ఎంఐఎం కూడా సెప్టెంబర్ 17 రోజు జాతీయ జెండాను ఎగర వేసి నగరంలో ర్యాలీ నిర్వహించనుంది.

## అనంత్‌నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే

>> నాగ్‌ను ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లుగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అనంత్ నాగ్ తన మొత్తం కెరీర్‌లో 300లకు పైగా సినిమాల్లో నటించి అందరి మన్ననలను పొందారు. కేవలం కన్నడలోనే కాకుండా వివిధ భాషల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ, తన సహజమైన నటనతో దశాబ్దాలుగా ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదిం చుకున్నారు. ఈనెల 22న గుజరాత్‌లోని కేవాడియాలో జరిగే 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆ పురస్కారాన్ని అనంత్ నాగ్‌కు ప్రదానం చేయనున్నారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికైన అనుభవజ్ఞులైన నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంత్ నాగ్ ఓ అసాధారణమైన నటుడని ఆయన అంకితభావం, అద్భుతమైన నటనా ప్రతిభే ఆయనను ఈ అత్యున్నత పురస్కారానికి అర్హుడిని చేశాయని కొనియాడారు. భారతీయ సినీ రంగానికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ప్రధాని ప్రశంసించారు. 1948 సెప్టెంబర్ 4న జన్మించిన అనంత్ నాగ్ (అనంత్ నాగర్‌కట్టె) తన సుదీర్ఘ కెరీర్‌లో 300కు పైగా చిత్రాల్లో నటించారు. వీటిలో 250కి పైగా కన్నడ చిత్రాలే ఉన్నాయి. ఆయన కన్నడతోపాటు హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు.

## 22ఎపై నెలలో న్యాయం

>> తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రధానంగా ప్రభుత్వం గుర్తించిన 12 అంశాల్లో ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఆ 12 అంశాలను సభలో వెల్లడించారు.

**1. అర్బన్ ల్యాండ్ సీలింగ్ యుఎల్‌సి భూములు :** పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలు. యూఎల్సీ మిగులు భూముల క్రమబద్ధీకరణ నిమిత్తం త్వరలోనే ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెడుతుంది. ఈ పథకం పెండింగ్‌లో ఉన్న పాత దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులన్నింటికీ వర్తిస్తుంది. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ ప్రక్రియలు రెండూ సమాంతరంగా, ఏకకాలంలో చేపడుతాం.

**2. అధీకృత లేఅవుట్లలోని ప్రభుత్వ భూములు (హెచ్‌ఎండిఏ, జిహెచ్‌ఎంసి, డిటిసిపి) :** కాంపిటెంట్ అథారిటీచే ఆమోదించబడిన లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ల దరఖాస్తులను పరిశీలించి, తగిన పరిష్కారం చూపేందుకు వారం రోజుల్లోగా ఒక సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేసి ఈ సమస్యను పరిష్కరిస్తాం. ఇలాంటి ఆస్తుల క్రమబద్ధీకరణ త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం నూతన పథకాన్ని ప్రవేశపెడుతుంది.

**3. సింగరేణి బొగ్గు గని ప్రాంతాలు (కోల్ బెల్ట్) సమస్య :** జిల్లా స్థాయి ఉన్నతాధికార కమిటీని ఏర్పాటు చేస్తాం. ఈ కమిటీ పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి నిర్దేశిత అర్హత ప్రమాణాల మేరకు పరిష్కరిస్తుంది.

**4. జీవో నెంబర్ 59 సమస్య :** కన్వేయన్స్ డీడ్స్ (హక్కు బదిలీ పత్రాలు) జారీ చేసిన 1,22,280 దరఖాస్తులను నిర్దేశిత అర్హతల ప్రాతిపదికన తుది పరిశీలన జరిపి పరిష్కరించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమిస్తుంది. మిగిలిన 18,590 పెండింగ్ దరఖాస్తులు నూతన క్రబద్ధీకరణ విధానం కింద పరిష్కరిస్తాం.

**5. జీవో నెంబర్ 118 (ఎల్బీ నగర్ నియోజకవర్గం) :** పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తాం. పరిష్కారమైన అన్ని కేసులను వెంటనే సెక్షన్ 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం.

**6. అసైన్డ్ భూములలో నిర్మించిన గృహాలు :** అసైన్డ్ భూములన్నీ తెలంగాణ అసైన్డ్ భూముల (బదిలీ నిషేధ) చట్టం 1977 పరిధిలోకి వస్తున్నందున, ఈ అంశంపై సమగ్ర న్యాయ సమీక్ష, విస్తృతస్థాయి సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకుంటాం.

**7. ఇందిరమ్మ పథకం - ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ప్రభుత్వ ఖర్చుతో నిర్మించిన ఇండ్లు :** ఈఅంశం అత్యంత నిరుపేదల ఆస్తులకు సంబంధించినది అయినందున, దీనిపై విస్తృతస్థాయి సంప్రదింపులు జరుపుతాం.

**8. ఇందిరమ్మ పథకం- లబ్ధిదారుని సొంత స్థలంలో ప్రభుత్వ ఖర్చుతో నిర్మించిన ఇండ్లు:** 5 సంవత్సరాల లాక్‌ఇన్ పీరియడ్ (లావాదేవీల నియంత్రణ గడువు) ముగిసిన తర్వాత క్రయవిక్రయాలకు అనుమతి మంజూరు చేస్తాం.

**9. ప్రైవేటు పట్టా భూములు - నాలా రుసుము చెల్లించని కేసులు :** నాలా ఛార్జీలు, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుములను కలిపి క్రయవిక్రయాలకు అనుమతిస్తాం.

**10. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు, అనధికార లేఅవుట్లు, కాలనీలు :** అనధికారిక లేఅవుట్లు నూతన క్రమబద్ధీకరణ పథకం పరిధిలోకి.

**11. సికింద్రాబాద్ పరిధిలోని లీజ్ హోల్డ్ ఆస్తుల ఫ్రీహోల్డ్ క్రమబద్ధీకరణ :** ఇలాంటి కేసులను 30 రోజుల నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించేందుకు అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తాం.

**12. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికుల అసైన్మెంట్ భూములు, భూదాన్ భూములు :** నిరుపేద, బలహీన వర్గాల గృహ నిర్మాణ అవసరాల కోసం భూమిని, ఆర్థిక వనరులను సమీకరించే ఉద్దేశంతో ఈ భూములను సమగ్ర ల్యాండ్ పూలింగ్‌విధానం పరిధిలోకి తీసుకొస్తాం. ఈ విధానం ద్వారా సమీకరించిన నిధులను ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని నిరుపేద లబ్దిదారులకు బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకాలకు వినియోగిస్తాం అని సిఎం అసెంబ్లీ వేదికగా ప్రకటించారు.

## నేడు తెలంగాణకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ రాక

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** గురువారం తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రానున్నారు. ప్రధాని జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా దేశ వ్యాప్తంగా ఆశీర్వాద దీపం వెలిగించాలని బీజేపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లో మోడీ ఆయురారోగ్యాలతో ఉండాలని కాంక్షిస్తూ శివరాజ్‌సింగ్ ఆశీర్వాద దీపం వెలిగించనున్నారు. కాగా, ఈ నెల18న హైదరాబాద్‌లో జరుగనున్న దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సదస్సుకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వం వహించనున్నారు. ఈసదస్సు అనంతరం సాయంత్రం 4 గంటలకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, దక్షణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖల మంత్రులు మీడియా సమావేశంలో పాల్గొంటారు.

## పిఎఫ్ సీలింగ్ 25 వేలకు పెంపు

>> పొదుపు, ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (ఇపిఎస్) కింద పెన్షన్ రక్షణ మరియు ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఇడిఎల్ఐ) కింద బీమా రక్షణ పొందే అవకాశం విస్తృతమవుతుందని తెలిపారు. ఈ పథకం సెప్టెంబర్ 17 నుండి అమలులోకి రానుంది. ప్రస్తుతం ఉన్న సుమారు రూ.10,250 కోట్ల వార్షిక బడ్జెట్ మద్దతుతో పోలిస్తే, దీనివల్ల ప్రభుత్వంపై పడే అదనపు వార్షిక భారం సుమారు రూ.11,339 కోట్లుగా అంచనా వేసింది. కొత్త వేతన పరిమితి ప్రకారం ఇపిఎస్‌కు ఉద్యోగులు, యజమానులు చేసే చందాలు కూడా పెరుగుతాయి. మంత్రి వైష్ణవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సర్వే ప్రకారం ప్రైవేట్ సంస్థలలో సగటు జీతం రూ.23,000గా ఉందని తెలిపారు. "ఇపిఎఫ్ఒ తన పరిధిని విస్తరించడం వల్ల ఎక్కువ మంది కార్మికులు పెన్షన్, మరణ బీమా, వారి పొదుపుపై మెరుగైన వడ్డీ ప్రయోజనాలను పొందుతార్లు" అని వివరించారు. ఒక్కో ఉద్యోగికి యజమాని చేసే చందా రూ.600 పెరుగుతుందని మంత్రి తెలిపారు, అలాగే ఇపిఎఫ్‌కు ఉద్యోగులు చేసే చందా కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. "సుమా రు కోటి మంది కార్మికులు ఈ నిర్ణయం వల్ల ప్రయోజనం పొందుతార్లు అని మంత్రి చెప్పారు.

## వారం - వర్జ్యం

**17-09-2026, గురువారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,**
తి.షష్ఠి ఉ.10.49, న.అనూరాధ రా.7.55
వ.రా.2.11 - రా.3.58
దు.ఉ.9.59 - ఉ.10.48
2) మ.2.52 - మ.3.41
రాహు మ.1.30-3.00, శుభ స. లేదు

## వార్తాఫలం

**మేషం :** నష్టం రావలసిన చోట నష్టం రాకపోవడం మీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. శుభవార్తలను వింటారు.

**వృషభం :** టెండర్స్, కాంట్రాక్టర్స్ లభిస్తాయి. అవసరాలకు అనుకూలమైనంత ధనాన్ని కలిగి ఉంటారు.

**మిథునం :** వ్యాపారస్తులకు అనుకూలం. ఉద్యోగస్తులకు అనుకూలంగా ఉంటుంది. ఫోన్ సంభాషణలు అధికంగా సాగిస్తారు.

**కర్కాటకం :** మాతృవర్గీయుల నుండి సహాయ సహకారాలను అందుకుంటారు. బుద్ధిబలంతో వ్యవహరిస్తారు.

**సింహం :** అపరిష్కృతమైన సమస్యలకు గాను పరిష్కారమార్గాలు లభించే సూచనలు. సభలు, సమావేశాలకు హాజరవుతారు.

**కన్య :** మీకు రావలసిన ధనం కొంత మేరకు చేతికందుతుంది. లిఖితపూర్వక వ్యవహారాలను సాగిస్తారు.

**తుల :** ఒక వ్యక్తి పరిచయం మీకు ఉపకరిస్తుంది. ఇతరులకు మీరు ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకుంటారు.

**వృశ్చికం :** సాంకేతిక రంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. స్పెక్యులేషన్లకు ఉద్దేశ్యపూర్వకంగానే దూరంగా ఉంటారు.

**ధనుస్సు :** నత్త నడకన ఉన్న పనులలో వేగం కనపడుతుంది. అసహనాన్ని కలిగి ఉంటారు. సమన్యాయంతో వ్యవహరిస్తారు.

**మకరం :** ఆర్థికపరమైన వ్యవహారాలు ఆశించిన స్థాయిలో ఉంటాయి. ప్రచార సాధనాల వల్ల పరోక్షంగా లాభపడతారు.

**కుంభం :** ప్రైవేటు సంబంధమైన లీజులు లైసెన్సులు పొడిగింపబడతాయి. అందరి నుండి సలహాలు తీసుకుంటారు.

**మీనం :** లిఖిత పూర్వక వ్యవహారాలు జరుగవలసిన చోట మాటలతోనే సరిపుచ్చుకోవలసి వస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రైవేటు భూములు 3,73,930 ఎకరాలపైనే వివాదం

### ధరణిని అడ్డంపెట్టుకొని భూములు కొల్లగొట్టిన వ్యవహారంపై 'సెట్' ఏర్పాటు చేస్తాం: అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** ధరణిని అడ్డం పెట్టుకుని భూములను అక్రమంగా కొల్లగొట్టిన వ్యవహారాలపై ప్రత్యేక విచారణ బృందాన్ని సెట్(ఎస్ఈటి) ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. నిషేధిత జాబితా 22ఏపై బుధవారం శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చకు ముఖ్యమంత్రి సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. భూములకు సంబంధించి ప్రధానంగా నాలుగు రకాల సమస్యలు కాలక్రమేణా తలెత్తాయని సవివరంగా సభ ముందు ఆవిష్కరించారు. జరిగిన భూ దోపిడీ వ్యవహారాలన్నింటినీ ప్రత్యేక విచారణ టీమ్‌కు రిఫర్ చేస్తున్నట్టు తెలిపారు. నిజాం కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రస్తుతం ఎదుర్కొంటున్న భూ సమస్యల వరకు వివిధ అంశాలను సభలో వివరించారు.

1908లో ప్రారంభమైన భూ రికార్డుల నుంచి 2011 వరకువివిధ సందర్భాల్లో ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు, వాటి వల్ల ఉత్పన్నమైన పరిస్థితులను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. 1954-55లో వచ్చిన కాస్రా పహానీ, 1955లో ఇనాం భూముల చట్టం రద్దు, వినోబా బావే భూదానోద్యమం, 1965లో తీసుకొచ్చిన చట్టం, గిరిజనులు, ఆదివాసీలకు సంబంధించి 1/70 యాక్ట్, 1989లో కొత్త ఆర్వోఆర్ చట్టం, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ విధానం వంటి అంశాలను వివరించారు.

భూములు అతికొద్ది మంది చేతుల్లో బంధీ అయిన నేపథ్యంలో 1973లో ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని తీసుకొచ్చారని, ఆ తర్వాత 1977లో అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా బదలాయింపును నిషేధించే చట్టం వచ్చిందని తెలిపారు. పోడు భూముల విషయంలో ఆదివాసీలకు రక్షణ కల్పించేందుకు 2006లో యూపీఏ ప్రభుత్వం ఫారెస్ట్ యాక్ట్ తీసుకొచ్చిన విషయాన్ని కూడా ముఖ్యమంత్రి సభలో ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో ధరణి పోర్టల్ ప్రక్రియ ప్రారంభించే వరకు జరిగిన పరిణామాలను కూడా ముఖ్యమంత్రి వివరించారు. 2018లో ధరణి విధానం కోసం ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ సంస్థకు బాధ్యతలు అప్పగించారని, అక్కడి నుంచి టెరాసిస్, ఫాల్కన్ తదితర కంపెనీలకు.. వరుసగా చేతులు మారిన వైనాన్ని విడమరిచి చెప్పారు.

తెలంగాణ రైతాంగానికి సంబంధించిన సుమారు 2.50 కోట్ల ఎకరాల భూముల రికార్డులు, ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతా నంబర్లు, యజమానుల ఫోన్ నంబర్లతో సహ కామెరాన్ హైలాండ్స్‌కు తరలించిన విధానం జరిగిందని ఆరోపించారు. రెవెన్యూ రికార్డులను డిజిటలైజ్ చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా రికార్డులన్నీ విదేశీ శక్తుల చేతుల్లో పెట్టారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భూ కబ్జాలను నిరోధించేందుకు 1982 జూన్‌లో ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని తీసుకొచ్చారని, తెలంగాణ ఏర్పడిన వెంటనే అప్పటి ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసిందని పేర్కొన్నారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారన్న ప్రశ్నించారు. ప్రైవేటు భూములకు సంబంధించి 3,73,930 ఎకరాలపై వివాదం ఉన్నట్లు ముఖ్యమంత్రి సభకు వివరించారు. ప్రజల భూములను కాపాడటంతో పాటు భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు 2025లో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ధరణి పేరుతో జరిగిన అక్రమాలను నిరోధించి ప్రజల ఆస్తులను రకించేందుకు అన్ని వర్గాలతో, అన్ని స్థాయిల్లో చర్చించి, అంశాలను పబ్లిక్ డొమెయిన్‌లో పెట్టి సమగ్ర ప్రక్షాళన దిశగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు.

నిషేధిత భూములకు సంబంధించి 22ఏ సెక్షన్‌ను తమ ప్రభుత్వం తీసుకురాలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలోనే 1999లో తొలిసారిగా సెక్షన్ 22ఏను తీసుకొచ్చారని తెలిపారు. భూదాన, వక్ఫ్, దేవాదాయ, ప్రభుత్వ భూములను రక్షి ంచడమే దీని ఉద్దేశమని వివరించారు.

నిషేధిత భూములను క్లాజుల వారీగా వర్గీకరించాలని 2015 డిసెంబర్‌లో ఫుల్ బెంచ్ తీర్పు ఇచ్చిందని, ఆ తర్వాత కటాఫ్ తేదీ తదితర అంశాల నేపథ్యంలో జరిగిన లావాదేవీలు, పరిణామాలతో వివాదాలు తలెత్తాయని తెలిపారు. ఒక సర్వే నంబర్‌లో ఒకచోట వివాదం ఉంటే మొత్తం సర్వే నంబర్‌ను నిషేధిత జాబితాలో చేర్చడంతో సమస్య మరింత పెరిగిందన్నారు. ఇలా సుమారు మూడు లక్షలుగా ఉన్న వివాదాలు 30 లక్షల ఎకరాలకు పెరిగాయని చెప్పారు.

2020 అక్టోబర్‌లో 7,91,542 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విస్తీర్ణాన్ని 3,73,930 ఎకరాలకు తగ్గించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే పార్ట్-బీలోని వివాదాస్పద భూములను 17 లక్షల ఎకరాలకు తగ్గించామని చెప్పారు. 22ఏ నిషేధిత జాబితాను గత డిసెంబర్‌లోనే అప్‌డేట్ చేసినప్పటికీ చాలామంది ఈ విషయాన్ని గమనించలేదన్నారు.

నిషేధిత జాబితాకు సంబంధించి ప్రధానంగా ఎనిమిది అంశాలకు పరిష్కారం అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టతనిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే నిషేధిత జాబితా కొనసాగుతోందని, ప్రజా ప్రభుత్వం కొత్తగా భూములను జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు. ఇకపై ఏదైనా భూమిని 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చాలంటే సంబంధిత కలెక్టర్ మాత్రమే నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. సంబంధిత వ్యక్తి అభ్యంతరాలు, అవసరమైన రికార్డులను పరిశీలించి, విచారణ చేపట్టిన తర్వాతే భూమిని నిషేధిత జాబితాలో చేర్చాలా లేదా అనే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ నిర్ణయంపై అసంతృప్తి ఉంటే 60 రోజుల్లో అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తామని, ఆ తర్వాత 90 రోజుల్లో రివిజన్ పిటిషన్ దాఖలు చేసుకునే వెసులుబాటు ఉంటుందని వివరించారు.

దేవాదాయ, వక్ఫ్ రికార్డులను పరిశీలించి భూముల స్థితిని నిర్ధారిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. వాటిలో కొంత భాగం మాత్రమే వివాదాస్పదంగా ఉంటే ఆ భాగాన్ని మాత్రమే నిషేధిత జాబితాలో కొనసాగించి, మిగిలిన భూమిని జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు.


నిషేధిత జాబితాపై ప్రజల్లో నెలకొన్న అనుమానాల నేపథ్యంలోనే శాసనసభలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుత సమావేశాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా రంగం, ఎల్‌నినో ప్రభావం, కరవు పరిస్థితులు వంటి కీలక అంశాలపై చర్చించాలని ప్రభుత్వం ముందుగానే నిర్ణయించిందని తెలిపారు. ఈ సీజన్‌లో విద్యుత్ వినియోగం ఒకేరోజు 19,500 మెగావాట్ల అత్యధిక డిమాండ్‌కు చేరిందని పేర్కొన్నారు. ఇలా అన్ని ప్రధాన అంశాలపై చర్చ జరగాలని ప్రభుత్వం భావించిందన్నారు.

వారసత్వంగా వచ్చిన సమస్యలపై శాసనసభలో చర్చించుకున్న తర్వాత తప్పిదాలకు తావులేకుండా ప్రతిపక్షాలు అవసరమైన సూచనలు ఇస్తే ప్రభుత్వం తప్పకుండా పాటిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రాష్ట్రంలో నిరుపేదలకు చెందాల్సిన లక్ష కోట్ల రూపాయల విలువైన భూములు దోపిడీకి గురయ్యాయని ఆయన అన్నారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, భూముల దోపిడీని క్షమిస్తే భవిష్యత్ తరాలు క్షమించవని వ్యాఖ్యానించారు.

ధరణిని అడ్డం పెట్టుకుని అడ్డగోలు దోపిడీకి పాల్పడిన వ్యవహారాలను ప్రభుత్వం ఉపేక్షించబోదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

అలాంటి అన్ని వ్యవహారాలను ప్రత్యేక విచారణ బృందానికి రిఫర్ చేస్తామని, భూ దోపిడీకి పాల్పడిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తామని సభలో ప్రకటించారు.



జనాభా లెక్కల ప్రశ్నావళిలో ఒబిసికి ప్రత్యేక కాలమ్ పెట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాంచీలోని లోక్‌భవన్ వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కెసిఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

>> మంత్రులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కేసీఆర్ ధరణి పేరిట వేల ఎకరాలను కొల్లగొట్టారని, ఆ దందాల చిట్టా బయటపడుతుందనే భయంతోనే బబుల్ షూటర్(హరీశ్‌రావును ఉద్దేశించి) సలహాతో కేసీఆర్ సభ నుంచి పారిపోయారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. 700 ఎకరాల ఫామ్ హౌస్ కేసీఆర్‌కు ఉందో? లేదో తేల్చాలన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఫామ్ హౌస్‌లో ప్రభుత్వ భూమి ఉందని తేలితే 800 దళితుల కుటుంబాలకు అర ఎకరం పంచుతామని ప్రకటించారు. శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని ఘంటాపథంగా చెప్పారు. "సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.13 ఎకరాలు ఉంది. కేటీఆర్ కుటుంబానికి 123.19 ఎకరాలు, హరీశ్ రావు కుటుంబానికి 30.16 ఎకరాలు, కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37.26 ఎకరాలు, జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79.20 ఎకరాలు, నవీన్‌రావు,కొండల్‌రావు కుటుంబానికి 101.14 ఎకరాలు ఉంది. మొత్తంగా కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాల్లోని 24 మండలాల్లో 31 గ్రామాల్లో 439 ఎకరాలున్నాయి' అని చెప్పారు. సత్యం రామలింగరాజు కంపెనీల నుంచి కెటిఆర్‌కు జన్వాడ భూములు వచ్చాయని, కేటీఆర్ జన్వాడ పామ్‌హౌస్‌పై నేనెందుకు బాంబులు వేస్తా? ఆయనేమైనా బిన్‌లాడెనా.. ఆయనను రోడ్డు మీద పిచ్చికుక్క కూడా కరవదు. స్టీఫెన్‌సన్‌కు ఎన్నికల ముందు నజరానా ఇచ్చారు.

రూ.50 కోట్ల భూమిని రూ.1.53 కోట్లకే రెగ్యులరైజ్ చేశారు. గంగుల, ఎర్రబెల్లి, సుధీర్ రెడ్డి 650 ఎకరాల ప్రభుత్వ భూమి కొనుగోలు చేశారు. జగదీశ్ రెడ్డి 50 ఎకరాల ఫామ్ హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చింది. పైలట్ రోహిత్‌రెడ్డి అజీజ్ నగర్‌లో అసైన్డ్ భూమిలో పామ్ హౌస్ కట్టుకున్నారు. ఒక కుటుంబానికి కుష్కి పొలం 54, తరి పొలమైతే 27 ఎకరాలుండాలి. కానీ, కేసీఆర్‌కు ఉన్నది మొత్తం తరి పొలమే" అని సీఎం వివరించారు.

### కెసిఆర్ కుటుంబ ఆధీనంలోని భూముల వివరాలు

| కుటుంబం | కుటుంబ సభ్యులు | ప్రాంతాలు | భూములు |
|---|---|---|---|
| కెసిఆర్ కుటుంబం | కెసిఆర్, ఆయన భార్య | సిద్దిపేట జిల్లా,ఎర్రవల్లి, మిట్టపల్లి,శివార్ వెంకటాపూర్ | 67.13 ఎకరాలు |
| కెటిఆర్ కుటుంబం | కెటిఆర్, ఆయన భార్య శైలిమ కుమార్తె అలేఖ్య, కుమారుడు హిమాన్షు | సిద్దిపేట,రంగారెడ్డి జిల్లాలు, ఎర్రవల్లి,జన్వాడ,మార్కుక్, శివార్ వెంకటాపూర్ | 123.19 ఎకరాలు |
| కవిత కుటుంబం | కవిత, ఆమె భర్త | మహబూబ్‌నగర్, రంగారెడ్డి, జగిత్యాల నిజామాబాద్,రాజన్న సిరిసిల్ల జిల్లాలు 8 మండలాలు,8 గ్రామాలు | 37.26 ఎకరాలు |
| హరీశ్‌రావు కుటుంబం | హరీశ్‌రావు, ఆయన భార్య | రంగారెడ్డి,సిద్దిపేట జిల్లాలు,మిట్టపల్లి నందిపల్లి,రామంచ,అజీజ్‌నగర్ | 30.26 ఎకరాలు |
| జోగినిపల్లి కుటుంబం | రవీందర్‌రావు, సంతోష్‌కుమార్ సంతోష్‌కుమార్ భార్య రోహిణి | 5 జిల్లాలు,9 మండలాలు,12 గ్రామాలు | 79.20 ఎకరాలు |
| నవీన్‌కుమార్- కొండల్‌రావు కుటుంబం | నవీన్‌కుమార్, కొండల్‌రావు | మేడ్చల్-మల్కాజ్‌గిరి-రంగారెడ్డి,సంగారెడ్డి సిద్దిపేట జిల్లాలు,7 మండలాలు,9 గ్రామాలు | 101.14 ఎకరాలు |
| మొత్తం | | 9 జిల్లాలు,24 మండలాలు,31 గ్రామాలు | 439.30 ఎకరాలు |

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

### చెరువులో దిగిన ఆరుగురు విద్యార్థులు మృతి

### పటాన్ చెరులోని ప్రాచిన్ ఆస్పత్రిలో నర్సింహా రాజు, సుమంత్, గణేష్, ఉదయ్ కిరణ్, తేజ, సిద్ధార్థ్ మృతదేహాలు

### తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతి చెందారు. నిమజ్జనం కోసం నేరేడుచెరువులో దిగి విద్యార్థులు మృతి చెందారు. మృతులంతా పెద్ద కంచర్ల చెందిన శిరీష చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులుగా గుర్తించారు. మృతులు నర్సింహా రాజు, సుమంత్ (డిప్లొమా సెకండ్ ఇయర్), గణేష్ (డిప్లొమా సెకండ్ ఇయర్), ఉదయ్ కిరణ్ (డిప్లొమా థర్డ్ ఇయర్), శ్యామ్ కుమార్ (డిప్లొమా ఫస్ట్ ఇయర్), సిద్దార్థ్ (టెన్త్ క్లాస్). విద్యార్థుల మృతి పట్ల పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాచీన గ్లోబల్ ఆసుపత్రికి వెళ్లి విద్యార్థుల మృతదేహాలకు నివాళి అర్పించారు. గురువారం ఉదయం 10 గంటల లోపు పోస్టుమార్టం పూర్తి చేయాలని, తదనంతరం వారి వారి సొంత స్థలాలకు అంబులెన్స్ లో తరలించాలని అధికారులను ఆదేశించారు. సొంత నిధులతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ప్రాచిన్ ఆస్పత్రికి సైబరాబాద్ డిసిపి శ్రీనివాస్ చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఒకేసారి ఆరుగురు విద్యార్థులు చెందడం పట్ల ఆయన తీవ్రంగా కలత చెందారు. శిరీష ట్రస్ట్ శివనగర్ చౌరస్తా పెద్దకంజర్ల. 70 మంది విద్యార్థులు,ఒకటవ తరగతి నుండి పాలిటెక్నిక్, బిటెక్ విద్యార్థులు ఉన్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు మాత్రమే ట్రస్టులో చేర్చుకుంటారు. ఆంధ్రకు చెందిన కృష్ణంరాజు అనే వ్యక్తి తన కుమార్తె శిరీష పేరు మీద ట్రస్ట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతి చెందడంతో పటాన్ చెరు ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది.

### వివేకా హత్య కేసు

# ముగ్గురు నిందితులకు సిబిఐ కోర్టులో చుక్కెదురు

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ముగ్గురు నిందితులకు నాంపల్లి సిబిఐ కోర్టులో చుక్కెదురైంది. తమపై నమోదైన అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని ఈ కేసులో నిందితులుగా వున్న ఎర్ర గంగిరెడ్డి (ఎ1), ఉమాశంకర్ రెడ్డి (ఎ3), గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి (ఎ6) దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను సిబిఐ ప్రత్యేక కోర్టు తోసిపుచ్చింది. వీరి పిటిషన్లకు ఎలాంటి విచారణార్హత లేదని సిబిఐ కోర్టు న్యాయమూర్తి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వివేకా హత్య కేసుపై బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా సిబిఐ అధికారులు హాజరై కేసుకు సంబంధించి విచారణ తీరు తెన్నులను వివరించారు. ఇదే సమయంలో ముగ్గురు నిందితుల తరపున డిశ్చార్జి పిటిషన్లపై విచారణ జరగగా న్యాయమూర్తి దానిని డిస్మిస్ చేశారు. ఈ సందర్భంగా సిబిఐ తరపున హాజరైన న్యాయవాది మాట్లాడుతూ ముగ్గురు నిందితుల డిశ్చార్జి పిటిషన్ డిస్మిస్ అవడంతో పూర్తిస్థాయి ట్రయల్‌ను ఎదుర్కొన వలసిందేనని తెలిపారు.

## నాంపల్లి కోర్టును ఆశ్రయించిన ఐ బొమ్మ రవి




**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** టాలీవుడ్, బాలీవుడ్ సినిమాలను విడుదలకు ముందుగా లేదా విడుదలైన మొదటి రోజే పైరసీ చేసి తన వెబ్ సైట్‌లు బప్పం టివి, ఐ బొమ్మలో వుంచిన కేసులో అరెస్టయిన పైరసీ కేటుగాడు ఎన్ఆర్ఐ ఇమ్మంది రవి అలియాస్ ఐ బొమ్మ రవి నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. రెండేళ్లపాటు సినీ రంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన రవిని గత ఏడాది నవంబర్ నెలలో హైదరా బాద్ పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. సినీ పైరసీ కేసులో మూడు నెలలకు పైగా జైల్లో వుండి బెయిల్‌పై విడుదలైన రవి పాస్‌పోర్టును కూడా జప్తు చేశారు. ఎపిలోని వైజాగ్‌కు చెందిన రవి భారత పౌరసత్వం వదిలి కరేబియన్ పౌరసత్వం తీసుకోవడంతో అతను ఎన్ఆర్ఐగా మా రాడు. ప్రస్తుతం తనకు తెలిసిన వారి వద్ద వుంటున్న రవికి భార్యతోనూ విబేధాలున్నాయి. అరెస్టు తరువాత అతని బ్యాంకు ఖాతాలను పో లీసులు జప్తు చేయడంతో రోజువారి ఖర్చులకు ఇబ్బందిగా మారిందని రవి నాంపల్లి కోర్టును ఆశ్రయించాడు. పోలీసులు జప్తు చేసిన తన ఖాతా లను వెంటనే నిర్వహణలోకి అనుమతించాలని అతను కోర్టును కోరాడు. దీనిపై విచారణ చేబట్టిన నాంపల్లి కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది.

## ఓటుకు నోటు కేసుపై సుప్రీంకోర్టులో విచారణ

### దీనిపై విచారణ జరిపే పరిధి ఎసిబికి లేదన్న పిటిషనర్ల తరపు లాయర్లు

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

# సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు సిద్ధం

### సిఎం రేవంత్‌రెడ్డితో సింగపూర్ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ బృందం భేటీ



బుధవారం సిఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన సింగపూర్ బృందం

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు సింగపూర్ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖకు చెందిన ఇంధన – వాణిజ్య విభాగం ప్రకటించింది. సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ పర్మనెంట్ సెక్రెటరీ ఆగస్టీన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డితో సమావేశమైంది. బుధవారం అసెంబ్లీలోని చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో పారిశ్రామిక పెట్టుబడులపై చర్చలు జరిగాయి. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న సానుకూల అంశాలను ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక పరమైన సహకారం అందించాలని కోరారు. పెట్టుబడులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు.

డిసెంబర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా ఆగస్టీన్ లీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సింగపూర్ ప్రతినిధులకు వివరించారు. తొలిదశలో మూసా, ఈసా నదుల సంగమం గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవనం చేపడుతున్నట్టు తెలిపారు.

మూసీ రివర్‌ఫ్రంట్‌తో పాటు నైట్ ఎకానమీ అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేసినట్టు తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని పర్యాటకంగానే కాకుండా ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ యూని వర్సిటీ,ఎంఐటి, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పెట్టుబడులపై సానుకూలంగా స్పందించిన సింగపూర్ ప్రతినిధి బృందం సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయ డానికి సానుకూలంగా ఉన్నట్టు ఈ సందర్భంగా వెల్లడించింది.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, సింగపూర్ మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, సింగపూర్ కాన్సుల్ జనరల్ విలియం చిక్‌తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# 10మంది నక్సలైట్లకు ఉరిశిక్ష

### చత్తీస్‌గఢ్‌లో 2013 నాటి దాడిఘటనలో ఎన్ఐఎ కోర్టు సంచలన తీర్పు

### నాటి ఘటనలో 29 మంది మృతి

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్‌లో బస్తర్ జిల్లా జీరం ఘాటిలో 2013 మే 25వ తేదీన కాంగ్రెస్ పార్టీ చేబట్టిన పరివ ర్తన్ యాత్ర కాన్వాయ్‌పై మావోయిస్టులు జరిపిన భీకర దాడికి సంబంధించి జగ్‌దల్‌పూర్‌లోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ప్రత్యేక కోర్టు పది మంది నక్సలైట్లకు ఉరిశిక్ష విధిస్తూ బుధవారం నాడు సంచల తీర్పును వెలువరించింది. దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన జీరం ఘాటి ఘటనలో కాంగ్రెస్ సీనియర్ నాయకులతో పాటు సామాన్యులు మొత్తం 29 మంది చనిపోయారు. మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా, అ ప్పటి పిసిసి అధ్యక్షుడు నందకుమార్ పటేల్, నక్సలైట్లకు వ్యతిరేకంగా సల్వాజుడుం అనే సంస్థను స్థాపించి, గ్రామీణ యువకులకు ఆయుధా లు అందేలా చేసిన మహేంద్ర కర్మ, మాజీ ఎంఎల్‌ఎ ఉదయ్ ముదలియార్ తదితర ప్రముఖులు మరణించిన వారిలో వున్నారు. ఈ దాడితో ఛ త్తీస్‌ఘడ్‌లో అప్పట్లో కాంగ్రెస్ పార్టీ నాయకత్తం పూర్తిగా తుడిచి పెట్టుకు పోయింది. అప్పట్లో ఛత్తీస్‌ఘడ్‌లోని అనేక ప్రాంతాలలో నక్సలైట్ల ప్ర భావం తీవ్రంగా వుండేది. మావోయిస్టులు 200 మంది వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకుని వారు ప్రయాణించిన మార్గంలో ముందుగానే మందు పాతరలు అమర్చారు. కాన్వాయ్ ఈ ప్రాంతానికి రాగానే వాటిని పేల్చారు. అనంతరం కాన్వాయ్‌లో వున్న వారిపై విచక్ష ణారహితంగా కాల్పులు జరిపారు. నక్సలైట్ల దాడిలో 29 మంది మరణించగా వంద మంది వరకు గాయపడ్డారు. గాయపడ్డ వారిలో చాలా మ ంది ఏళ్ల తరబడి ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఈ దాడి దరిమిలా సిఆర్‌పిఎఫ్ బలగాలు, రాష్ట్ర బలగాలు రంగంలో దిగి జీరం ఘాటి ప్రా ంతాన్ని నిర్బంధించి కొన్ని నెలల పాటు కూంబింగ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా పలుచోట్ల ఎదురు కాల్పులు జరిగాయి. ఇందులో నక్సలైట్లతో పాటు పోలీసులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసును మొదట స్థానిక పోలీసులు విచారించగా ఆ తరువాత ఎన్ఐఎ విచారణ చేబట్టి ంది. జగ్‌దల్‌పూర్‌లో ఏర్పాటైన ఎన్ఐఎ కోర్టులో జీరం ఘాటి ఘటనకు సంబంధించి 13 ఏళ్లకు పైగా విచారణ జరిగింది. ఈ దాడికి సంబం ధించి ఎన్ఐఎ పోలీసులు 20 మందికి పైగా మావోయిస్టులను నిందితులుగా చేర్చి వారిపై అభియోగాలు మోపారు. ఇందులో కొందరు మరణి ంచగా మరికొందరు అజ్ఞాతంలో వెళ్లారు. చివరగా దీనిపై బుధవారం నాడు ఎన్ఐఎ కోర్టు తీర్పు చెబుతూ పది మంది మావోయిస్టులను దోష లుగా తేలుస్తూ వారికి ఉరిశిక్ష విధించింది.

భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఎ కోర్టు నక్సలైట్లకు ఉరిశిక్ష విధించింది. భారత రాజకీయ, భద్రతాపరమైన చరిత్రలో ఇది అతిపెద్ద దాడిగా పోలీసులు అభివర్ణించా రు. ఉరిశిక్ష పడ్డ మావోయిస్టులు ప్రమీల మోడియం, చైతు లేకం అలియాస్ మున్నా, సుమిత్రా పునెం మోడియం, ముక్కా మాండవి, కోసా కవాసి, అయి తా మార్కం, మడకమి దేవా, జోగా మడ్కమి, టాంజామి సన్నా, మహాదేవ్‌లు వున్నారు. ఎన్ఐఎ కోర్టు తీర్పును ఛత్తీస్‌ఘడ్ స ర్కారు స్వాగతించింది. ప్రజాస్వామ్య దేశంలో హింసకు తావులేదని పేర్కొంది. 13 ఏళ్ల తరువాతైనా బాధితులకు న్యాయం జరిగిందని, దోషుల కు శిక్ష పడిందని ఆ రాష్ట్ర సర్కారు వెల్లడించింది.

# తెలంగాణకు భారీ వర్ష సూచన

### 5 రోజులు వానలే వానలు, పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** కర్ణాటక నుంచి నైరుతి బంగాళాఖాతం వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావం కొనసాగుతోందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ ద్రోణి నాటికి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు విస్తరించిందని, దీని ఫలితంగానే రాష్ట్రంలో వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. ముఖ్యంగా తెలంగాణలో ఈ నెల 17 నుంచి రాబోయే ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలపై వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండనుందని అధికారులు స్పష్టం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాష్ట్రంలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా ఈ నెల 19, 20, 21 తేదీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రజలను, అధికారులను అప్రమత్తం చేస్తూ వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. వర్షాల సమయంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకపోవడం మంచిదని హెచ్చరించారు. కాగా ద్రోణి ప్రభావంతో తెలంగాణలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. మొన్నటివరకు వర్షాలు పడకపోగా, రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో కూడా రెండ్రోజుల పాటు వానలు దంచికొట్టాయి. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ద్రోణి ప్రభావం ఎక్కువగా ఉంటుందని, దీని వల్ల వర్షాలు పడతాయని వాతావరణశాఖ పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అలర్ట్ జారీ చేసింది. వర్షాల క్రమంలో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలు తగ్గే అవకాశముందని తెలిపింది.

## డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ నిందితుల రూ.6.55 కోట్ల ఆస్తుల జప్తు

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డ్రగ్స్ కేసులో నిందితుల భరతం పడుతున్న ఈగల్ పోలీసులు ఇదే సమయంలో నిందితులు మాదకద్రవ్యాల అమ్మకం వల్ల సంపాదించిన ఆస్తులను వరుసగా జప్తు చేస్తూ పోతున్నారు. వారం రోజుల క్రితం నిజామాబాద్ జిల్లాలో కల్తీ కల్లు తయారీకి వాడే అల్ప్రాజోలం, హైడ్రో క్లోరైడ్ విక్రయాలు జరిపి ఇలా వచ్చిన సొమ్ముతో ఐదుకోట్ల రూపాయలకు పైగా ఆస్తులు సంపాదించిన వారిపై కొరడా ఝుళిపించిన ఈగల్ పోలీసులు వారి ఆస్తులను జప్తు చేయడం తెలిసిందే. తాజాగా బుధవారం సైబరాబాద్ పరిధిలో కొకైన్ సహా పలురకాల డ్రగ్స్ విక్రయాలు జరిపి ఆస్తులు కొన్న ఉగ్వు ఇకెచుక్వు, మహమ్మద్ మతీన్, సయ్యద్ అబ్దుల్ అజీజ్, సయ్యద్ నసీర్, సయ్యద్ యూసుఫ్ హక్, శాంతిలాలన సురేష్ కుమార్ జైన్, ఉత్తంజైన్‌లకు సంబంధించిన ఆరు కోట్ల 55 లక్షల రూపాయల ఆస్తులను ఈగల్ జప్తు చేసింది. ఏడాది క్రితం వీరిని అరెస్టు చేయగా వీరి వద్ద డ్రగ్స్‌తోపాటు ఎనిమిది సెల్‌ఫోన్లు, మూడు లాప్‌టాప్‌లు, రెం డు పెన్ డ్రైవ్‌లు, 45వేల నగదు జప్తుచేశారు. నిందితులపై పలు రకాల సెక్షన్లు నమోదు చేసి జైలుకు తరలించారు. ఈ కేసు లో అక్రమాస్తులను జప్తు చేసేందుకు ఎన్‌సిబి కోర్టు అనుమతి లభించడంతో ఈగల్ అధికారులు వీటిని జప్తు చేశారు. ఎన్‌డిపిఎస్ చట్టంలోని సెక్షన్ 68 (ఎఫ్) కింద వీటిని జప్తు చేసినట్లు ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా బుధవారం మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా 1908 లేదా 8712671111కు వెంటనే తెలపాలని ఆయన కోరారు.


తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం: ఆందోల్-జోగిపేట జిల్లా : సంగారెడ్డి
ఇ-మెయిల్ : meandolejogipet@gmail.com

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన


టెండర్ ప్రకటన నం: E1/MC/AJPT/Engg/48/2026-27 తేదీ: 13.08.2026

పనుల సంఖ్య : 02. ఆందోల్ జోగిపేట మునిసిపాలిటీలో 15వ FC గ్రాంట్స్/MGF క్రింద అందనా ధర రూ: 10.00 లక్షలకు వివిధ ప్రదేశాల వద్ద LED వీధి దీపాల సరఫరా మరియు అమర్చుట మరియు MGF 2025-26/ఇతర నిధులు క్రింద ఆందోల్-జోగిపేట మునిసిపాలిటీలో ఆందోల్ చెరువు వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జనం కొరకు ఏర్పాట్లు చేయుట". యొక్క ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై టెండర్‌లు కోరబడుతున్నవి. టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్‌కు ప్రారంభించు తేదీ : 17.09.2026. టెండర్ దాఖలుకు చివరి తేదీ & సమయం: 23.09.2026 ఉ.10.30గం. వరకు. టెక్నికల్ బిడ్ తెరచుటకు తేదీ & సమయం : 23.09.2026 ఉ.10.30గం. వద్ద. ఫైనాన్షియల్ బిడ్ తెరచుటకు తేదీ & సమయం: 23.09.2026 మ.3.00గం. వద్ద.

సం/-. కమిషనర్, ఆందోల్-జోగిపేట మునిసిపాలిటీ.

DIPR.NO. 10083-PP/CL/ADVT/1/2026-27, తేదీ: 16.09.2026





వార్త

మనల్ని గురించిన మన అభిప్రాయాల కన్నా, మన శత్రువుల భావాలే యదార్థానికి దగ్గరగా ఉంటాయి.

- రోష్ షోకాల్డ్

# 'ట్రామా'లో ఔషధ నియంత్రణ

రోగి శరీరాన్ని డాక్టర్లు పరిశీలించే లోగానే కొంత మంది జనం మందుల షాపుల్లో దొరికే వైద్యానికి అలవాటు పడ్డారు. మరికొంత మందైతే సొంత వైద్యానికి తాపత్రయ పడ్తుంటారు. డాక్టరు వద్దకెళ్తే భారీ ఫీజు, పలు రకాల పరీక్షలు ఎడాపెడా దోపిడీ తట్టుకోలేమని చిట్కాల వైద్యం మీద కూడా ఆధారపడుతున్నారు. ఏమాత్రం మోతాదుల్లో తేడా ఉన్నా ఆ శరీరంపై వాటి ప్రభావం ఎక్కువగా ఉండి కొత్త కొత్త రోగాలు పీడిస్తాయి. సైడ్ ఎఫెక్ట్స్‌తో శరీరం రోగ గ్రస్తమవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో సొంతవైద్యం, మందుల షాపుల్లో రోగ లక్షణాలు చెప్పి మందులు తెచ్చుకునే వైద్యానికి జనం అలవాటుపడ్డారు. తాజాగా డాక్టర్లు రాసే ఔషధ చీటీలు ప్రిస్క్రిప్షన్‌లో సమగ్రంగా స్పష్టంగా ఉండాల్సిందేనని జాతీయ ఆరోగ్య మిషన్ కొత్త మార్గదర్శకాలతో 'ప్రిస్క్రిప్షన్ ఆడిట్'ను విడుదల చేసింది. వీటిని డాక్టర్లు విధిగా పాటించాలి. అలాగే మందుల షాపుల్లోనూ నిర్దేశిత చీటీ లేనిదే మందుల విక్రయం చేయబోమనే స్థాయికి మందుల షాపు యజమానిని కూడా సిద్ధం చేయాలి. అలా చేయలేని ఇరు వర్గాలకు విధి విధానాలు అలవాటు చేయాల్సిన అవసరమొచ్చింది. మందుల చీటితో నిమిత్తం లేకుండా కొన్ని మందులను మత్తు పదార్థంగా వాడే వారికి అక్రమ మార్గంలో విక్రయించిన షాపు యజమానులు జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందేనన్న విషయం మరో తాజా ఉదంతం తెల్చి చెప్పేసింది. తీవ్ర నొప్పి నివారణకు 'ట్రమడాల్' అనే మందుకు డాక్టర్లు రాస్తుంటారు. కానీ ఇలాంటి మందులు వైద్యసలహా లేకుండా వినియోగిస్తే, అది ప్రాణాంతకమే అవుతుంది. ఈ నేపథ్యం తెలుసుకోకుండా కేవలం వాటిని మత్తు కలిగించే పదార్థాలుగా సేవిస్తే మానవ శరీరానికి మేలుకన్నా కీడే ఎక్కువ. మంగళవారం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన తనిఖీలలో దాదాపు 55 షాపుల్లో అనవసర మందుల విక్రయాలు చేసిన వైనాన్ని ఔషధ నియంత్రణ అధికారులు పసికట్టారు. ట్రమడాల్ మందుల అక్రమ వినియోగం, అనధికారిక నిల్వ విక్రయాలపై ఔషధ నియంత్రణ అధికార్లు చేపట్టిన దాడులలో ఆందోళనకర విషయాలు వెల్లడయ్యాయి. ఒక నియంత్రణ ఔషధం సరఫరా గొలుసు నుంచి బయటకు వెళ్లి అక్రమ వినియోగదారుల చేతికి చిక్కితే మానవాళికి ప్రమాదమే. ఇలాంటి ఔషధాల నియంత్రణ, పర్యవేక్షణలో ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉండాల్సిందే. వీటి వినియోగంలో ఏమాత్రం తేడా జరిగినా శరీరంపై దుష్ప్రభావాలు కలుగుతాయి. ఇటీవలి తనిఖీల్లో భారీ మొత్తంలో 'ట్రమడాల్' ఇంజెక్షను కూడా పట్టుబడ్డాయి. వాటి విక్రయాలకు ఎక్కడా రికార్డులు లేవు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలో మందుల షాపుల వారు ఇలాంటి అక్రమ వ్యవహారాలకు పాల్పడుతున్న ఉదంతాలున్నాయి. కొద్ది రోజుల క్రితమే ఎలాంటి వైద్య కోర్సులూ చదువుకోకుండా సర్జరీలు కూడా చేస్తున్నా నకిలీ డాక్టర్లను హైదరాబాద్‌లో పదుల సంఖ్యలో పట్టుకుని కేసులు పెట్టారు. గతంలోనూ కొందరు నకిలీ డాక్టర్లను పట్టుకుని కేసులు పెట్టినా, మళ్లీ కొత్త వాళ్లు కొందరు పట్టుకొచ్చారు. వీళ్లెవరికీ చట్టం అన్నా, పట్టుబడితే బతుకు తెరువుకు మొదటికే మోసం వస్తుందనే భయం కూడా లేదు. తాజాగా 'ట్రమడాల్' ఇతర కఠిన విక్రయ నిబంధనలున్నా ఔషధాలు అక్రమమార్గంలో ఎల్లలుదాటిన ఆచూకీ దొరికింది. ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డి గూడెంలో ఇలాంటి దందా ఔషధ నియంత్రణ అధికారులకు దొరికిపోయింది. రాష్ట్రవ్యాప్త తనిఖీలకు దారితీసిన ఘటనచాలా విచిత్రంగా వెలుగులోకి వచ్చింది. జీలుగుమిల్లి మండలంలోని వేగవరం గ్రామంలోని ఆయిల్‌పామ్‌తోటలో భారీ సంఖ్యలో ఖాళీ, పగిలిన ఇంజక్షన్ సీసాలు, వినియోగించిన సిరంజీలు ప్రత్యక్షమయ్యాయి. దాంతో అనుమానంతో జంగారెడ్డి గూడెం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అవి దొరికినతోటలో పరిశీలించారు. ఆ తనిఖీల్లో ట్రామాడెక్స్, ట్రమెక్ పేర్లతో ఉన్న ట్రమాడాల్ ఇంజెక్షన్లుగా గుర్తించారు. 'ట్రమాడోల్' నొప్పి నిరోధక మాత్రగానూ, ఇంజెక్షన్లు గానూ వాడతారు. కానీ దీనికి మత్తుకలిగించే గుణం ఉండడంతో మాదక ద్రవ్యాలకు ప్రత్యామ్నాయంగా వినియోగిస్తారు. వికటిస్తే శ్వాసకోశ సమస్యలు తప్పవు. నాడీవ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ట్రమాడోల్ తయారీ సంస్థల సరఫరా విషయాలు చూస్తే వైద్యుల సూచన మేరకు, నిబంధనల ప్రకారమే, మోతాదులు వాడాల్సిన ఔషధం విచ్చలవిడిగా రోడ్డెక్కేసింది. ఇది ప్రమాదకర సంకేతాన్ని సూచిస్తుండడంతో రెండు రాష్ట్రాలలో ఆ ఔషధ సరఫరా రికార్డులు తనిఖీ చేశారు. జంగారెడ్డి గూడెంలోని రెండు మందులదుకాణాల నుంచి సరైన బిల్లులు రికార్డులు లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ యేదాదిమొత్తం మీద రెండు బిల్లుల ద్వారా ట్రమాడోల్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు బయటపడింది. అవి ఎక్కడ విక్రయించారో వెదకడంతో తీగలాగితే డొంకంతా కదిలినట్లు పలు వివరాలు వెల్లడయ్యాయి. మరో షాపు గత రెండేళ్లలో 5200ట్రామెక్ ఇంజక్షన్లు కొనుగోలు చేసి తెలంగాణలోని మందుల దుకాణానికి విక్రయించినట్లు నకిలీ బిల్లులు సృష్టించారు. ఈ ఔషధాలు ఎక్కడి నుంచి ఎక్కడికి సరఫరా అయినా అధిక మోతాదుల్లో వాడకం దుష్ప్రభావాలు కలిగిస్తుంది. పైగా సొంతంగా వాడుకునే వారు మత్తు పదార్థాలుగా వినియోగించడం మరీ దుష్ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో ఐదుగురికి జంగారెడ్డి గూడెం పోలీసులు అరదండాలు వేసారు. మందుల షాపుల యజమానులు ఉన్నారు. ఈ వ్యవహారాలపై ఉభయ రాష్ట్రాల ఔషధ నియంత్రణ పరిపాలనశాఖ ఔషధాల అక్రమ రవాణా, వాడకాలపై నిఘామరింత పెంచాలి. మానవుని జీవన ప్రమాణాలను తగ్గించే ఔషధాల విషయంలో అప్రమత్తత, అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మధ్యకాలంలో మత్తును కలిగించేందుకు విజయవాడలో అధిక స్పిరిట్ అమ్మకాల విషయం కూడా బయటపడినందున ప్రత్యేక బృందాలతో దర్యాప్తు అవసరం ఉంది.

ఉన్నత స్థానానికి ఎదగడానికి సాధనంగా ఉపయోగపడటమే రాజకీయాల లక్షణం.



శామ్యూల్ జాన్సన్

బహిరంగంగా కనిపించే మురికి గుంటలకన్నా మనసులో మాలిన్యంగల వ్యక్తుల వల్లే జాతికి ప్రమాదం.



డా॥ రాధాకృష్ణన్

# ప్రజావాక్కు



### బీఎస్ఎన్ఎల్ టారీఫ్ మార్పులు

గతంలో బీఎస్సెన్నెల్ వారి 107 టారిఫ్ ప్లాన్ ప్రకారం పరిమిత కాల్స్‌తో 35రోజులు సెల్‌ఫోన్లో మాట్లాడే సౌకర్యం వుండేది. అది నెట్ అవసరం లేని చిన్న సెల్‌ఫోన్లు వాడుకునే వారికి ఎంతో ప్రయోజనకరంగా వుండేది. తాజాగా ఆ ప్లాన్ ఎత్తివేసి, కనీసం రూ.147తో 24 రోజులపాటు అపరిమితంగా ఎంతసేపైనా మాట్లాడుకోవచ్చనే పథకం పెట్టారు. ఫలితంగా ఫ్రీగా వచ్చిందని ఫినాయిల్ తాగినట్లు వుచితమేనన్న భరోసాతో కొందరు గంటలకొద్దీ మాట్లాడుతూ ఇతరుల సమయం వృథా చేస్తూ, తమ ఆరోగ్యం కూడా పాడు చేసుకుంటున్నారు. కనుక ఈ 147 పథకాన్ని రోజుకి గంట ఉచిత టాక్ టైంతో 35 రోజుల వరకు పొడిగించి ఇంకా మాట్లాడుకునే వారికి, ఆ అదనపు సమయంలో నిమిషానికి పావలా గాని అర్ధ రూపాయిగాని చార్జీ విధిస్తే, వినియోగదారులకి క్రమశిక్షణ, ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### అన్ని ప్రాంతాలపై ప్రభావం

నేపాల్-టిబెట్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన విపత్తు హిమాలయ పర్యావరణవ్యవస్థ ఎంత సున్నితమైనదో, ప్రకృతి వైపరీత్యాల ముందు మానవ సమాజం ఎంత బలహీనంగా ఉందో మరోసారి గుర్తుచేసింది. వరదలు, కొండచరియలు విరిగిపడటం, హిమ సరస్సులు ఉప్పొంగడం వంటి ఘటనలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భౌగోళికంగా, పర్యావరణపరంగా, భౌగర్భికంగా హిమాలయాలు అత్యంత సున్నితమైన ప్రాంతం. వాతావరణ మార్పుల ప్రభావం కూడా ఇక్కడ ప్రపంచ సగటుతో పోలిస్తే వేగంగా కనిపిస్తోంది. ఉష్ణోగ్రతల పెరుగుదల మంచు కరగడాన్ని వేగవంతం చేసి, హిమ సరస్సుల విస్తరణకు, ఆకస్మిక వరదల ముప్పుకు కారణమవుతోంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### విదేశాలకు దివ్యాంగులు!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా బోధన రంగంలో విదేశాలలో బోధన విధానంపై పరిశోధనలు చేయడానికి గాను టీచర్స్, లెక్చరర్స్‌ను పంపడం చాలా సంతోషకరం. అదేతరహాలో వికలాంగులైన విద్యార్థులకు విద్యా బోధన చేయడానికి దివ్యాంగులైన టీచర్స్, లెక్చరర్స్‌ను కూడా ఎంపిక చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

### దేశ గౌరవం పెంచిన బ్రిక్స్ సదస్సు

భారత్ నాయకత్వంలో ఢిల్లీలో ముగిసిన బ్రిక్స్ దేశాల 18 వ సదస్సు విజయవంతమై దేశ గౌరవాన్ని పెంచింది. అంతర్జాతీయంగా భారత్ పలుకుబడిని, బలాన్ని పట్టి చూపింది. దాదాపు ప్రపంచంలో సగం జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశాలు, ఆర్థికంగా, మార్కెట్ పరంగా శాసించగల స్థాయిలో ఉన్న గ్లోబల్ సౌత్ దేశాలు ఒక వేదికపైకి రావడం, ఉమ్మడి ప్రకటన చేయగలగడం కీలక పరిణామం. అది భారత్ దౌత్య వ్యూహంతోనే సాధ్యమైంది. అలా అని బ్రిక్స్ దేశాల మధ్య అంతరాలు లేవని కాదు. తమ మధ్య ఉన్న విభేదాల్ని పక్కకు పెట్టి, ఉమ్మడి లాభం కోసం ముందుకు రావడమే ప్రస్తుత కాలంలో పెద్ద విజయం. భారత్, చైనా మధ్య సరిహద్దు వివాదాలు, అరబ్ దేశాలు, ఇరాన్ మధ్య గొడవలు, రష్యాతో అభిప్రాయ భేదాలు, ఆఫ్రికా దేశాల మధ్య నీటి గొడవలు తాత్కాలికంగా వెనక్కి వెళ్లి, బహుళ ధృవ ప్రపంచంలో పోషించగల పాత్రపై దృష్టి సారించాయి.

- డా.డి.వి.జి.శంకర రావు, విజయనగరం

### హార్ ఘర్ తిరంగా

పిల్లలకు పాకడాన్నిఎవరూ నేర్పించరు. వాళ్లంత వాళ్లే పాక్కుంటూ వెళతారు. తరువాత కుర్చీలని, తలుపులని, మంచం కోళ్లని పట్టుకుని పడుతూ లేస్తూ నడుస్తారు. అలానే ఎవరికీ వారు దేశాన్ని ప్రేమించాలి. దేశభక్తి కలిగి ఉండాలి. దేశ పౌరులుగా తమకు చేతనైనంతలో దేశసేవ చేయాలి. వృద్ధులని తల్లిదండ్రులను గౌరవించడం, దివ్యాంగులకి, పేదలకి సాయం అందించడం ఇవన్నీ చేస్తే భారత మాత సంతోషిస్తుంది. కాని ఇళ్ల మీద జెండా ఎగరేస్తేకాదు.

- రాశి, హైదరాబాద్

### నిజమైన అభివృద్ధి

అభివృద్ధి అంటే అంకెల గారడి కారాదు. జనాల జీవితాలలో మార్పు రావాలి. అది గుణత్మాకంగా ఉండాలి. అంటే జీవన ప్రమాణం పెరగాలి. పేదరికం అనేదితగ్గాలి. అయితే పేదరికం తగ్గడంతోపాటు ఆదాయం అసమానతలు కూడాతగ్గాలి. అది ముఖ్యం. దానికి గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయాలి. అందుకు వీబీ జీరామ్‌జీ, స్వయం గ్రూపుల పథకం మంచి ఆలంబన కావొచ్చు. ఎందుకు హార్టికల్చర్ పెంచాలి. ఎందుకు రైతులతో చర్చలు అవగాహనా కార్యక్రమం చేపట్టడం వల్లనే తెలంగాణలో ఆయిల్ ఫామ్ విస్తీర్ణం పెరిగింది అని గుర్తుపెట్టుకోవాలి. స్థిరమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పెంపుదలే నిజమైన అభివృద్ధిగా నిలుస్తుంది.

- భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# దౌత్య విధానంలో మోడీ కొత్త పుంతలు



శ్రీ హర్ష్ గోయెంకా

ఇటీవలే న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సు పలు దేశాధినేతలను ఒక్క చోట చేర్చింది. బ్రిక్స్ సభ్యదేశాలకు విభిన్న రాజకీయ వ్యవస్థలు, వ్యూహాత్మక ఆసక్తులు, ప్రపంచ దృక్పథాలున్నాయి. పశ్చిమాసియా నుంచి చైనా, రష్యా వరకు ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ ప్రతి సభ్యదేశమూ న్యూఢిల్లీ ప్రకటనపై సంతకంచేసింది. మూడు రోజుల్లో 15 ద్వైపాక్షిక సమావేశాలను స్వయంగా మోడీ నిర్వహించారు. విభిన్న ఆసక్తులున్న నాయకులతో భారతదేశ ప్రయోజనాలే కేంద్రంగా ఈ చర్చలు చేపట్టారు. మోడీపై విసిరిన ప్రతి విమర్శఆయన నిర్మించిన దౌత్యప్రాకారంలో ఇటుకగా మారినట్లు కనిపిస్తోంది. మోడీ వ్యక్తిగతశైలిలో ఆత్మీయత, కఠినత్వాల ఆసక్తికరమైన సమ్మేళనం కనిపిస్తుంది. ఆయన ఆలింగనాలు, కరచాలనాలు, ఫోటోలు అందరినీఆకర్షిస్తాయి. అయితే, వాటి వెనుక విదేశాంగ విధానంపై ఆయనకున్న సునిశిత దృష్టి దాగిఉంది. ప్రభుత్వాల మధ్య విభేదాలు తలెత్తినప్పుడు, వారి నాయకులు ఫోన్లో మాట్లాడుకోగలిగితే ఎంతో మేలు జరుగుతుందనే ఓ సాధారణ దౌత్యసూత్రాన్ని మోడీ అర్థం చేసుకున్నారు. కొన్నేళ్లుగా ఆయన ఈ సంబంధాల్లో గణనీయమైన రాజకీయ పెట్టుబడి పెట్టారు. అమెరికా అధ్యక్షులతో ఆయనకున్న సంబంధాలు, పుతిన్‌తో కొనసాగిస్తున్న సంప్రదింపులు, షీ జిన్‌పింగ్‌తో చర్చలు, యూరోప్, ఆఫ్రికా, గల్ఫ్ దేశాల నాయకులతో చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఒకే వ్యూహంలోభాగంగా ఉన్నాయి. భారత ప్రధానమంత్రి అత్యంత అరుదుగా సందర్శించే దేశాలకువెళ్లేందుకు ఆయన సుముఖంగా ఉన్నారు. 2025లో మూడు దశాబ్దాల అనంతరం ఘనాలో, 26ఏళ్ల తర్వాత ట్రినిడాడ్ అండ్‌టొబాగోలో ద్వైపాక్షిక పర్యటనలు చేపట్టారు. అగ్రరాజ్యాలు పరిమిత దృష్టిసారించే దేశాలతో సద్భావన ఏర్పాటు చేసుకోవడానికి, సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఈతరహా పర్యటనలు భారత్‌కు తోడ్పడతాయి. వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి అనే ఆయన విస్తృత సిద్ధాంతానికి ఈ వ్యక్తిగత శైలి చక్కగా సరిపోతుంది. నియమాలను స్వీకరించే దేశంగా కాకుండా నియమాలను రూపొందించే దేశంగా భారత్ మారుతోందని మోడీ చెబుతారు. అంతర్జాతీయంగా రక్షణాత్మక వైఖరితో కాకుండా ఆత్మవిశ్వాసంతో భారత్ వ్యవహరించాలని ఆయన కోరుకుంటున్నారు. అంటే క్వాడ్ ద్వారా అమెరికాతో సన్నిహితంగా పనిచేయడం, రష్యాతో దీర్ఘకాల సంబంధాన్ని కొనసాగించడం, బ్రిక్స్ ద్వారా చైనాతో సంప్రదింపులు జరపడం, యూరోప్, గల్ఫ్‌తో భాగస్వామ్యాన్ని బలోపేతంచేయడం, గ్లోబల్ సౌత్ వేదికల ద్వారా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలకు మద్దతు ఇవ్వడమని అర్థం. ఏదో ఒక కూటమివైపేనిలబడకుండా భారతదేశ ప్రయోజనాలఆధారంగా సమస్యలపై స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేయడమే మోడీ విధానం. ఇది అత్యంత ఆచరణాత్మకమైన విధానం. దీనిలో ప్రతి సమస్యనూ దాని ప్రాధాన్యం, భారతదేశ ప్రయోజనాల ఆధారంగా విశ్లేషిస్తారు.

మోడీ సారథ్యంలో వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి మరింత చురుగ్గా, దృఢంగా మారింది. ఇది ఒక దేశంతో రక్షణ రంగంలో, మరోదేశంలో ఇంధన రంగంలో, ఇంకో దేశంతో సాంకేతిక రంగంలో సహకరించుకుంటూనే ఇతరఅంశాల్లో ఆయా దేశాలతో విభేదించే స్వేచ్ఛనుఆయనకు ఇచ్చింది. 2023లో భారత్ అధ్యక్షత వహించిన జీ20సమావేశాల సమయంలో సంకీర్ణ కూటముల ఏర్పాటులో ఆయన పాత్ర స్పష్టంగా కనిపించింది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా, పశ్చిమ దేశాల మధ్య విభేదాలు తీవ్రమైన తరుణంలో ఏకాభిప్రాయం కుదరటంపై ఆశలుసన్నగిల్లాయి. అయినప్పటికీ మోడీ అన్ని వర్గాలను సంప్రదిస్తూ.. ఉమ్మడి అంగీకార అంశాలపై పట్టుదలగా కృషి చేశారు. ఫలితంగా న్యూఢిల్లీ నేతల డిక్లరేషన్‌ను భారత్ విజయ వంతంగా సాధించింది. అంతకన్నా సమప్రాధాన్యత సంత రించుకున్న మరోఅంశం.. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో శాశ్వత సభ్యదేశంగా చేర్చేందుకు మోడీ ప్రత్యేకంగా కృషి చేశారు. ఆఫ్రికన్ యూనియన్ అధ్యక్షుడి వద్దకు స్వయంగా వెళ్లి శిఖరాగ్ర సదస్సుకు సాదరంగా ఆహ్వానించారు. అంతర్జాతీయ వేదికలపై గ్లోబల్ సౌత్ దేశాలకు మరింత బలమైన గొంతుకను అందించాలనే భారత్ నిబద్ధతను ఇది చాటి చెప్పింది.




120కిపైగా దేశాలతో సంప్రదింపులు జరుపుతూ వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ కార్యక్రమం ద్వారాముందుగానే భారత్ తగిన ఏర్పాట్లను చేసుకుంది. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో భాగం చేయటం ద్వారా ఖండం మొత్తానికి ప్రపంచ నిర్ణయ ప్రక్రియల్లో సముచిత ప్రాతినిధ్యం లభించింది. ఇది మోడీ దౌత్యనీతిలోని కీలక లక్షణాన్ని ప్రతిబింబిస్తుంది. విస్తృత కూటములను ఏర్పాటు చేయటం, సంప్రదాయ అధికార వ్యవస్థ వెలుపలఉన్న దేశాలకు కూడా సముచిత ప్రాధాన్యత లభించేలా చూడటం. రాజకీయాలు, దౌత్యంలో సంకేతాల ద్వారా భావాలను వ్యక్తపరచటం ఆయన శైలిలో కీలక భాగం. భారతదేశ జీ20 అధ్యక్షతకు సులభంగా అర్థమయ్యే తత్వాన్ని వసుధైవ కుటుంబకం అందించింది. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకేభవిష్యత్తు, నినాదం ప్రాచీన భారతీయ భావనను ఆధునిక దౌత్య భాషలోకి అనువదించింది. అదేవిధంగా అంతర్జాతీయ యోగా దినోత్సవంఅసాధారణమైన ప్రపంచ స్థాయి శక్తి ప్రదర్శనగా మారింది. కొవిడ్ సమయంలో చేపట్టిన వాక్సిన్ మైత్రి కార్యక్రమం. భారతదేశ అభ్యుదయం ఇతరులకు కూడా మేలు చేస్తుందనే స్పష్టమైనసందేశాన్నిచ్చింది. నేటి దౌత్యం కేవలం చర్చల గదికే పరిమితం కాకుండా టెలివిజన్ స్టూడియోల్లో, లక్షలాది మంది మొబైల్ ఫోన్‌స్క్రీన్లపై ఒకే సమయంలో జరుగుతుందని మోడీ గ్రహించటం వల్లే ఈ చర్యలన్నీ విజయవంతమవుతున్నాయి. కొంతమంది ప్రపంచ నేతలు మాత్రమే ఈ మూడు వేదికలపై అవగాహనతో ఉన్నారు. ఈ శైలి వెనుక అద్భుతమైన పట్టుదల కూడా ఉంది. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మూడు రోజుల్లో పదిహేను ద్వైపాక్షిక సమావేశాల నిర్వహణ... నిరంతర సంప్రదింపుల ధోరణిలో భాగమే. మోదీ విదేశాంగ విధానాన్ని దౌత్యవేత్తలకు మాత్రమే పూర్తిగాఅప్పగించకుండా, ప్రధానమంత్రి స్వయంగా తీసుకోవాల్సిన బాధ్యతగా భావిస్తారు. బ్రిక్స్ సమావేశానికి ముందు ముప్పై భారతీయ నగరాల్లో 400లకు పైగా సమావేశాలు, కార్యక్రమాలు జరిగాయి. కీలక సమయాల్లోదౌత్యవేత్తలు మాత్రమే సాధించలేని పురోగతిని ఆయన స్వయంగా సాధించారు. ఒప్పందాల నమూనాలను దౌత్యవేత్తలు రూపొందిస్తారు. బ్రిక్స్ కూటమి స్వయంగా దాదాపుసగం ప్రపంచ జనాభాను, సుమారు 40 శాతంప్రపంచ జీడీపీని కలిగి ఉంది. దీనిలోని సభ్యదేశాల ఆశయాలు, కూటములు, అసంతృప్తి వేర్వేరుగా ఉండటం వల్ల నిర్వహణ కష్టతరమైనవిషయం. వాణిజ్యం, సాంకేతికత, కీలకఖనిజాలు, ఆహార, ఇంధన భద్రత, పటిష్టమైనసరఫరా వ్యవస్థలు, ప్రపంచ సంస్థల సంస్కరణలను గుర్తించి, ఆ విషయాలపై దృష్టిపెట్టేలా చేయటమే మోదీ సాధించిన ఘనత. విదేశాంగ విధానంలో మాత్రంఆయన వ్యక్తిగత ముద్రస్పష్టంగా కనిపిస్తుంది. దశాబ్ద కాలానికి పైగా భారతదేశ దౌత్యానికి మరింత గుర్తింపును, ఆత్మవిశ్వాసాన్ని, ఉన్నతమైన ఆశయాలను అందించారు. భారతదేశ ముఖ్య దౌత్య ప్రచారకర్తగా ప్రధాన మంత్రే స్వయంగా వ్యవహరించేలా చేశారు. సైద్ధాం తిక, భౌగోళిక విభేదాలకు అతీతంగా విభిన్న దేశాలతో సంబంధాలను బలోపేతం చేసేందుకు విశేషంగా కృషిచేశారు. గుజరాత్ వ్యాపారవేత్తకు ఉండే ఆచరణాత్మకత, ప్రజలను అర్థం చేసుకునే రాజకీయ నాయకుడి ఆలోచన, దేశాలు అంతిమంగా సొంతప్రయోజనాల కోసమే పనిచేస్తాయనే రాజనీతిజ్ఞుడి అవగాహన అన్నీ ఆయన శైలిలో మేళవించి ఉంటాయి. ఒప్పందాన్ని కోల్పోకుండాఆప్యాయంగా ఉండగలరు. లక్ష్యాన్ని మరచిపోకుండా సందర్భానుసారంగావ్యవహరిస్తారు. అదే సమయంలో ప్రస్తుత పరిస్థితుల పరిమితులను గుర్తిస్తూనే గొప్ప ఆశయాలతో ఉంటారు. బహుశా అదే మోదీ శైలిలోని సారాంశం కావచ్చు. రోజు రోజుకూ ముక్కలవుతున్న ఈప్రపంచంలో దూరం చేసుకోవటం కంటే పరస్పర సంబంధాలకు, కఠినమైన కూటములకంటే స్నేహానికి, గోడలు కట్టటం కంటే వంతెనల నిర్మాణానికే ఆయన ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా బలమైన సంబంధాలు ఉన్నప్పుడే దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి మరింత విలువ ఉంటుందని ఆయన గ్రహించారు. ఆయన దౌత్యనీతిఆచరణాత్మకతను, ఉన్నత ఆశయాలను కలగలిపింది. పరస్పరం పోటీపడే అగ్రరాజ్యాలను కలుపుకుపోతూ... గ్లోబల్ సౌత్ స్వరాన్ని బలపరిచారు. భారతదేశ ప్రభావాన్ని క్రమంగా విస్తరించారు. దశాబ్దానికి పైగా సాగిన ఈ ప్రయాణంలో ప్రపంచంతో భారత్‌వ్యవహరించే తీరునేకాక, భారత్ వైపు ప్రపంచం చూసేవిధానాన్ని కూడా ఆయనమార్చేశారు. నేడు భారత్ మరింత ఆత్మవిశ్వాసంతో మాట్లాడుతోంది. ●

(రచయిత ఆర్‌పీజీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్)

# నిర్లక్ష్యానికి మూల్యం జీవితాంతం పశ్చాత్తాపం!

మేకిరి దామోదర్

ప్రయాణం అంటే కేవలం ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి చేరుకోవడం కాదు.. మన గమ్యాన్ని సురక్షితంగా చేరుకోవడమే అసలైన ప్రయాణ విజయం. రహదారిపై మనకంటే ముందు ఎన్నో ప్రమాదాలను చూసిన అనుభవం, ఎన్నో హెచ్చరికల రూపంలో మనకు కనిపిస్తూనే ఉంటుంది. రహదారి పక్కన కనిపించే ప్రతి సూచిక బోర్డు ఒక అక్షర సందేశం మాత్రమేకాదు. మన ప్రాణాలను కాపాడే ముందస్తు హెచ్చరిక. వర్షాకాలంలో వాతావరణ శాఖ జారీ చేసే ఎల్లో, ఆరెంజ్, రెడ్ అలర్ట్‌లు కూడా ప్రకృతి మనకు ఇచ్చే హెచ్చరికలే. వాటిని నిర్లక్ష్యం చేసి ముందుకు సాగితే ప్రమాదం మన గమ్యాన్ని మార్చేయవచ్చు. వర్షాకాలంలో వాతావరణ పరిస్థితులు క్షణాల్లో మారిపోతాయి. ముఖ్యంగా దూర ప్రయాణాలు చేసే వారు వర్షం, ఈదురుగాలులు, వరదలు, పిడుగులు వంటిప్రకృతి పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకోవాలి. అందుకే వాతావరణ శాఖ వర్షాల తీవ్రతను బట్టి వివిధ రంగుల హెచ్చరికలను జారీ చేస్తుంది. ఈ రంగుల అర్థాలను ప్రజలు తెలుసుకోవడం అత్యంత అవసరం. ఎల్లో అలర్ట్ అంటే వాతావరణ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవడం, రహదారులు జారుడుగా మారడం, చెట్లు లేదా బలహీననిర్మాణాలు దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురుకావచ్చు. ఆరెంజ్ అలర్ట్ అంటే పరిస్థితి మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని అర్థం. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రహదారులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరవచ్చు. చెట్లు, విద్యుత్‌స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉంటుంది. పిడుగులు పడే అవకాశం ఉన్నప్పుడు చెట్ల కింద నిలబడటం, బలహీన నిర్మాణాల్లో ఉండటం ప్రమాదకరం. రెడ్ అలర్ట్ అత్యంత తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు సంకేతం. వరదలు, రహదారులపైతీవ్ర అంతరాయాలు, చెట్లు- విద్యుత్ స్తంభాలు పడిపోవడం వంటి ప్రమాదాలు సంభవించవచ్చు. అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి. కాబట్టి వాతావరణ హెచ్చరికలను ప్రకృతి ఇచ్చే ముందస్తు సంకేతంగా భావించాలి. ప్రతి పరిస్థితికి ముందుగానే హెచ్చరించేందుకే రహదారి సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తారు. ఎరుపురంగు అంచులతో ఉండే అనేక వృత్తాకార సూచికలు వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు, ఆదేశాలను తెలియజేస్తాయి. వేగపరిమితి, ప్రవేశం నిషేధం, ఓవర్ టేకింగ్ నిషేధం, నోపార్కింగ్, వన్‌వే వంటి సూచికలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదు. త్రిభుజాకార బోర్డులు ముందున్న ప్రమాదకర పరిస్థితులను ముందుగానే తెలియజేస్తాయి. స్పీడ్‌బ్రేకర్, రోడ్డు పనులు, పాదచారుల రాకపోకలు, పాఠశాల ప్రాంతం వంటి సూచనలు వీటిలో ఉంటాయి. ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించేవి సాధారణంగా దీర్ఘచతురస్రాకార సూచిక బోర్డులు. పెట్రోల్ బంక్, ఆసుపత్రి, ప్రథమ చికిత్స కేంద్రం, హోటల్, రెస్టారెంట్, పార్కింగ్, విశ్రాంతి ప్రదేశం వంటి సౌకర్యాలు ఎక్కడ ఉన్నాయో ఇవి తెలియజేస్తాయి. దూరప్రయాణాల్లో ఇలాంటి సూచికలు ఎంతో ఉపయోగక రంగా ఉంటాయి. వాతావరణశాఖ ఇచ్చే హెచ్చరికలు, రహదారుల వెంట కనిపించే సూచికలు రెండూ మన భద్రత కోసమే. ●

# ఆడంబరాలు కాదు అభివృద్ధి ముఖ్యం

శెట్టే అంజయ్య

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి రేటును నమోదు చేయడం నిస్సందేహంగా హర్షించదగిన పరిణామం. ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రధాన ఆర్థిక వ్యవస్థలు మాంద్యం భయాలతో, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లతో, భౌగోళిక రాజకీయ అనిశ్చితులతో కొట్టుమిట్టాడుతున్న తరుణంలో భారత్ ఈ స్థాయి ప్రగతిని సాధించడం దేశ ఆర్థిక పునాదుల అంతర్గత బలానికి అద్దం పడుతోంది. అయితే, ఒక్క త్రైమాసికానికి సంబంధించిన జీడీపీ గణాంకాన్ని చూసి మనం గమ్యస్థానాన్ని చేరుకున్నామని సంబరపడటం ప్రాథమిక ఆర్థిక సూత్రాలకే విరుద్ధం. 7.8 శాతం అనేది ఒక గణాంక విజయం మాత్రమే కావచ్చు, కానీ ఈ వృద్ధి సాధించిన ఫలాలు సమాజంలో అత్యంత దిగువన ఉన్న సామాన్య పౌరుడి జీవితంలో ఎంతవరకు సానుకూల మార్పును తీసుకువచ్చాయనేదే అసలైన పరీక్ష. ఈ ఆర్థిక ఘనతపై స్పందిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రజలకు చేసిన పిలుపును కేవలం ఒక రాజకీయ సందేశంగా కాకుండా, లోతైన ఆర్థిక దార్శనికతతో విశ్లేషించాల్సి ఉంది. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, అనవసరమైన విదేశీ విహారయాత్రలను తగ్గించుకోవాలని, అలాగే దిగుమతులపై ఆధారపడే భౌతిక బంగారంలో విపరీతంగా పెట్టుబడులు పెట్టకూడదని ఆయన కోరడం వెనుక దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసే వ్యూహం స్పష్టంగా కనిపిస్తుంది. ఒక దేశం ఆర్థికంగా స్థిరమైన స్వావలంబన సాధించాలంటే కేవలం ప్రభుత్వ వ్యయం, బహుళజాతి సంస్థల పెట్టుబడులపైనే ఆధారపడితే సరిపోదు. కోట్లాది మంది పౌరుల రోజువారీ వినియోగ అలవాట్లు, చిన్న తరహా పరిశ్రమల స్థితిగతులు, దేశీయ తయారీ రంగం, విస్తృతమైన ఉద్యోగాల సృష్టి, ఉత్పత్తి రంగంలో ఉత్పాదకత పెరగడం వంటివి సమ్మిళితమైతేనే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుంది. ఇక్కడ మనం నిష్పాక్షికంగా ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రశ్నించుకోవాలి. కాగితాలపై 7.8 శాతంగా కనిపిస్తున్న ఈవృద్ధి రేటు, ఒక సగటు మధ్యతరగతి లేదా నిరుపేద కుటుంబం నెలవారీ బడ్జెట్‌లో ఏమేరకు ఊరటను ఇస్తోంది? జీడీపీ విస్తరణ వేరు, సామాన్యకుటుంబ ఆదాయాల వృద్ధి వేరు. ఆర్థిక వ్యవస్థ ఎంత పెద్దదిగా మారినప్పటికీ, దానికి అనుగుణంగా ఉపాధి అవకాశాలు పెరగకపోతే లేదా వాస్తవ వేతనాలు పెరగకపోతే, ఆ వృద్ధిఫలాలు కొద్దిమందికే పరిమితమై అసమానతలు మరింత పెరుగుతాయి. అందువల్ల ప్రభుత్వం ఇకపై కేవలం శాతాల ప్రాతిపదికన జీడీపీని కొలవడమే కాకుండా ఉపాధి కల్పన, గ్రామీణ ప్రాంతాల ఆదాయాలు, వ్యవసాయ లాభదాయకత, సూక్ష్మ రోగనిరోధక శక్తి, పౌరుల వాస్తవ కొనుగోలుశక్తి వంటి నాణ్యమైన సూచికలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సినఅవసరం ఉంది. ప్రధాని ప్రస్తావించిన స్వదేశీ నినాదాన్ని సాంకేతిక, వ్యాపార కోణంలో సునిశితంగా అర్థం చేసుకోవాలి. పౌరులు స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడు స్వదేశీతయారీదారులకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా చిన్న పరిశ్రమలకు ఆర్డర్లు లభించి, అవి కొత్త ఉద్యోగాలను సృష్టిస్తాయి. ఇది పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచి, ఆ నిధులను మళ్లీ రహదారులు, విద్యుత్, విద్య, ఆరోగ్యం



వంటి మౌలిక వసతుల కల్పనకు వెచ్చించేలా ఒక ఆర్థిక చక్రాన్ని నిర్మిస్తుంది. అంటే ప్రతి వినియోగదారుడి కొనుగోలు నిర్ణయం దేశ పునర్నిర్మాణంలో ఒక ఆర్థిక పెట్టుబడిగా మారుతుంది. అయితే, ఈ బాధ్యతను కేవలం భావోద్వేగాల పేరుతో వినియోగదారుడి భుజాలపై మాత్రమే నెట్టివేయడం సమంజసం కాదు. స్వదేశీ వస్తువులు కేవలం 'దేశభక్తి' ఆధారంగా మాత్రమే అమ్ముడుపోలేవు, అవి అంతర్జాతీయ ప్రమాణాలతో, పోటీ ధరలతో, అత్యుత్తమ నాణ్యతతో అందుబాటులో ఉన్నప్పుడే సుస్థిరమైన మార్కెట్ సాధిస్తాయి. తయారీ రంగానికి సాంకేతిక పరిజ్ఞానం, సరసమైన వడ్డీలకు రుణాలు, నాణ్యమైన మౌలికవసతులు, ల్యాండ్ లేబర్ నిబంధనల సరళీకరణ, నైపుణ్యమున్న మానవ వనరులను అందించడం ప్రభుత్వ బాధ్యత. అప్పుడే స్వదేశీ అనేది నినాదం స్థాయి నుంచి బలమైన ఆర్థిక విధానంగా రూపాంతరం చెందుతుంది. అలాగే, విదేశీ ప్రయాణాలను తగ్గించుకోవాలనే సూచన విదేశీ మారకద్రవ్య వినియోగాన్ని అదుపు చేయాలనే సూక్ష్మ ఆర్థిక సూత్రంతో ముడిపడిఉంది. విలాసవంతమైన విదేశీ పర్యటనలు, కోట్లాది రూపాయలు వెచ్చించి విదేశాల్లో చేసుకునే 'డెస్టినేషన్ వెడ్డింగ్స్' వల్ల మన ధనం ఇతర దేశాలకు తరలిపోతుంది. ఆ నిధులను దేశీయంగా వెచ్చిస్తే ఇక్కడి పర్యాటక రంగం, హోటల్, రవాణా, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్రాచీన హస్తకళారంగాలు ఆర్థికంగా పుంజుకుంటాయి. అయితే దీనిని ప్రపంచంతో సంబంధాలు తెంచుకోవడంగా భావించ కూడదు. విద్య, వ్యాపారం, శాస్త్ర పరిశోధనలు, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల కోసం విదేశీ ప్రయాణాలు అత్యంత ఆవశ్యకం. నిజమైన స్వావలంబన అంటే తలుపులు మూసుకోవడం కాదు, ప్రపంచ మార్కెట్లలో పోటీపడి మన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం. విదేశీ పర్యటనలను బలవంతంగా నిరోధించడం కంటే, భారతదేశంలోనే ప్రపంచ స్థాయి పర్యాటక అనుభవాలను, అంతర్జాతీయ సదస్సులను, వివాహ వేదికలను పటిష్టంగా నిర్మించడం సరైన వ్యూహం అవుతుంది. ఇక భారతదేశంలోబంగారం అనేది కేవలం ఆభరణం మాత్రమే కాదు, అది ఒక భావోద్వేగం, అత్యవసర సమయాల్లో ఆదుకునే ఆర్థిక రక్షణ కవచం. అయితే, సంపదనంతటినీ భౌతిక బంగారం రూపంలో నిల్వచేయడం వల్ల ఆ మూలధనం ఆర్థిక వ్యవస్థలో నిష్క్రియాత్మకంగా ఉండిపోతుంది. పైగా భారీ బంగారపు దిగుమతులు దేశ వాణిజ్య లోటును పెంచి, విదేశీ మారక నిల్వలపై తీవ్రఒత్తిడి తెస్తాయి. అయితే ప్రజలకు 'బంగారం కొనవద్దు'అని చెప్పడం వల్ల మాత్రమే ప్రవర్తనా మార్పురాదు. దానికి ప్రత్యామ్నాయంగా సురక్షితమైన, పారదర్శకమైన, ద్రవ్యోల్బణాన్ని అధిగమించే లాభసాటి పొదుపు మార్గాలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలి. దేశంలో ఆర్థిక అక్షరాస్యతను విస్తృతంగా పెంచి, రిస్క్ అంచనాలకు తగినట్లుగా డిపాజిట్లు, బాండ్లు, బీమా, మ్యూచువల్ ఫండ్స్ వంటి ఉత్పాదక మార్గాల్లో పెట్టుబడులు పెట్టేలా ప్రజలను ప్రోత్సహించాలి. మెట్రో నగరాలు మాత్రమే మెరుస్తూ, గ్రామీణ ప్రాంతాలు వెనుకబడితే అది సమగ్రవృద్ధి అనిపించుకోదు. వ్యవసాయ రంగాన్ని ఆధునీక రిస్తూనే, ఆహార ప్రాసెసింగ్, గ్రామీణ పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊపిరి పోయాలి. అలాగే తక్కువ వ్యయంతో, అత్యుత్తమ నాణ్యత కలిగిన ఉత్పత్తుల ను తయారుచేయగలసాంకేతిక, పరిశోధనలపై భారీగా పెట్టుబడులు పెట్టాలి. ●

# పాస్‌పోర్టు ర్యాంకుల్లో భారత్ 73వ స్థానం




## గతేడాది కంటె ఏడు స్థానాలు దిగజారిన వైనం
## అత్యంత శక్తిమంతమైన దేశంగా యుఎఇ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** ప్రపంచ దేశాల పాస్‌పోర్ట్‌ల శక్తిని అంచనా వేసే పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026 లో భారత్ స్థానం పడిపోయింది. ఈ తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారత పాస్‌పోర్ట్ 73వ స్థానంలో నిలిచింది. 2025లో 66వ స్థానంలో ఉన్న భారత్.. ఈ ఏడాది ఏకంగా ఏడు స్థానాలు దిగజారింది. ఇదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా జాబితాలో చిట్టచివరన నిలిచింది. ఆర్టన్ క్యాపిటల్ సంస్థ ఈ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌ను రూపొందిస్తున్నది. వీసా లేకుండా (వీసాఫ్రీ), వీసా ఆన్ అరైవల్ సౌకర్యాలున్న దేశాల సంఖ్య ఆధారంగా 'మొబిలిటీ స్కోర్(ఎంఎస్) కేటాయిస్తారు. ఈ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే ఆ పాస్‌పోర్ట్ అంత శక్తిమంతమైనదని అర్థం. మొత్తం 199 దేశాల పాస్‌పోర్ట్‌లను ఈ ర్యాంకింగ్ కోసం విశ్లేషించారు. ప్రస్తుతం భారత్ మొబిలిటీ స్కోర్ 69గా ఉంది. ఈ స్కోర్‌తో భారత్ జింబాబ్వే, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, సావో టోమ్ అండ్ ప్రిన్సిపీ, వియత్నాం వంటి దేశాలతో కలిసి 73వ స్థానాన్ని పంచుకుంటోంది. భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు 25 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. మరో 39 దేశాల్లో వీసాఆన్ అరైవల్ సౌకర్యం ఉంది. అయితే 129 దేశాలకు వెళ్లాలంటే ముందస్తుగా వీసా తప్పనిసరి. గత ఏడాదితో పోలిస్తే వీసా ఆన్ అరైవల్ దేశాల సంఖ్య తగ్గడంతో మొబిలిటీ స్కోర్ 73 నుంచి 69 కి పడిపోయింది. ఇదే ర్యాంకు పతనానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ జాబితాలో యూఏఈ పాస్‌పోర్ట్ 181 మొబిలిటీ స్కోర్‌తో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానంలో నిలిచింది. యూఏఈ పౌరులు 138 దేశాలకు వీసా లేకుండా, 43 దేశాలకు వీసాఆన్‌అరైవల్‌తో ప్రయాణించవచ్చు. కేవలం 17 దేశాలకు మాత్రమే వారికి వీసా అవసరం. ఇక ఈ జాబితాలో ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా 99వ ర్యాంకులో ఉంది. దాని మొబిలిటీ స్కోర్ కేవలం 35 మాత్రమే. ఆఫ్ఘన్ పౌరులు ఏకంగా 163 దేశాలకు కచ్చితంగా వీసా తీసుకోవాల్సిందే.

అయితే ఇలాంటి గ్లోబల్ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లను భారత ప్రభుత్వం అంగీకరించడం లేదు. కొన్ని ప్రైవేట్ సంస్థలు ఏకపక్షంగా నిర్ణయించిన పారామీటర్ల ఆధారంగా ఈ నివేదికలను రూపొందిస్తున్నాయని కేంద్రం భావిస్తోంది. దీనిపై విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గత జూలై 31న లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 'పాస్‌పోర్ట్‌లకు ర్యాంకులు ఇవ్వడానికి ప్రపంచ వ్యాప్తంగా ఆమోద యోగ్యమైన ప్రమాణాలు లేవు. అందుకే ఏ ర్యాంకింగ్ వ్యవస్థను ప్రామాణికంగా తీసుకోలేం అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.



## ఎఐ వినియోగంలో భారత్ భేష్
### - మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గత సాంకేతిక విప్లవాల కన్నా ప్రాథమికంగా భిన్నమైనదని, రాబోయే మార్పుల స్థాయికి, వేగానికి సమాజం ఇంకా సిద్ధంగా ఉండకపోవచ్చని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ హెచ్చరించారు. ఎఐ అసాధారణ సామర్థ్యాన్ని ఆయన ప్రస్తావిస్తూ, సామాజిక, అభివృద్ధి ప్రయోజనాల కోసం ఈ సాంకేతికతను ఎంత వేగంగా వినియోగించవచ్చో చెప్పడానికి భారతదేశాన్ని ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. "ఇది అద్భుతమైన సామర్థ్యాల సముదాయం. మంచి పనులను వీలైనంత వేగంగా ఎలా ముందుకు తీసుకెళ్లగలమో భారతదేశం నిరూపిస్తోంది" అని వివరించారు. ఎఐ తీసుకురాగల వినూత్న మార్పులకు సమాజం సిద్ధం కావడానికి ఎక్కువ సమయం ఇవ్వాలంటే, ప్రపంచం ఎఐ పురోగతిని నెమ్మదింపజేయడాన్ని పరిగణించాలని అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్ కన్నా ఎఐ ప్రాథమికంగా భిన్నమైనదని, దాని ప్రభావాన్ని అంత సులభంగా నిర్వహించవచ్చని భావించవద్దని హెచ్చరించారు. "ఎఐ చాలా ప్రత్యేకమైన సాంకేతికత. ఇతర సాంకేతికతలను నిర్వహించినంత సులభంగానే ఎఐ ప్రభావాలను కూడా నిర్వహించడం సాధ్యమవుతుందని భావించే వారిని హెచ్చరిస్తున్నా. ఎఐ అభివృద్ధి విస్తృతి, వేగం, ఆవిష్కరణలపై దీర్ఘకాలంగా నమ్మకం ఉన్న తనలాంటి వ్యక్తిని సైతం, ఈ వేగాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉందా అని ఆలోచించేలా చేసింది. ఇంత వేగవంతమైన మార్పుకు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉన్నందున, మనం విషయాలను నెమ్మదింపజేయగలిగితే, ఆ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నా" అని గేట్స్ పేర్కొన్నారు. సైబర్ దాడులు చేసేవారి సామర్థ్యాలను ఎఐ సాధనాలు గణనీయంగా బలోపేతం చేయగలవని హెచ్చరించారు. రక్షణ సామర్థ్యాలు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## జపాన్‌లో లక్షదాటిన శతాధిక వృద్ధులు

**టోక్యో, సెప్టెంబరు 16:** దేశంలో శతాధిక వృద్ధుల సంఖ్య లక్ష మార్కును అధిగమించి జపాన్ సరికొత్త రికార్డు దక్కించుకుంది. అక్కడ ప్రస్తుతం 1,07,677 మంది శతాధికులు ఉన్నట్లు జపాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈనెల 15న అధికారికంగా ప్రకటించింది. వందేళ్లు పైబడిన వారి సంఖ్య ఏటా పెరుగుతూ వస్తున్నది. ఇలా క్రమం తప్పకుండా శతాధికుల సంఖ్య పెరగడం అనేది గత 56 ఏండ్లుగా వరుసగా కొనసాగుతున్నది. ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం శతాధికుల్లో మహిళలదే అగ్రస్థానం.

మొత్తం సంఖ్యలో సుమారు 88 శాతం, అంటే 94,298 మంది మహిళలే ఉన్నారు. ప్రస్తుతం దేశంలో అత్యంత వృద్ధురాలిగా క్యోటోకు చెందిన 114 ఏళ్ల ఫుయో కిషిమోటో, అత్యంత వృద్ధుడిగా కుమామోటోకు చెందిన 112 ఏళ్ల హికారు కాటో రికార్డుల్లో నిలిచారు. జపాన్‌లో శతాధికుల సంఖ్య వృద్ధిని పరిశీలిస్తే 1963లో గణాంకాల సేకరణ ప్రారంభమైనప్పుడు వీరి సంఖ్య కేవలం 153 మాత్రమే ఉండేది.

## మోడీస్నేహితుడి భూకబ్జాకేసుకు ఎట్టకేలకు పరిష్కారం

### శరవేగంగా కదిలిన మహారాష్ట్ర అధికారులు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 16:** మహారాష్ట్రలోని మీరాభయాందర్ ప్రాంతంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఒక సంచలనాత్మక భూవివాదానికి ఎట్టకేలకు ఓ ముగింపు లభించింది. భారత ప్రధాని నరేంద్ర మోడీ చిన్ననాటి పాఠశాల స్నేహితుడైన 81 సంవత్సరాల అస్గర్ అలీ వోహ్రా స్వయంగా ప్రధానిని కలవడంతో ఈ వ్యవహారంలో చకచకా అడుగులు పడ్డాయి. ప్రధాని మోడీ దృష్టికి విషయం వెళ్లిన వెంటనే రంగంలోకి దిగిన అధికారులు, బీజేపీ నాయకుడు నరేంద్ర మెహతాతో మాట్లాడి వివాద పరిష్కారానికి మార్గం సుగమం చేశారు. దీంతో సదరు వివాదాస్పద ప్లాట్‌పై తమకున్న స్వాధీన హక్కులను వదులుకుంటున్నట్లు ప్రకటించిన మెహతా నిర్మాణ అనుమతులను టౌన్ ప్లానింగ్ విభాగానికి వెనక్కి ఇచ్చేశారు. ఇరువర్గాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం వోహ్రాపై గతంలో చేసిన పోలీసు ఫిర్యాదును సైతం ఉపసంహరించుకున్నారు. గుజరాత్‌లోని వాద్‌నగర్ బి.ఎన్. స్కూల్‌లో ప్రధాని మోడీతో కలసి విద్యాభ్యాసం చేసిన అస్గర్ అలీ వోహ్రా 1989వ సంవత్సరంలో భయాందర్ ఈస్ట్‌లోని నవ్‌ఘర్ ప్రాంతంలో సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని రిజిస్టర్డ్ ఒప్పందం ద్వారా కొనుగోలు చేశారు. ఆ స్థలాన్ని తాను ఎవరికీ విక్రయించకపోయినప్పటికీ 2011లో నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్‌ను తన ప్రమేయం లేకుండానే రెండు భాగాలుగా విభజించారని వోహ్రా ఆరోపించారు. అందులో ఒక భాగాన్ని స్వయం బిల్డర్స్, మరో భాగాన్ని నరేంద్ర మెహతాకు చెందిన సెవెన్ ఎలెవన్ కన్‌స్ట్రక్షన్స్ ఆక్రమించుకున్నాయని ఆయన తెలిపారు. అసలైన యజమాని అనుమతి లేకపోయినా మీరాభయాందర్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడం, 2015లో నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి సీఐడీ నివేదిక రావడానికి ఏకంగా ఈ ఏడాది వరకు నిరీక్షించాల్సి రావడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. దీంతో విసిగిపోయిన వోహ్రా ఈనెల 8వ తేదీన నేరుగా ప్రధాని మోడీని కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. నకిలీ పత్రాల సృష్టి, అధికారులు, బిల్డర్ల కుమ్మక్కుపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాని దృష్టికి విషయం వెళ్లడంతో మహారాష్ట్ర ఉన్నతాధికారులు వేగంగా స్పందించారు. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీకర్ పరదేశి నేతృత్వంలో రాష్ట్ర సచివాలయంలో ఒక ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఈ సమావేశానికి అస్గర్ వోహ్రా, నరేంద్ర మెహతాతో పాటు మున్సిపల్ కమిషనర్ రాధా వినోద్ శర్మ, టౌన్ ప్లానర్ పురుషోత్తమ్ షిండే హాజరయ్యారు. ఈ సందర్భంగా మెహతా స్పందిస్తూ 2019లో మెర్విన్ ఫెర్నాండెజ్ నుంచి కొనుగోలు చేసారు.

## జిన్‌పింగ్‌కు తీవ్రస్థాయి ఇస్కీమిక్ స్ట్రోక్!



**బీజింగ్,సెప్టెంబరు 16:** చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా చెబుతోంది. ఇటీవల, బ్రిక్స్ సదస్సు కోసం భారత్ వచ్చిన ఆయన, తిరిగి చైనా వెళ్లిన వెంటనే ఆస్పత్రిలో చేరినట్లు వార్తా కథనాలు నివేదించాయి. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సోషల్ మీడియాలో మాత్రం జిన్‌పింగ్ ఆరోగ్యంపై ఊహాగానాలు తీవ్రమవుతున్నాయి. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఆయన స్పృహ కోల్పోయారని, దీని తర్వాత వైద్య సహాయం అందించారని, తీవ్ర ఇస్కీమిక్ స్ట్రోక్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారని కొన్ని ఆన్‌లైన్ పోస్టులు నివేదించాయి. చైనా డెమోక్రసీ పార్టీ చైర్మన్ షీ వాంజున్ తన ఎక్స్ ఖాతాలో ఈ ఆరోపణలు చేసినట్లు పలు మీడియా సంస్థలు వెల్లడించాయి. ఢిల్లీలో వైద్య చికిత్సకు నిరాకరించిన జిన్‌పింగ్, ప్రత్యేక విమానంలో బీజింగ్ చేరిన వెంటనే ఆస్పత్రిలో చేరినట్లు చెబుతున్నారు. సాధారణంగా విదేశీ పర్యటన ముగించుకువచ్చిన తర్వాత జిన్‌పింగ్‌కు ఎయిర్‌పోర్టులోనే భారీ స్వాగతం పలిచేందుకు పెద్ద సంఖ్యలో అధికారులు ఉంటారని, కానీ ఈ సారి ఆ సందడి లేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నట్లు నివేదికలు సూచించాయి. జిన్‌పింగ్‌ను అత్యంత రహస్యంగా ఉండే ఆస్పత్రికి హెలికాప్టర్‌లో తరలించారని, ఆయన పరిస్థితి విషమంగా ఉందనే వార్తలు వస్తున్నాయి. దీనికి ముందు బ్రిక్స్ సమావేశంలో కూడా కొన్ని సంఘటనలు ఆయన ఆరోగ్యంపై అనుమానాలను రేకెత్తించాయి. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ జిన్‌పింగ్‌ను గమనిస్తూ కొన్ని క్షణాలు ఆయన ప్రసంగాన్ని ఆపారు. ఆ తర్వాత భారత్ బ్రిక్స్ అతిథులకు ఇచ్చిన డిన్నర్‌లో జిన్‌పింగ్ పాల్గొనకపోవడం కూడా సందేహాలను పెంచింది.

## డ్యూటీకి రాకుండానే రూ.70వేలు నెలసరిజీతం.. ఎమ్మెల్యే మేనకోడలికి రాచమర్యాదలు



**బెంగళూరు, సెప్టెంబరు 16:** కాంగ్రెస్ ఎమ్మెల్యే మేనకోడలు ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సు చేస్తున్నది. ప్రభుత్వ అనుబంధ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నట్లుగా నెలకు రూ.70,000 జీతాన్ని ఆమె పొందుతున్న విషయం వెలుగులోకి రావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. కర్ణాటకలోని బాగల్‌కోట్ ఎమ్మెల్యే ఉమేష్ మేటి మేనకోడలైన డాక్టర్ అంకితా యరగల్, ఒక ప్రైవేట్ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సు చేస్తున్నది. అలాగే ప్రభుత్వ అనుబంధ నమ్మ క్లినిక్‌లో ఆమె పనిచేస్తున్నట్లుగా నెలకు రూ.70 వేల వేతనం కూడా పొందుతున్నది. ఈ ఏడాది మార్చి నుంచి సెప్టెంబర్ వరకు వాంబే కాలనీలోని నమ్మ క్లినిక్‌లో వైద్య విధులకు డాక్టర్ అంకిత హాజరుకాలేదు. దీంతో వైద్య సేవల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆమె విధులకు హాజరుకానప్పటికీ ప్రతి నెలా జీతం పొందుతున్నట్లు బయటపడింది. దీంతో బాగల్‌కోట్ జిల్లా పంచాయతీ సీఈవో గజానన్ బాలే దీనిపై విచారణ చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అనధికారిక ద్వంద్వ నియామకం ఆరోపణలపై ఆమెకు సమన్లు జారీ చేశారు. మరోవైపు తొలి నోటీస్‌కు డాక్టర్ అంకిత స్పందించలేదు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 18న ఉదయం 10 గంటలకు జిల్లా పంచాయత్ కార్యాలయంలో జరుగనున్న తదుపరి విచారణకు హాజరు కావాలంటూ సీఈవో మరోసారి సమన్లు పంపారు. తదుపరి విచారణకు హాజరు కాకపోతే ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఆమెకు చెల్లించిన జీతం లేదా గౌరవ వేతనాన్ని నిబంధనల ప్రకారం తిరిగి రాబడతామని అధికారులు వెల్లడించారు. అయితే డాక్టర్ అంకిత తండ్రి అయిన జిల్లా ఆరోగ్య అధికారి (డీహెచ్‌వో) రాజ్‌కుమార్ ఈ అంశంపై స్పందించారు. ఆమెను విధుల నుంచి తొలిగించారు. తన కుమార్తె ఎండీ కోర్సులో చేరినప్పటి నుంచి ఎలాంటి వేతనం తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. కుమార్తె అయిన డాక్టర్ అంకితకు మెడికల్ ఆఫీసర్ పోస్ట్ ఇవ్వడంలో ఆయన తండ్రి అయిన డీహెచ్‌వో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో దీనిపై కూడా దర్యాప్తు జరుపుతున్నారు.

## ఇరాన్‌దాడుల్లో కరిగిపోతున్న అమెరికా ఆయుధ సంపద

**దుబాయ్, సెప్టెంబరు 19:** ఇరాన్‌తో జరుగుతున్న వార్‌లో అమెరికా తన ఆయుధ సంపదను భారీగా పోగొట్టుకుంటున్నది. మిస్సైల్ ఇంటర్‌సెప్టార్లను విరివిగా వాడేస్తున్నది. పశ్చిమాసియాలో ఇరాన్ దాడులను తిప్పికొట్టేందుకు అమెరికా తన క్షిపణి రక్షణ వ్యవస్థను వినియోగిస్తున్నది. అయితే విభిన్న వ్యూహాలతో ఇరాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో అమెరికా తన ఆయుధాలను అధికంగా వాడాల్సి వస్తున్నది. గత వారం జోర్డాన్‌లోని అమెరికా వైమానిక దళంపై ఇరాన్ దాడి చేసిన విషయం తెలిసిందే. బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది. ఆ దాడిని తిప్పికొట్టేందుకు అమెరికా సుమారు 70 హై ఎండ్ ఎయిర్ డిఫెన్స్ ఇంటర్‌సెప్టార్లను వాడినట్లు తెలుస్తోంది. కేవలం 20 ఇరానీ బాలిస్టిక్ క్షిపణులను కూల్చేందుకు సుమారు 60 నుంచి 70 వరకు పేట్రియాట్ ఇంటర్‌సెప్టార్లను వాడినట్లు అంచనా వేస్తున్నారు. వీటితో పాటు డజన్ సంఖ్యలో థాడ్ ఇంటర్‌సెప్టార్లను కూడా వాడినట్లు తెలుస్తోంది. ఇరానీ దళాలు జోర్డాన్‌లో ఉన్న మువాఫక్ సాల్తీ ఎయిర్ బేస్‌పై అటాక్ చేసిన విషయం తెలిసిందే.

ఆ సమయంలో సుమారు 20 క్షిపణులను ఇరాన్ వదిలింది. వాటిలో 18 క్షిపణులను అమెరికా దళాలు కూల్చివేశాయి. అమెరికా, జోర్డాన్ సంయుక్తంగా దాడిని తిప్పికొన్నా, కొన్ని ఇరానీ క్షిపణులు బేస్‌ను ఢీకొట్టి అక్కడ ఉన్న విమానాలను ధ్వంసం చేశాయి.

## పాక్ మోస్ట్ వాంటెడ్ జాబితాలో మసూద్ అజహార్

### రూ.70 లక్షల పాకిస్థానీ రూపాయల రివార్డు



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 16:** ఉగ్రవాద నిరోధక చర్యల విషయంలో అంతర్జాతీయ ఒత్తిడి ఎదుర్కొంటున్న పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో అనేక రక్తపాత దాడులకు పాల్పడిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, జైషే మహమ్మద్ అధినేత మసూద్ అజార్ సమాచారం అందించిన వారికి ఇచ్చే రివార్డును 70 లక్షల పాకిస్థానీ రూపాయిలకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఏ) తన 2026 నాటి 'రెడ్ బుక్ ఆఫ్ మోస్ట్ వాంటెడ్ హై ప్రొఫైల్ టెర్రరిస్ట్స్' జాబితాలో మసూద్ అజార్ పేరును చేర్చడంతో పాటు ఈ భారీ బహుమతిని ఖరారు చేసింది. మసూద్ అజార్ తమ భూభాగంలో లేడని, ఆయన అఫ్ఘానిస్థాన్‌కు పారిపోయాడని ఇస్లామాబాద్ ఇన్ని రోజులూ అంతర్జాతీయ సమాజం వద్ద వాదిస్తూ వచ్చింది. అయితే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) రాబోయే అక్టోబర్ 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పారిస్‌లో ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించనుంది. ఉగ్రవాదానికి నిధుల పంపిణీ, మనీ లాండరింగ్ నిరోధక చర్యలపై దేశాల పనితీరును సమీక్షించే ఈ సమావేశం వేళ మళ్లీ గ్రే లిస్ట్ ప్రమాదం ముంచుకొస్తుందన్న భయంతోనే పాక్ తన అధికారిక రికార్డుల్లో అజార్ పేరును మోస్ట్ వాంటెడ్‌గా చేర్చి పారితోషికం పెంచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. భారత్‌పై అనేక దాడుల సూత్రధారి 58 ఏళ్ల వయసు కల్గిన మసూద్ అజార్ నేతృత్వంలోని జైషే మహమ్మద్ సంస్థ పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తూ భారత గడ్డపై అత్యంత దారుణమైన ఉగ్ర దాడులకు ఒడిగట్టింది. 2001 పార్లమెంట్ దాడి, 2008 ముంబై ఉగ్రదాడులు, 2016 పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్ దాడి, 2019 పుల్వామా దాడి వెనుక మసూద్ హస్తం ఉంది. 2025 నవంబర్ 10వ తేదీన ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన దర్యాప్తులోనూ మసూద్ అజార్ పేరు మళ్లీ వెలుగులోకి వచ్చింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఇప్పటికే ఇతడిని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన విషయం తెలిసిందే.

## భారత్,చైనా ఎల్‌ఎసి వద్ద సడలిన ఉద్రిక్తతలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** భారత్‌చైనా సరిహద్దుల్లోని వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వద్ద గత కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న దౌత్య, సైనిక సంక్షోభం క్రమంగా తొలగిపోతోంది. ఉత్తర సరిహద్దు ప్రాంతాల్లో చైనాకు చెందిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) తన సైనిక మోహరింపులను గణనీయంగా తగ్గించుకున్నట్లు భారత రక్షణ మంత్రిత్వ శాఖ తన వార్షిక నివేదికలో అధికారికంగా వెల్లడించింది. ఇరుదేశాల మధ్య నిరంతరం జరిగిన దౌత్య, రాజకీయ చర్చల ఫలితంగా సరిహద్దులో ఉద్రిక్తతలు తగ్గి స్థిరత్వం ఏర్పడటంతో పాటు జమ్మూ కశ్మీర్‌లోనూ శాంతిభద్రతలు గణనీయంగా మెరుగైనట్లు నివేదిక స్పష్టం చేసింది. 2020లో తూర్పు లద్దాఖ్ సెక్టార్‌లో చోటుచేసుకున్న భయాందోళనకర సైనిక ఘర్షణల తర్వాత సరిహద్దుల్లో ఇరుదేశాలు ఊహించని రీతిలో భారీగా దళాలను రంగంలోకి దించాయి. ఆ సమయంలో కేవలం లద్దాఖ్ ప్రాంతంలోనే చైనా 60వేల మందికి పైగా సైనికులను దింపింది. అయితే 2024లో రెండు దేశాల మధ్య కుదిరిన కీలకమైన సైనిక దళాల ఉపసంహారణ అవగాహన ఒప్పందం, ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన ఉన్నత స్థాయి చర్చలు ఈ పరిస్థితుల్లో సానుకూల మార్పు తెచ్చాయి. రక్షణ శాఖ తాజా నివేదిక ప్రకారం ప్రస్తుతం చైనా సరిహద్దులకు ఇరువైపులా 10 చొప్పున కంబైన్డ్ ఆర్మీ బ్రిగేడ్లను మాత్రమే అంటే సుమారు 50వేల మందితో మాత్రమే బందోబస్తు నిర్వహిస్తోంది. బీజింగ్ తన వైపు నుంచి సైనిక బలగాల సంఖ్యను తగ్గించినప్పటికీ భారతదేశం ఎలాంటి అలసత్వానికి తావివ్వడం లేదు.

వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) పొడవునా ఉన్న అన్ని వ్యూహాత్మక సెక్టార్లలో భారత సైన్యం పటిష్టమైన వ్యూహాన్ని అమలు చేస్తూ సంసిద్ధతను కొనసాగిస్తోంది. భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి అపవాదులు లేదా అత్యవసర పరిస్థితులనైనా తక్షణమే తిప్పికొట్టేందుకు సైన్యం పూర్తి స్థాయి అప్రమత్తతతో నిఘా ఉంచినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ నివేదిక వివరించింది. మరోవైపు భారత సైన్యం అహర్నిశలు శ్రమించడం వల్ల జమ్మూ కశ్మీర్ లోయలో శాంతిభద్రతలు మునుపటి కంటే ఎంతో బలపడ్డాయని నివేదిక తెలిపింది. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం వల్ల లోయలోని ప్రజలు హింసను వీడి అభివృద్ధి మార్గాన్ని ఎంచుకున్నారు. ప్రభుత్వం, సైన్యం సంయుక్తంగా నిర్వహించే పలు కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు విశేషంగా పాల్గొంటున్నారు. దీని ఫలితంగా ఒకప్పుడు నిత్యకృత్యంగా మారిన రాళ్ల దాడులు, నిరసనలు, హింసాత్మక ఘటనలు కాశ్మీర్‌లో పూర్తిగా కనుమరుగయ్యాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి పరిస్థితి పూర్తిగా మారిపోయి ప్రశాంత వాతావరణం నెలకొందని రక్షణ శాఖ పేర్కొంది.

## యువతిని కారుతో ఢీకొట్టి ఈడ్చుకెళ్లిన ప్రియుడు!



**లక్నో, సెప్టెంబరు 16:** దేశంలో రోజురోజుకు మహిళలపై ఘోరాలు పెరిగిపోతున్నాయి. ఎన్ని కఠిన చట్టాలొచ్చినా అబలలకు మాత్రం రక్షణ కరవుతోంది. మొన్నటికి మొన్న గురుగ్రామ్‌లో ఓ మహిళా బైకర్‌ను ఓ మృగాడు కారుతో ఢీకొట్టి పరారయ్యాడు. ఈ ఘటనలో బాధితురాలు స్వల్ప గాయాలతో బయటపడింది. ఈ ఘటనను ఇంకా మరిచిపోక ముందే ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో మరో దుర్మార్గంజరిగింది. ఓ యువతిని కారు ఢీకొట్టి పరారయ్యాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనలపై మహిళా లోకం ఆందోళనకు గురవుతోంది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో గోమతీనగర్‌లోని జ్ఞానేశ్వర్ మిశ్రా పార్క్ సమీపంలో ఓ యువతిని కారు ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించిన షహన్వాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, అతడి కారును స్వాధీనం చేసుకున్నారు. జ్ఞానేశ్వర్ మిశ్రా పార్క్ గేట్ నంబర్ 4 సమీపంలో ఈ ఘటన జరిగింది. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమెను వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి పంపించారు. ప్రాథమిక దర్యాప్తులో నిందితుడు షహన్వాజ్, బాధితురాలు దాదాపు ఏడాది కాలంగా ఒకరికొకరు పరిచయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పార్క్ సమీపంలో షహన్వాజ్ మరో యువతితో కనిపించడాన్ని బాధితురాలు గమనించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ఈ క్రమంలో ఆమె కారు ముందు నిలబడినట్లు పోలీసులు చెబుతున్నారు. అనంతరం కారు ఆమెను ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆమెను ఉద్దేశపూర్వకంగా కారుతో ఢీకొట్టాడా లేక ఘటన అనుకోకుండా జరిగిందా అనే విషయాన్ని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్షిప్త వార్తలు

### పవిత్ర మక్కాలోకి హౌతీడ్రోన్




**దుబాయి, సెప్టెంబరు 16:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మక్కా సమీపానికీ చేరాయి. మక్కా నగరానికి సమీపంలోని నిషేధిత గగనతలంలోకి ఓ డ్రోన్ ప్రవేశించేందుకు ప్రయత్నించగా సౌదీ అరేబియా రాయల్ ఎయిర్ డిఫెన్స్ బలగాలు దానిని అడ్డుకుని కూల్చివేసినట్లు సౌదీ అధికారులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో మక్కా, జెడ్డా, తైఫ్ నగరాల్లో భద్రతా అప్రమత్తతను పెంచారు.

### అరేబియా సముద్రజలాల్లో ఢీకొన్న ఇండోపాక్ నౌకలు!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** అంతర్జాతీయ సముద్ర జలాల్లో ఇండో, పాక్ నౌకలు ఢీకొన్నాయి. ఈ ఘటనపై ఇవాళ భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. పాకిస్థాన్ నౌకాదళ వ్యవహారం ఆమోదయోగ్యంగా లేదని, దాని ప్రవర్తన ప్రొఫెషనల్‌గా లేదని భారత్ పేర్కొన్నది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ దౌత్యవేత్తకు భారత్ సమన్లు జారీ చేసింది. భారతీయ నేవీ నౌకను పాక్ నేవీ నౌక ఢీకొన్నట్లు విదేశాంగ వర్గాలు తెలిపాయి.

### ఇన్‌స్టా రీల్స్‌లో గన్‌తో కనిపించడంతో పోలీస్ సస్పెన్షన్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** దేశ రాజధాని ఢిల్లీలో భారత్ అధ్యక్షతన ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా భద్రతా విధుల్లో ఉన్న ఒక పోలీస్ తన వద్ద ఉన్న గన్స్‌తో రీల్స్ చేసి వీడియో క్లిప్స్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అధికారుల దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆ పోలీస్‌ను సస్పెండ్ చేశారు. ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఢిల్లీ పోలీస్ కానిస్టేబుల్ దీపక్ బంగర్ రూఫ్‌టాప్ స్నైపర్ డ్యూటీ నిర్వహించారు.

### ఆర్టీసి బస్సులకు టివికె పార్టీ రంగులు!



**చెన్నై, సెప్టెంబరు 16:** తమిళనాడులో విజయ్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన తర్వాత వరుసగా ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటున్నారు. విజయ్ ప్రభుత్వం ఇపుడు మరో వివాదంలో చిక్కుకుంది. సేలంలో 25 కొత్త ప్రభుత్వ టౌన్ బస్సులను టీవీకే పార్టీ జెండాలో ఉండే పసుపు, ఎరుపు రంగుల్లో సిద్ధం చేయడం రాజకీయ చర్చకు దారితీసింది. జాన్సన్‌పేట్ ప్రాంతం నుంచి ఈ కొత్త బస్సుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అయితే, ప్రభుత్వ బస్సులకు టీవీకే పార్టీ జెండాను పోలిన రంగులు వేయడంపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది.

### తదుపరి పిఎం యోగి అంటూ ఓ వీరాభిమాని పచ్చబొట్టు




**లక్నో, సెప్టెంబరు 16:** ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌స్వతహాగా ఓ సాధువు. సీఎం కాకముందు గోరఖ్ పూర్ ఆలయంలో పూజలు చేస్తూ కనిపించిన యోగీ ఆ తర్వాత మాత్రం రాజకీయాల్లో బిజీ అయిపోయారు. యూపీలోని బిజ్నోర్‌కు చెందిన ముస్లిం న్యాయవాది తాబిష్ నిసార్ కు సీఎం యోగి ఆదిత్యనాథ్ అంటే వీరాభిమానం. నిసార్ తన అభిమాన నేత యోగీపై తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేస్తూ తాజాగా ఛాతీపై శాశ్వత పచ్చబొట్టు వేయించుకున్నారు. తన ఛాతీపై "నెక్స్ట్ పిఎం, సిఎం సాహెబ్ మహారాజ్ జీ యోగి జీ బీజేపీ" అనే పదాలను పచ్చబొట్టుగా వేయించుకున్నారు.

# నెహ్రూ సాహసంతో తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛ

### టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్



**హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** భారత ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ సాహసోపేవతంగా నిరంకుశరాజుపై ఒత్తిడి పెంచి తెలంగాణప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రోజు సెప్టెంబర్ 17 అని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. తెలంగాణ విలీన దినోత్సవం చరిత్రలో మరపురాని రోజు ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛకు నాంది పలికిన మహత్తర ఘట్టమనీ ఆయన ప్రజలకు శుభకాంక్షలు తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడంతో ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమమైందనీ దీనికి మూలకారణం ఆనాటితొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ బాయ్ పటేల్ తెలంగాణ గడ్డపై ప్రజలు పడుతున్న బాధలను చూడలేక పోలీసు చర్య చేపట్టారని చరిత్రను గుర్తుచేసుకొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరులు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, సామాన్య ప్రజల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవాలని కోరారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటం ఒక రాజకీయ పార్టీకి, ఒక వర్గానికి, ఒక ప్రాంతానికి మాత్రమే సంబంధించినది కాదు. ఇది ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్యం కోసం జరిగిన చారిత్రక పోరాటం. ఆ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నానను ఆని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సామా జిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడమే ఆ మహనీయులకు మనం అందించే నిజమైన నివాళి అన్నారు. నాటి పోరాట స్ఫూర్తితో తెలంగాణను మరింత అభివృద్ధి చెందిన, సంక్షేమం-సామాజిక న్యాయం-ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యతనిచ్చే రాష్ట్రంగా నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించకుండా, నాటి పోరాటంలో భాగమైన అన్ని వర్గాల త్యాగాలను గౌరవించాలనీ చెప్పారు. చరిత్రను విభజనకు కాకుండా భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా మలచాలనీ కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరి రక్షణకు కట్టుబడి ఉంటుందని తెలిపారు.

# ఆర్మూర్ అభివృద్ధికి అవసరమైతే రాజీనామా చేస్తా

### ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** 'నిజామ్ సాగర్‌తో పంటలు పండించి కళకళలాడిన జిల్లా ఇప్పుడు కరవు కోరల్లో చిక్కుకొంది. అక్కడి బాగోగులు పాలకులకు పట్టడంలేదు ఎన్నొద్దులు నిజామాబాద్‌ను నిర్లక్ష్యం చేసి మోసం చేస్తారు? ఆర్మూర్‌లో ఎమ్మార్వో కార్యాలయం వందసం వత్సరాలకుపై బడి ఉంది దానికి పునర్నిర్మాణం చేయడానికి 27కోట్ల నిధులు ఇవ్వడానికి వెనుకాడుతున్నారు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి, మంత్రుల అసెంబ్లీ నియోజకవర్గాలకు అభివృద్ధి పనులకోసం కేటాయిస్తున్న నిధుల్లో కనీసం సగం మేర ఆర్మూర్ నియోజకవర్గానికి కూడా కేటాయించండి' అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. గత రెండేళ్లుగా నియోజకవర్గంలోని సమస్యలను ముఖ్యమంత్రి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతున్నప్పటికీ స్పందన లేదని ఆరోపించారు. నిజామాబాద్ అభివృద్ధి విషయం గురించి సభలో మాట్లాడని వ్యకపోతే రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎవరికి పట్టని జిల్లా అయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఆర్మూర్ లో ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ కార్యాలయాల పరిస్థితిపై పలుమార్లు ప్రశ్నించినా పట్టించుకునే నాథుడే లేదని రాకేష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రుల నియోజక వర్గాలకు ఏ విధంగా నిధులు కేటాయిస్తున్నారనే వివరాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఆర్మూర్ నియోజకవర్గానికి కూడా తగిన స్థాయిలో నిధులు కేటాయించి శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ కార్యాలయాలను పునర్నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమీకృత రెవెన్యూ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.27 కోట్లు మంజూరు చేస్తే అందులోనే ఆర్డీవో ఆఫీసు కూడా కట్టుకొంటామని ఆయన సభలో తెలిపారు. పరిగికి 50వేల కోట్లు నిధులు పెట్టుబడి రావడం సంతోషమే కొడంగల్, నారాయణపేటకు నిధులు ఇచ్చుకోండి కానీ ఆర్మూర్‌కుకూడా అందులో పదోవంతు అభివృద్ధికి ఇవ్వాలి కాదా అని ప్రశ్నించారు. ఆర్మూర్‌నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోతే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని రాకేష్ రెడ్డిస్పష్టం చేశారు. ఆర్మూర్ అభివృద్ధి కోసం ఎన్నిసార్లు విన్నవించుకోవాలని ఆయన అసెంబ్లీలో ఆవేదన వ్యక్తం చేశారు.

## టిపిసిసి చీఫ్‌ను అభినందించిన మాజీ ఎంపి సురేందర్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** టిపిసిసి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌ను మాజీ ఎంపి ఆర్. సురేందర్ రెడ్డి కలిసిశుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మహేష్ కుమార్ గౌడ్ ఇంటికి సురేందర్ రెడ్డి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌కు సురేందర్ రెడ్డి శాలువా కప్పి సన్మానించారు.1990 నుంచి మహేష్ కుమార్ గౌడ్ తో సురేందర్ రెడ్డి అత్యంత సన్నిహితంగా ఉన్నారు.

## ఆయిల్‌పాం సాగుతో ఎల్‌నినో, కోతుల సమస్యకు పరిష్కారం

### సాగులో తెలంగాణకు ప్రథమస్థానం, 3.20 లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్న 88282 మంది రైతులు: మంత్రి తుమ్మలనాగేశ్వరావు

**హైదరాబాద్,సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** ఆయిల్‌ఫాం సాగుతో ఎల్‌నీనో కోతుల సమస్యలకు పరిష్కారం అవుతోందని రైతులను ఆదిశగాప్రోత్సహిం చాలని వ్యవసాయ,మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యేలు ఆది నారాయణ జారే మనోహర్‌రెడ్డి, గండ్రసత్యనారాయణ, చిక్కుడువంశీకృష్ణ,వేముల వీరేశం, కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నకు మంత్రి తుమ్మల సుదీర్ఘ సమాధానం చెప్పారు. ప్రస్తుతం, రాష్ట్రంలో 88,282 మంది రైతులు 3.20లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారనీ వివరించారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ ఆయిల్ పామ్ పథకం కింద, 2021-22నుండి 2.47 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగు పరిధిలోకి తీసుకురావడం జరిగిందనీ అన్నారు. భారతదేశంలోనే ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో తెలంగాణ ప్రథమ స్థానంలో వుందనీ తెలిపారు.

## సర్ఫ్‌ఖాన్,భూదాన్ భూములు ఎవరి వద్ద ఉన్నా బయటకు తీయాలి

### బౌన్సర్లతో రాజ్యమేలుతున్న భూదురాక్రమణదారులు: సిపిఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు



**హైదరాబాద్,సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** తెలంగాణలో కోటికిపైగా ఎకరాల ప్రైవేటు భూములను పివోబి లో చేర్చారని నిజామ్ ఆస్తులు సర్ఫ్‌ఖాన్, భూధాన్‌భూములు,ఎనిమి ప్రాపర్టీ,పరారీప్రాపర్టీ, చెరువులు కుంటల భూములు ఎవరి చేతిలో ఉన్నాయో వాటిని బయటకు తీయాలని సిపిఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. 22ఎ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కోనేరు రంగారావు కమిటీ అనుగుణంగా ధరణికి ముందు 22ఎచట్టం తీసుకొచ్చారని తెలిపారు. కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటం ఎక్కడ జరగలేదని ప్రభుత్వ భూముల పరిరక్షణ పేదలకు పంపిణీ చేయాలని మావోయిస్టు చర్చల సందర్భంలో 2005లో వచ్చిన డిమాండ్ మేరకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కోనేరు రంగారావు కమిటీని ఏర్పాటు చేశారని అప్పుడే 22ఎ తెరపైకి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు చాలా నష్టం జరిగిందని ఆవేదన చెందారు. 22ఎలో తప్పిదాలు లేవని సాంకేతిక సమస్యలు మాత్రమే ఉన్నాయని సాంబశివరావు తెలిపారు. కేవలం మూడు లక్షల ఎకరాల ప్రైవేటు భూములు బయటకు తీసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదల భూములు దురాక్రమణదారులు ఆక్రమణ చేసుకొని బౌన్సర్లను పెట్టకొని దౌర్జన్యం చేస్తున్నారని తెలంగాణలో బౌన్సర్ల రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. అసైన్డ్ భూములు పేదలు కొనుగోలు చేస్తే వాటిని క్రమబద్దీకరణ చేయాలని గొప్పవాళ్ళు కొంటే వాటిని స్వాధీనం చేసుకోవాలనీ సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థ భూములు అసైన్డ్‌భూములు, చెరువులు కుంటలు నిజాం ప్రాపర్టీ భూదాన్ భూములు ఎవరి చేతిలో ఉన్నాయోవాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్‌భూముల వివరాలు వెల్లడించాలని ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ప్రభుత్వం ఆలోచించి నిర్ణయంతీసుకోవాలని కోరారు. 22ఎలో మంత్రులు అధికారుల పాత్రను కూడా తేల్చాలనిడిమాండ్ చేశారు. తెలంగాణలో భూమికోసం భుక్తి కోసం పోరాటం జరిగిందని దీని కోసం దొడ్డికొమురయ్య, రావినారాయణరెడ్డి, కొమురంభీం చాకలి ఐలయ్య వంటివారు పోరాటం చేశారని గుర్తుచేశారు. జల్‌జమీన్ జంగల్ కోసం తెలంగాణ కవులు కళాకారులు నేటికి గళం ఎత్తుతున్నారని తెలిపారు. తెలంగాణలో పదకొండు లక్షలకు పైగా సాదాబైనా మాలు పరిష్కరించాలని కోరారు. తెలంగాణ విలీన దినం అధికారికంగా జరుపాలని సూచించారు. ఎమ్మెల్యే శంకరయ్య మాట్లాడుతూ కరీంనగర్ ఎమ్మెల్యే గంగులకమలాకర్ గనులు మాత్రమే మింగలేదు విమానశ్రయం పక్కన ఐదువందల ఎకరాల భూములు ధరణి పేరతో దురాక్రమణ చేశారని ఆరోపించారు. మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేంద్రమంత్రి ధరణిపేరుతో దోచుకున్నారని ఆరోపించారు.

## ఆర్టీసికి 2025-26లో రూ.3850.45కోట్లు విడుదల

### ఆగస్టు 31వరకు రూ.882కోట్లు విడుదల

### శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు

### మైనార్టీలకు ఎనిమిది స్టడీ సర్కిల్స్ : మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్,సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రరోడ్డు సంస్థకు మహాలక్ష్మీ,వికలాంగులు,జర్నలిస్టు,విద్యార్థులు వంటి సామాజిక బాధ్యత నిర్వర్తించినందుకు ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి రూ. 4305.49కోట్లు చెల్లించాల్సి ఉండగా అదే ఆర్థిక సంవత్సారాంతానికి రూ.3850 కోట్లరూపాయలు చెల్లించిందని, మిగితా 455.04కోట్లు కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే సర్దుబాటు చేశామని శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు.బిజెపి ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాయల్ శంకర్ అడిగన ప్రశ్నకు రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ తరుపున మంత్రి శ్రీధర్‌బాబు సమాధానం ఇచ్చారు.మహాలక్ష్మీపథకం, వికలాంగులు, విద్యార్థులు, జర్నలిస్టులకు అందించే రాయితీలను ప్రభుత్వం టిజిఎస్‌ఆర్‌టిసికి క్రమం తప్పకుండా చెల్లిస్తోందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవ్సరం ఆగస్టు 31వరకు వివిధ వర్గాల రవాణా సౌకర్యం బాధ్యతలు నిర్వహించినందుకు ఆర్టీసికి తెలంగాణ ప్రభుత్వం 1793.95కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ. 882.80కోట్లు చెల్లించామని మిగితా 911.15కోట్ల రూపాయలు ప్రభుత్వం ఆర్టీసికి చెల్లించాల్సి ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్, అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాలా జాఫర్‌హుస్సేన్ మాజిద్‌హుస్సేన్ కౌసర్‌మోహియుద్దీన్ మీర్‌జుల్ఫీకర్ మహ్మద్ ఋబీన్‌లు అడిగిన ప్రశ్నలకు మంత్రి మహ్మద్ అజారుద్దీన్ సమాధానం ఇస్తూ ఆదిలాబాద్,హన్మకొండ, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ, నిజామాబాద్ సంగారెడ్డిలో స్టడీసర్కిల్స్ ప్రారంభించేందుకు ప్రతిపాదన చేశామని తెలిపారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

### త్వరలో ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు: మంత్రి వివేక్ వెంకటస్వామి

### తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడుగా మొగుళ్ల రాజి రెడ్డి ఎన్నిక

### మజ్దూర్ యూనియన్ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్‌లో విలీనం



బుధవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి గడ్డం వివేక్

**హైదరాబాద్ సెప్టెంబరు16,ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ తెలిపారు. హైదరాబాద్, నాగోల్, కల్యాణ లక్ష్మి గార్డెన్స్‌లో బుధవారం తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేలాదిమంది ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం తెలంగాణ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక కార్యదర్శి ఈ. అశ్వథామ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కోదండరాం, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏ.పి. మిథున్ రెడ్డి, ప్రముఖ గాయకులూ నల్గొండ గద్దర్, ఐ.ఎన్.టి.యు.సి సంయుక్త కార్యదర్శి ఇందిరా రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులూ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు వేదికపై ఆసీనులైనారు. తెలంగాణ ఆర్టీసీ మజ్దూర్ యూని యన్ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్‌లో విలీనమైందని, వర్కర్స్ యూని యన్ నూతన అధ్యక్షులుగా మొగుళ్ళ రాజి రెడ్డిని ఈ సమ్మె ళనం ఏకగ్రీవంగా ఎన్నుకుందని ఈ. అశ్వథామ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియ జరుగుతుందని, త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై తనకు మొద టి నుంచే అవగాహన ఉందన్నారు. 2019లో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో ఇ. అశ్వత్థామ రెడ్డితో కలిసి తాను అనేక డిపోలను సందర్శించి కార్మి కులకు అండగా నిలిచానని మంత్రి తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కూడా సమ్మెలో ఉన్న కార్మికులను కలిసి వారికి మద్దతు తెలిపినట్లు గుర్తు చేశారు. కార్మికులకు న్యాయం జరిగితే ఉత్పాదకత పెరుగుతుందని, సంస్థలు కూడా మెరుగ్గా పనిచేస్తాయని మంత్రి అన్నారు. కార్మికుల సంక్షేమం, సంస్థల అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాల్సి న అవసరం ఉం దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. 4,584 కొత్త ఉద్యోగాల భర్తీ జరిగిందని చెప్పారు. కారుణ్య నియామకాల ద్వారా కూడా 2వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలు కావడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. కార్మికులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని సంబంధిత అధికా రులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, తాను కలిసి ఆర్టీసీ కార్మికుల సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కోదండరాం మాట్లాడుతూ గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సాను కూలంగా ఉందని తెలిపారు. బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ జలమండలిలో మొగుళ్ళ రాజి రెడ్డి అన్ని విభాగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసాడని, ఫలితంగా జలమండలి ఉద్యోగులు మొగుళ్ళ రాజి రెడ్డిను భారీ మెజారిటీతో గెలిపించారని గుర్తు చేసారు. త్వరలో జరిగి ఆర్టీసీ గుర్తింపు కార్మిక సం ఘాల ఎన్నికల్లో నూతన అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ అభ్యర్థి ఈ. అశ్వథామ రెడ్డిను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మొగుళ్ళ రాజి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని, త్వరలో జరిగి ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (ఔ4522) విజయానికి ప్రతి యొక్క ఆర్టీసీ కార్మికుడు కృషి చేయాలనీ కోరారు.

## హైదరాబాద్ విమానాశ్రయంలో 11.59 శాతం తగ్గిన ప్రయాణికుల రద్దీ

### ఢిల్లీ విమానాశ్రయంలో పెరిగిన సంఖ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** ప్రయాణికులతో కిటకిటలాడే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రద్దీ తగ్గింది. అంతర్జాతీయ సంఘర్షణలు, ఆంక్షలు, పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావం మధ్య విమాన ప్రయాణికుల రద్దీ తగ్గింది. గత ఏడాది అగస్టు నెలలో పోలిస్తే హైదరాబాద్‌లో విమాన ప్రయాణాలకు సంబంధించిన అమ్మకాలు 11.5 శాతం తగ్గాయని జిఎమ్మార్ నివేదిక వెల్లడించింది. గత ఏడాది అగస్టులో 24,70,499 మంది ప్రయాణికులతో పోలిస్తే, ఈ ఏడాది ఇదే నెలలో విమానాశ్రయం నుండి 21,86,082 మంది ప్రయాణీకులు వివిధ రాష్ట్రాలు, దేశాలకు ప్రయాణించారు. ఇందులో దేశీయ ప్రయాణికుల రద్దీ 13.6 శాతం తగ్గగా, అంతర్జాతీయ రద్దీ 26 శాతం క్షిణించింది. జూలై కంటే ఈ క్షీణత మరింత తీవ్రంగా ఉంది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే జూలైలో ప్రయాణికుల రద్దీ 9.6 శాతం తగ్గింది. ప్రధాన విమానాశ్రయాలలో ప్రయాణికుల రద్దీ సాధారణంగా ఏటా పెరుగుతూ వచ్చింది. కానీ ఇటీవల నెలల్లో అంతర్జాతీయ పరిణామాలు ఆ ధోరణిని తారుమారు చేశాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 14.2 శాతం తగ్గి, అగస్టు నెలలో శంషాబాద్ విమనాశ్రయం 14,583 విమాన రాకపోకలను నిర్వహించింది. అలాగే మహారాష్ట్రలోని నాగ్‌పూర్ విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. అయితే ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈ విమానాశ్రయంలో అగస్టులో 60,83,616 మంది ప్రయాణించారు. ఇది గత ఏడాది అదె నెలతో పోలిస్తే 2.7 శాతం అధికం. ఇందులో అంతర్జాతీయ ప్రయాణికుల రద్దీ 1.7 శాతం పెరగ్గా, దేశీయ రద్దీ 3 శాతం పెరిగింది. ఢిల్లీ విమానాశ్రయంలో విమానాల రాకపోకలు కూడా వార్షికంగా 11.8 శాతం పెరిగాయి. సరుకు రవాణా విషయానికి వస్తే అగస్టు నెలలో 11 లక్షల టన్నులకు చేరుకుంఇ. ఇది గత ఏడాదితో పోలిస్తే 11.5 శాతం అధికం.

## పరిశ్రమలు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే బలమైన దేశంగా అభివృద్ధి

### బిఐఎస్ దక్షిణ ప్రాంతం డిడిజి

### కొత్తగా లైసెన్స్ పొందిన తయారీదారుల కోసం బిఐఎస్ హైదరాబాద్ మనక్ సంవాద్‌ను నిర్వహిస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న సదరన్ రీజియన్ డిడిజి ఎం.ఎ.జె. వినోద్

**హైదరాబాద్,సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** పరిశ్రమలు, ఉత్పాదక సంస్థలు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొని వస్తే అంతర్జాతీయంగా నిలదొక్కుకొంటామని బలమైన దేశంగా అభివృద్ధికి బాటలు వేయడానికి వీలవుతోందిన బిఐఎస్, సదరన్ రీజియన్ డిడిజి ఎం.ఎ.జె. వినోద్, పిలుపునిచ్చారు.బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హైదరాబాద్ బ్రాంచ్ ఆఫీస్, తన ప్రపంచ ప్రమాణాల దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా కొత్తగా లైసెన్స్ పొందిన తయారీదారుల కోసం ఇండస్ట్రీ సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్ అయిన మనక్ సంవాద్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన 22 మంది పాల్గొన్నారు. పర్యావరణ హితంగా పరిశ్రమలు నెలకొల్పాలని, భారతీయ ప్రమాణాలను ఔత్సాహిక పారిశ్రామిక ఉత్పత్తిదారులు ఖచ్చితంగా పాటించాలని, కఠినమైన నాణ్యతా పద్ధతులను కొనసాగించాలని కోరారు. దేశంలో నాణ్యమైన సంస్కృతిని బలోపేతం చేయడానికి పరిశ్రమలు చురుకుగా సహకరించాలని ఆయన కోరారు డైరెక్టర్, సైంటిస్ట్ హెడ్, బిఐఎస్ హైదరాబాద్ బ్రాంచ్ ఆఫీస్, పి.వి. శ్రీకాంత్ మాట్లాడుతూ పరిశ్రమ వాటాదారుల మధ్య నిరంతర పరస్పర చర్య యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. కొత్తగా లైసెన్స్ పొందిన తయారీదారులు బిఐఎస్ సర్టిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ క్రింద తమ బాధ్యతలను అర్థం చేసుకోవడమేకాకుండా ఆచరించాలని అప్పుడే నాణ్యత, భద్రత, వినియోగదారుల విశ్వాసాన్ని నిర్ధారించడంలో ప్రామాణీకరణను అంతర్భాగం గా చూడవలసిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. బిఐఎస్ హైదరాబాద్‌లోని సైంటిస్ట్‌డిప్యూటీ డైరెక్టర్ కె కవిన్ టెక్నికల్ సెషన్‌ను నిర్వహించారు, వీరు బిఐఎస్ లైసెన్స్ కార్యకలాపాలు, ఉత్పత్తి మార్కింగ్ అవసరాలు, నిఘా కార్యకలాపాలు సమ్మతి బాధ్యతలపై వివరణాత్మక సమాచారాన్ని అందించారు. ఈ సెషన్ బిఐఎస్ కేర్ యాప్, ఫిర్యాదు పరిష్కార మెకానిజం యొక్క వినియోగాన్ని కూడా కవర్ చేసింది, బిఐఎస్ సేవలన ధృవీకరించబడిన తయారీదారులుగా వారి బాధ్యతలను బాగా అర్థం చేసుకోవడానికి వీలు కల్పిస్తుందనీ తెలిపారు. సంబంధిత భారతీయ ప్రమాణాలకు నిరంతరం అనుగుణంగా ఉండాలని వర్తించే అన్ని బిఐఎస్ అవసరాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. పరిశ్రమ వినియోగదారుల మధ్య నాణ్యత అవగాహనను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన బిఐఎస్ కార్యక్రమాలు, కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేందుకు కూడా వారిని ప్రోత్సహించారు.బిఐఎస్ కేర్ యాప్,బిఐఎస్ పోర్టల్ ద్వారా ఐఎస్ఐ మార్క్, హాల్‌మార్క్, సిఆర్ఎస్ రిజిస్ట్రేషన్‌ల యొక్క ప్రామాణికతను ధృవీకరించడం యొక్క ప్రాముఖ్యత కూడా కార్యక్రమంలో హైలైట్ చేస్తూ పారిశ్రామిక వేత్తలకు వివరించారు.మనక్ సంవాద్ బిఐఎస్ అధికారులు మరకొత్తగా లైసెన్స్ పొందిన తయారీదారుల మధ్య ప్రత్యక్ష పరస్పర చర్య కోసం ఒక వేదికను అందించింది, ధృవీకరణ అవసరాలు, సమ్మతి బాధ్యతలు, నాణ్యత, వినియోగదారుల నమ్మకాన్ని ప్రోత్సహించడంలో ప్రామాణీకరణ, విస్తృత పాత్ర గురించి అవగాహన కల్పించారు.

## రెవెన్యూ భవనాల నిర్మాణానికి రూ.640కోట్లు విడుదల: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** రెవెన్యూ భవనాల నిర్మాణంకు రూ.640కోట్లు విడుదలచేశామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఎంఎల్ఎ డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు బుధవారం మంత్రి పొంగులేటి సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యేలు వీర్నెపల్లి శంకర్, పాల్వాయి హరీష్,పాయలశంకర్,నాగరాజు,పైడిరాకేష్‌రెడ్డి అడిగిన అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. హౌజింగ్‌బోర్డు నిర్మాణ వ్యయం రేట్లు తక్కువగా ఉండటంతో టెండర్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని ఆర్‌అండ్‌బికి నిర్మాణ బాధ్యతలు అప్పగించాలని పాల్వాయి హరీష్‌కోరినా మంత్రి ప్రస్తుత ఎస్ఎస్ఆర్‌కు అనుగుణంగానే రేట్లు ఉన్నాయని తెలిపారు. పాయలశంకర్ కలెక్టరేట్ భవనం ఆదిలాబాద్‌లో కూలిందని కొత్తది కట్టడం మధ్యలో ఆగిందని తెలుపగా త్వరలోనే నిర్మాణం చేసి కొత్తభవనం ప్రారంభించుకొందామని తెలిపారు. సమీకృత రెవెన్యూ ఆఫీసులను నిర్మించుకొందామని ఎమ్మెల్యేల సూచనకు సానుకూలంగా మంత్రి స్పందించారు.

## నేడు ప్రజలతో ముఖాముఖి రద్దు

**హైదరాబాద్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా – గాంధీ భవన్ లో జరిగే "ప్రజలతో ముఖాముఖి" కార్యక్రమం రద్దుచేసినట్లు గాంధీభవన్ పిఆర్‌వో హరీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం అజారుద్దీన్ గాంధీభవన్‌లో ప్రజలకు అందుబాటులో ఉండాలని నిర్ణయించినప్పటికి భారత ప్రభుత్వ ఉపరాష్ట్రపతి రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్నివాయిదా వేశారని విరవరించారు. గురువారం ప్రజలతో ముఖాముఖి రద్దు చేసినప్పటికి వచ్చేవారం నుండి యధావిధిగా జరుగుతుందని తెలిపారు.

# రాష్ట్రంలో మరో విద్యుత్ కేంద్రం

### పెరుగుతున్న డిమాండ్‌కు పరిష్కారం

### విద్యుత్ సామర్థ్య పెంపుతోనే ఆర్థిక పోటీతత్వం

### ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు, వినియోగాన్ని సమర్థవంతంగా తగ్గించడం ద్వారా కూడా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించవచ్చని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్‌లో మాట్లాడుతూ ఉత్పత్తి చేసే విద్యుత్ యూనిట్ కంటే అవసరం లేకుండా పొదుపు చేసే విద్యుత్ యూనిటే చౌకైనదన్నారు. ఇంధన సామర్థ్యాన్ని కేవలం పర్యావరణ పరిరక్షణ అంశంగా కాకుండా ఆర్థిక పోటీతత్వాన్ని పెంచే వ్యూహంగా చూడాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులో ఉన్న బొగ్గు, పునరుత్పాదక విద్యుత్, ట్రాన్స్‌మిషన్ మౌలిక వసతులు అవసరం వంటి అంశాలపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. మెరుగైన మోటార్లు, సమర్థవంతమైన శీతలీకరణ వ్యవస్థలు, ఇంధన సామర్థ్య భవనాలు, మెరుగైన పారిశ్రామిక ప్రక్రియ, స్మార్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చని వివరించారు. ప్రతి మెగావాట్ విద్యుత్ డిమాండ్‌ను శాశ్వ తంగా తగ్గించగలిగితే మొత్తం విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి తగ్గు తుందని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో భవిష్యత్తులో విద్యుత్ అవసరం మరింత పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమలు, తయారీ రంగం, డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డిమాండ్ పెరుగుతున్నందున ప్రతి యూనిట్ విద్యుత్‌తో మరింత ఆర్థిక కార్యకలాపాలను సాధించడమే పరిష్కారమని పేర్కొన్నారు. పారిశ్రామిక సంస్థలు తక్కువ విద్యుత్ వినియోగిస్తే వాటి నిర్వహణ వ్యయం తగ్గుతుందన్నారు. తెలంగాణలో పీక్ విద్యుత్ డిమాండ్ తగ్గితే ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలపై ఒత్తిడి తగ్గుతుందని వెల్లడించారు. ఇంధన సామర్థ్యం వ్యాపార సంస్థల నిర్వహణ వ్యయాలను తగ్గించడమే కాకుండా వనరుల ఉత్పాదకతను పెంచుతుందని చెప్పారు. ఒక పరిశ్రమలో విజయవంతమైన సాంకేతికత మరో పరిశ్రమకు ఉపయోగపడుతుందని చెప్పారు. సిమెంట్ పరిశ్రమలో పరిష్కరించిన సమస్య ఉక్కు పరిశ్రమకు ఉపయోగపడవచ్చని, పేపర్ మిల్లులో అమలు చేసిన ఇంధన సామర్థ్య విధానం ఇతర రంగాలకు ఆదర్శంగా నిలవవచ్చన్నారు. ఒక కర్మాగారంలో విజయవంతమైన ప్రయోగాన్ని వంద కర్మాగారాలకు విస్తరించడమే అసలు సవాలని అన్నారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుదీకరణ, డిజిటలైజేషన్, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు.

సెన్సర్ల ద్వారా ఎక్కడ విద్యుత్ వృథా అవుతుందో గుర్తించవచ్చన్నారు. మానవ ఆపరేటర్లు గుర్తించలేని నమూనాలను కూడా కృత్రిమ మేధస్సు గుర్తించగలదన్నారు. భవిష్యత్తులో కర్మాగారాలు కేవలం వినియోగదారులుగా కాకుండా విద్యుత్ వ్యవస్థలో చురుకైన భాగస్వాములుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన వినియోగాన్ని కొలవకుండా వ్యవస్థాగత మార్పులు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

# సెమీకండక్టర్ రంగంలో భారత్ మరింత ముందుకు



## నగర సమస్యలకు సమగ్ర, దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరం

### ఢిల్లీలో జనాగ్రహా షెహారోన్ పే చర్చా కార్యక్రమంలో కెటిఆర్

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చినప్పుడు తాత్కాలికంగా స్పందించడం కాకుండా సమగ్ర, దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి సారించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం ఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో జనాగ్రహా ఆధ్వర్యంలో నిర్వహించిన షెహారోన్ పే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భారత నగరాలను ప్రజలకు మరింత అనుకూలంగా తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలపై నిర్వహించిన ప్యానెల్ చర్చలో కేటీఆర్ పాల్గొన్నారు. పార్లమెంటేరియన్లు మహువా మాజి, ఎస్. నిరంజన్ రెడ్డి, జనాగ్రహ సీఈఓ శ్రీకాంత్ విశ్వనాథన్‌తో కలిసి జరిగిన చర్చలో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధా నాలు, పట్టణాభివృద్ధి కార్యక్రమాలను కేటీఆర్ వివరించారు. ప్రజలు ఏదైనా సమస్యతో నాయకుల వద్దకు వచ్చినప్పుడు దానికి సమగ్ర, దీర్ఘకాలిక పరిష్కారం చూపించాలి. సమస్య వచ్చిన వెంటనే హడావుడిగా స్పందించడం, తాత్కాలిక చర్యలు చేపట్టడం సరిపోదు అని కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్‌పై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు అప్పటి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. ప్రతి జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో పాటు అనేక టైర్2 నగరాల్లో ఐటీ టవర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను హైదరాబాద్‌కు వెలుపల కూడా అభివృద్ధి చేయడం ద్వారా నగరంపై ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేసినట్లు వివరించారు. పట్టణ రవాణా, ప్రజా రవాణా వ్యవస్థలపై మాట్లాడుతూ హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ద్వారా పెద్ద నగరాలపై రవాణా, జనాభా ఒత్తిడిని తగ్గించవచ్చని కేటీఆర్ అన్నారు. వచ్చే దశాబ్దంలో ఈ దిశగా మరింత పురోగతి సాధిస్తామనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.

నగర ప్రభుత్వాలకు మూలధనం అందుబాటులోకి తీసుకురావడం పెద్ద సవాలుగా ఉందని కేటీఆర్ అన్నారు. నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు వినూత్నమైన, అందరినీ భాగస్వామ్యం చేసే విధానాలను అనుసరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం కేటీఆర్ కార్యక్రమం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారత్ ఏఐ ఎక్స్‌పీరియెన్షియల్ సెంటర్‌ను సందర్శించారు. ప్రజా ప్రయోజనాల కోసం కృత్రిమ మేధస్సు ఆధారిత పరిష్కారాలపై పనిచేస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. భారతదేశంలోని నగరాలు, పట్టణాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో జనాగ్రహా సంస్థ పనిచేస్తోంది. పట్టణ పాలన రంగంలో ప్రభుత్వాలు, రాజ్యాంగ సంస్థలు, పౌర సమాజ సంస్థలతో భాగస్వామ్యంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

## రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** భారత సాంకేతిక భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభుత్వం, సెమీకండక్టర్ పరిశ్రమ మధ్య సన్నిహిత సహకారం ఎంతో కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సేవా తీర్థ్‌లో అగ్రశ్రేణి సెమీకండక్టర్ కంపెనీల సీఈఓలతో నిర్వహించిన సెమీకండక్టర్ రౌండ్‌టేబుల్ సమావేశానికి ప్రధాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ వనరులు, సాంకేతికతను వేగంగా స్వీకరించే సామర్థ్యం, మౌలిక సదుపాయాల పరంగా భారత్ బలమైన పునాదిని ఏర్పరచుకుందని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో పరిశ్రమ మరింత చురుకుగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో కోటి మందికి ఏఐలో శిక్షణ ఇవ్వాలనే లక్ష్యాన్ని ప్రస్తావించిన ప్రధాని భారత్‌లోని మానవ వనరులకు ఈ పరిశ్రమ దిగ్గజాల అనుభవం, సామర్థ్యాలు తోడైతే భారీ అవకాశాలను సృష్టించవచ్చని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో ప్రపంచంలో తొలిదశలోనే నాయకత్వ స్థానాన్ని సాధించే దిశగా భారత్ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని మోడీ అన్నారు.




సెమీకండక్టర్ రంగంలో ఇటీవలి కాలంలో గణనీయమైన పురోగతి సాధించామని, ఇప్పుడు ఈ రంగం ప్రాథమిక దశ ప్రయత్నాల నుంచి భారీ స్థాయి విస్తరణ, అవకాశాల దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ప్రభుత్వం స్థిరమైన, స్పందించే విధానపరమైన వాతావరణాన్ని అందించేందుకు కట్టుబడి ఉందని ప్రధాని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విధానాలు కూడా ఎప్పటికప్పుడు మారుతూ ఉండాలని చెప్పారు. విధానాలు, పరిపాలనా చర్యలకు సంబంధించి తమ సూచనలను పరిశ్రమ ప్రతినిధులు అందించాలని కోరారు. ఈ సూచనలను రంగాన్ని మరింత బలోపేతం చేసే చర్యల్లో పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. భారత్ సెమీకండక్టర్ రంగంలో తదుపరి దశ అభివృద్ధిలో పరిశ్రమ నాయకులు చురుకుగా భాగస్వాములు కావాలని మోడీ పిలుపునిచ్చారు. ప్రభుత్వ చర్యలపై సీఈఓల ప్రశంసలుభారత్‌లో సెమీకండక్టర్ సామర్థ్యాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిరంతరం చేస్తున్న కృషిని వివిధ సంస్థల సీఈఓలు, ప్రతినిధులు ప్రశంసించారు. తయారీ, డిజైన్, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సాధించిన పురోగతిని వారు ప్రస్తావించారు. ఐఎస్ఎం 2.0 కింద ఏర్పడుతున్న వృద్ధి అవకాశాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. సెమీకండక్టర్ విలువల చైన్‌లో తయారీ, పరిశోధన అభివృద్ధి, అధునాతన సాంకేతికతలు, అనుబంధ పరిశ్రమలు సహా వివిధ రంగాల్లో భారత్ తన సామర్థ్యాలను మరింత పెంచుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో సాధించిన పురోగతి భవిష్యత్తులో పరిశ్రమ మరింతగా భాగస్వామ్యం కావడానికి బలమైన పునాదిని ఏర్పరిచిందని అన్నారు. ప్రపంచ స్థాయిలో పోటీపడగల సెమీకండక్టర్, సాంకేతిక హబ్‌గా భారత్ ఎదగడంలో తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు. పాల్గొన్న సంస్థలుసెమీకండక్టర్ రంగానికి చెందిన సెమి మైక్రాన్, ఇన్ఫినాన్, అప్లయిడ్ మెటీరియల్స్, ఎఎస్ఎంఎల్, మెర్క్, టోక్యో ఎలక్ట్రాన్ లిమిటెడ్, ఫ్యూజిఫిలిమ్, ఎఎండి ఇంటెల్, టాటా ఎలక్ట్రానిక్స్, లామ్ రీసెర్చ్ రాపిడస్, ఎన్ఎక్స్‌పి, ఫాక్స్‌కాన్, సెమికండక్టర్ డివైసెస్, అడ్వాంటెస్ట్, సెలెస్టా కేపిటల్, సిజిపవర్, ఐబిఎం రీసెర్చ్ వంటి సంస్థల సీఈఓలు, అధిపతులు, ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

# భూముల సమాచారం మాఫియా చేతికి



### బిఆర్ఎస్ నేతలు భూములను ఇష్టారాజ్యంగా బదలీ చేసుకున్నారు

### ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కెసిఆర్ కన్ను భూములపై పడింది

### ధరణి భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోంది: సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా బుధవారం ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు. ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ.110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు- బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు. తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడు తుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో ధరణిపై కాగ్ తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్ఎఫ్ఎస్ దక్కించుకుందని వివరించారు. ఐఎల్ఎఫ్ఎస్ ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

## అసెంబ్లీ మీడియా పాయింట్

### ఆక్రమాలు జరిగితే చర్యలు ఎందుకు తీసుకోలేదు?

### బిజెపి ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** లక్షలాది ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని చెబుతున్న సిఎం, గత మూడేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని బిజెపి ఫ్లోర్ లీడర్ ఎలెటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ షార్ట్ డిస్కషన్‌లో క్లారిటీ ఇవ్వలేదు. మాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడుస్తున్నారు. లక్షల కోట్ల రూపాయల అవినీతి జరిగింది అని చెపుతూ ఎందుకు బహిర్గతం చేయలేదు. 23 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి కొల్లగొడితే అది సామాన్యమైన దోపిడి కాదు. దాన్ని ఎందుకు టేబుల్ చేయలేదు? రెవెన్యూ రికార్డ్స్ అంశంపై ముఖ్యమంత్రి క్లారిటీ ఇవ్వలేదు. అసలు ఉన్నాయా? లేవా? ప్రభుత్వ, దేవాదాయ, ఫారెస్ట్ భూముల పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు? ప్రభుత్వ భూములు, నిషేధిత భూములు ఎందుకు పబ్లిక్ డొమైన్‌లో పెట్టడం లేదు? గత ప్రభుత్వం చేసిన దోపిడీకి వత్తాసు పలుకుతున్నారా? చీకటి ఒప్పందం చేసుకున్నారా? అన్యాక్రాంతం అయిన 23 లక్షల ఎకరాల భూముల విషయంలో మౌనం ఎందుకు? దీనిపై స్పష్టత ఇవ్వాలి. భూములు అన్యాక్రాంతం అయిన విషయంలో ఒక్క ఐ.ఎ.ఎస్ ను అయినా సస్పెండ్ చేశారా? కేవలం ఒక సబ్ రిజిస్ట్రార్ ను సస్పెండ్ చేశారు. తప్పు చేసిన అధికారులకు ఉన్నత పదవులు ఇచ్చారు. ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా ఫోర్జరీ చేస్తే ఆ విషయాలు ఎందుకు బయట పెట్టడం లేదు? 22ఏ ఉన్న భూములు ఎందుకు బయట పెట్టడం లేదు దీని పరిధిలో ఉన్న ఐదు లక్షల ఎకరాల భూములను ఏ రకంగా తీసివేశారు?"అని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు.

### 22ఏపై ప్రతిపక్షం అబద్ధాలు ప్రచారం చేసింది

#### ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, ఆది శ్రీనివాస్

**హైదరాబాద్ ,సెప్టెంబరు 16,ప్రభాతవార్త:** 22 మీద ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ అబద్ధాలు ప్రచారం చేసిందని ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, ఆది శ్రీనివాస్‌లు అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు సెంబ్లీకి రాకుండా ఉండడానికి కారణాలు వెతుక్కున్నారన్నారు. అలాగే .స్పీకర్, పోలీసులను అవమానించారని మాక్ అసెంబ్లీ పెట్టి 22ఏ మీద మాట్లాడలేదన్నారు. అలాగే కేసీఆర్ కూడా మాక్ అసెంబ్లీ కూడా పోలేదని ఎందుకంటే ఆ మాక్ అసెంబ్లీలో కూడా స్పీకర్ దళితుడే కాబట్టి అని అన్నారు. జబర్దస్త్ షో లాగా మాక్ అసెంబ్లీ పెట్టుకున్నారని మండిపడ్డారు. 18 లక్షల ఎకరాల భూముల సమస్య పరిష్కరించకుండా జటిలం చేసింది మీరు కదా? ఎల్.బి. నగర్‌లో వాసవికి అపార్ట్ మెంట్ కట్టుకోవడానికి ప్రభుత్వ భూమిలో ఎలా అనుమతి ఇచ్చారు? లయోలా కాలేజ్ భూములు 350 భూమి 22ఏ నుండి ఎలా తొలగించారు? కాచిగూడాలో వారసులు లేని భూములు కాజేసి ప్రతిమ ఆసుపత్రి కట్టింది నిజం కాదా? ఇవన్నీ కొన్ని ఉదాహరణలు మాత్రమే.. ధరణితో మీరు చేసిన అవకతవకలు అనేకం ఉన్నాయి. రాజకీయ లబ్ధి కోసం భూ భారతిపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. సమగ్రమైన రెవెన్యూ చట్టం తీసుకుని రావడానికి మేము భూ భారతితో కృషి చేస్తున్నాం అని పేర్కొన్నారు.

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో పొత్తు ఉండదు

### దామాషా ప్రకారం జరిగితే డీలిమిటేషన్‌కు మద్దతు ఇవ్వడానికి అభ్యంతరం లేదు

### జిందాల్ గ్లోబల్ వర్సిటీ సదస్సులో ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చిన కెటిఆర్

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం హర్యానాలోని సోనిపేట్ ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఎ స్టార్టప్ స్టేట్ అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రాజకీయాలు, పాలన, సాంకేతికత తదితర అంశాలపై వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశం ఉందా అని విద్యార్థి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పందించారు. బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదు అని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ అంశంపై మాట్లాడుతూ లోక్‌సభ స్థానాల సంఖ్యను దేశవ్యాప్తంగా దామాషా ప్రకారం పెంచితే, డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో బీఆర్ఎస్‌కు ఎలాంటి అభ్యంతరం ఉండదని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ప్రాతినిధ్యం ఉంది. మొత్తం లోక్‌సభ స్థానాలను దామాషా ప్రకారం పెంచితే.. డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో మాకు ఎలాంటి సమస్య ఉండదు అని ఆయన పేర్కొన్నారు.

కృత్రిమ మేధస్సు (ఏఐ), సాంకేతిక మార్పులపై ప్రశ్నకు సమాధా నమిస్తూ.. ప్రతి పెద్ద సాంకేతిక పరివర్తన సమయంలోనూ ఆందోళనలు వ్యక్తమయ్యాయని కేటీఆర్ అన్నారు. ప్రతి సాంకేతిక మార్పును ప్రశ్నించారు.. ఏఐ విషయంలోనూ అదే జరుగుతోంది. మనం దాన్ని స్వీకరించి ముందుకు సాగాలి అని ఆయన అన్నారు. తన ప్రసంగంలో తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని కేటీఆర్ వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి ప్రస్తావిస్తూ.. కరవు ప్రభావిత తెలంగాణ ప్రాంతాలకు గోదావరి జలాలను ఎలా తరలించాలనే చారిత్రక సవాలుకు ఇంజినీరింగ్ పరిష్కారం ఈ ప్రాజెక్టు అని ఆయన అభివర్ణించారు. తెలంగాణలో వరి ధాన్యం ఉత్పత్తి 2014-15లో సుమారు 44.4 లక్షల టన్నులు ఉంటే, 2023-24లో అది 168.8 లక్షల టన్నులకు పెరిగిందని కేటీఆర్ తెలిపారు. పరిమితులను సమస్యలుగా చూడకుండా.. నిరంతరం నేర్చుకోవడం, మెరుగుపడటం, వాటిని అమలు చేయడంపై దృష్టి పెట్టాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం జరిగిన ముఖాముఖిలో రాజకీయాలు, ప్రజా విధానాలు, డీలిమిటేషన్, కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులు పలు ప్రశ్నలు అడిగారు. తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరించే అవకాశం కల్పించినందుకు ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి, విద్యార్థులు మరియు అధ్యాపకులతో ముచ్చటించే అవకాశం కల్పించినందుకు వర్సిటీ యాజమాన్యానికి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ సీ.రాజ్ కుమార్‌కు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

## అసెంబ్లీ వేదికగా సిఎం అబద్ధాలు: కవిత

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. తన కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు సీఎం చెప్పారని, ఎన్నికలఅఫిడవిట్‌లో పేర్కొన్న భూమికంటే ఎక్కువుంటే ప్రభుత్వానికే ఇస్తానని కవిత ప్రకటించారు. సీఎం చదివిన భూముల చిట్టాపై నిజాలు నిగ్గు తేలాలని, ఇందుకోసం సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు.

# కొందరిని చరిత్ర ఎప్పుడూ క్షమించదు

### ప్రతిపక్షం తీరుపై సిఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** కొంతమందిని చరిత్ర ఎప్పుడూ క్షమించదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం శాసనసభలో మాట్లాడుతూ.. గతంలో జరిగిన తప్పులపై సభలో చర్చ జరుగుతుందనే ప్రధాన ప్రతిపక్షం కుట్ర చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన అంశాలు చర్చకు రావొద్దని, ఫీజు రీయింబర్స్‌మెంట్, కరవు, కొంతమంది చేసిన క్షుద్ర పూజలు చర్చకు వస్తాయనే.. సభ మొదటి రోజే కుట్ర పూరితంగా వ్యవహరించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతి ఆడబిడ్డ సమానమే అని స్పష్టం చేశారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడాలనేదే ప్రభుత్వ సంకల్పమన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సభాపతిని గౌరవించడం సభ్యుల సంప్రదాయమని సీఎం అన్నారు. సభలో ప్రతి సభ్యుడి హక్కులను కాపాడేది సభాపతి అని తెలిపారు. గత ప్రభుత్వమే సభ నిర్వహణపై కొన్ని నిబంధనలు రూపొందించిందని ఆ నిబంధనల మేరకే సభాపతి ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు. స్పీకర్ ఇచ్చిన ఆదేశాలను గేట్3 వద్ద పోలీసులు అమలు చేశారని వివరించారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ నల్ల టీషర్టు వేసుకుని వెళ్లారని ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్నారని నినాదాలతో కూడిన టీషర్టులతో లోపలకి రాకూడదని స్పీకర్ ఆదేశాలిస్తే వారు పాటించేవారని తెలిపారు.

లోక్‌సభ స్పీకర్ పార్లమెంట్‌లో అలాంటి నిబంధనలు విధించలేదని ముఖ్యమంత్రి తెలిపారు. కానీ తెలంగాణ శాసనసభలో ఎలాంటి నిబంధనలు ఉండాలో గత ప్రభుత్వమే రూపొందించిందని చెప్పుకొచ్చారు. పోలీసులను దూషించి, అర్ధనగ్న ప్రదర్శన చేసి, సభాపతిని కూడా దూషించారని మండిపడ్డారు. దీనిపై స్పీకర్‌కు క్షమాపణ చెప్పి సమస్యలపై చర్చ చేస్తారని భావించే ప్రతిపక్ష నేతలను సభలోకి అనుమతించారన్నారు. కానీ విచక్షణ కోల్పోయి వ్యవహరించడం వల్లే బీఆర్ఎస్‌ను స్పీకర్ సస్పెండ్ చేశారని తెలిపారు. వారు సభకు రాలేదని ప్రజా సమస్యలపై చర్చించే బాధ్యతను విస్మరించలేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# రేవంత్‌రెడ్డి కుటుంబానికి 308 ఎకరాల భూమి

### నీ ఆస్తులు, మా ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో ఎంక్వయిరీకి సిద్ధం

### అసెంబ్లీలో మాట్లాడినవన్నీ పచ్చి అబద్ధాలు: హరీశ్‌రావు

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** అసెంబ్లీలో 22ఏ భూములు, కేసీఆర్ కుటుంబ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. బుధవారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల ఆస్తి ఉన్న కుటుంబంలో పుట్టారని, ప్రజల భూములు దోచుకోవాల్సిన అవసరం ఆయనకు లేదని స్పష్టం చేశారు. గతంలో కేసీఆర్ ఫామ్‌హౌస్ వెయ్యి ఎకరాలు అని ప్రచారం చేసిన రేవంత్, ఇప్పుడు 60 ఎకరాలు అని మాట్లాడటం ఆయన అబద్ధాలకు నిదర్శనమని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ ఉందని, కేసీఆర్‌కు హైదరాబాద్‌లో సొంత ఇల్లు కూడా లేదని హరీశ్ రావు విమర్శించారు. "మేం అసెంబ్లీ నుంచి పోలేదు పథకం ప్రకారం నువ్వే పంపించావు" అని మండిపడ్డారు. ఒక సెషన్ కాదు.. మొత్తం సెషన్ తమను సస్పెండ్ చేశారని, బిజెపి కూడా సస్పెన్షన్ ఎత్తివేయమని అడిగింది కదా.. బిఆర్ఎస్ సభ్యులు ఉండాలనుకుంటే సస్పెన్షన్ ఎందుకు ఎత్తివేయలేదని ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యల్ని ప్రశ్నిస్తుంటే.. బురద రాజకీయాలు చేస్తున్నారని, ఎంతకాలం ఈ అబద్ధాలు చెబుతారని హరీష్ రావు ధ్వజమెత్తారు. ఈ మూడేళ్లలో మాపై ఎదురుదాడి చేశారు.. ఎంక్వైరీలు, కమిషన్లు వేశారు. 3 లక్షల ఎకరాల్లో సమస్య ఉంటే 30 లక్షల ఎకరాలకు పాకిందని నువ్వే చెప్పావు. ఇదంతా మీ ప్రభుత్వ తప్పిదం కాదా?. జిల్లా కలెక్టర్లు చూసుకోకుండా దబాదబా సంతకం పెట్టి అప్ లోడ్ చేశారని చెబుతున్నావు. దబాదబా సంతకాలు చేసిన కలెక్టర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదు. ఉద్రిక్త పరిస్థితికి కారకులు మీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి విషయంలో కావొచ్చు. లేదు కాంగ్రెస్ వచ్చిన డిసెంబర్ 7, 2023 నుంచి (బుధవారం)ఈ రోజు వరకు భూభారతి వరకు నీ హయాంలో ఏం అవకతవకలు జరిగినయో.. మా హయాంలో ఏం జరిగినయో మొత్తం మేం విచారణకు సిద్ధం. సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా..? హైకోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దామా.. నువ్వు ముందుకు రా..నీ కింద పనిచేసే అధికారులు కాదు.. నీది లేదు.. నాది లేదు.. సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దాం.

బీఆర్ఎస్ హయాంలో జరిగింది కానీ.. ఈ మూడేళ్ల రేవంత్ రెడ్డి పాలనలో జరిగినఅవకతవకల మీద, ధరణిలో, భూభారతిలో రేవంత్ రెడ్డి హయాంలో జరిగిన వాటి మీద మీ ఆస్తుల గురించి మా ఆస్తుల గురించి కూడా మాట్లాడుదామన్నారు. మా ఆస్తులు, రేవంత్ రెడ్డి ఆస్తులు నీ తమ్ముళ్ల ఆస్తులు ఎట్ల పెరిగినయ్..అన్నింటి మీద సిట్టింగ్ జడ్జితో మేం ఎంక్వైరీకి సిద్ధం, నువ్వు రెడీనా..? అని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి కుటుంబానికి 308 ఎకరాల భూమి ఉందని గంటన్నరలో మాకు సమాచారం వచ్చింది. రేవంత్‌రెడ్డి భూమి పక్కనే ఓఆర్ఆర్ అలైన్‌మెంట్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు కూడా వచ్చాయని తెలిసింది. ఫ్యూచర్ సిటీ చుట్టూ, మిగతా చోట్ల ఉన్న భూముల వివరాలు అన్నీ సేకరిస్తున్నామని తెలిపారు.

## అసైన్డ్ భూములను హారీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** మాజీ మంత్రి హారీశ్‌రావు అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా తప్పేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రి పొంగులేటి చిట్‌చాట్ చేశారు. హారీశ్‌రావు తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్ఓసీ ఇచ్చిందని చేసిన వ్యాఖ్యలపై కూడా మంత్రి స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం మంత్రిగా పని చేసిన హారీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, అది కూడా తప్పేనని మంత్రి అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ కూడా నిషేధిత జాబితాలో ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పుకాదా? ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలకు తగ్గించినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెట్టబోతున్నట్టు మంత్రి తెలిపారు. అలాగే 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

# ఉక్కుమనిషి సంకల్పమే లేకుంటే నేడు భారత్‌లో తెలంగాణ ఉండేదా?

## నిజాం నవాబు మెడలు వంచి సరెండర్ చేయించిన ఘనత సర్దార్ పటేల్‌దే!

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** భగత్ సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి పేర్లు వింటే యువతరం నరనరాల్లో దేశభక్తి ఉప్పొంగుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. అదే స్థాయిలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ త్యాగాన్ని, ధైర్యాన్ని కూడా భావితరాలు స్మరించుకోవాలన్నారు. నాడు పటేల్ చూపిన తెగువే లేకపోతే నేడు తెలంగాణ భారత యూనియన్‌లో ఉండేది కాదని రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల సందర్భంగా సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన చారిత్రక ఫొటో ఎగ్జిబిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులతో కలిసి ప్రదర్శనను వీక్షించిన ఆయన, నిజాం నిరంకుశ పాలనపై సాగిన వీరోచిత పోరాట ఘట్టాలను స్వయంగా పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. దేశమంతటికీ 1947 ఆగస్టు 15న స్వాతంత్రం వస్తే, హైదరాబాద్ సంస్థానానికి మాత్రం దాదాపు పదమూడు నెలల తర్వాత 1948 సెప్టెంబరు 17న స్వేచ్ఛ లభించిందని గుర్తుచేశారు. భారతదేశంలో కలవబోనంటూ మొండికేసిన నిజాం నవాబు దురహంకారాన్ని సర్దార్ పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలోతో తుత్తునియలు చేసి, నిజాంను పటేల్ ముందు మోకరిల్లేలా చేశారని అన్నారు. ఆ చారిత్రక లొంగుబాటు దృశ్యాలను ఈ ఎగ్జిబిషన్ కళ్లకు కడుతోందని పేర్కొన్నారు. నిజాం అణచివేతకు వ్యతిరేకంగా కొమురం భీం, రాంజీ గోండు, వందేమాతరం రామచంద్రరావు, మాజీ ప్రధాని పివి నరసింహారావు వంటి ఎందరో యోధులు పోరాటం కొనసాగించారని కొనియాడారు. నాడు పోరాట యోధులను కదనరంగంలో నడిపించిన మహత్తర మంత్రం వందేమాతరం అని, ఆ గీతాన్ని నేటి బాలలంతా సంపూర్ణంగా నేర్చుకుని, గర్వంగా ఆలపించాలని పిలుపునిచ్చారు. మన భవిష్యత్తు చరిత్ర పునాదులపైనే నిలబడుతుందని, అందుకే తెలంగాణలో ఆగస్టు 15, సెప్టెంబరు 17 తేదీల్లో రెండుసార్లు గర్వంగా మువ్వన్నెల జెండాను ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పిస్తున్నామని తెలిపారు. అలాగే, సెప్టెంబరు 17న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలంతా తమ ఇళ్ల ముందు దీపాలు వెలిగించాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, దేశాన్ని వికసిత్ భారత్ వైపు నడిపించే సంకల్పానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని ఆకాంక్షించారు.

## స్వాతంత్ర్య పోరట చరిత్రలో హైదరాబాద్ విముక్తి కోసం జరిగిన పోరాటం కీలకం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** నిజాం పాలన నుంచి హైదరాబాద్ సంస్థాన విముక్తి కోసం జరిగిన పోరాటం భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలోనే అత్యంత కీలకమైన ఘట్టమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశానికి ఆగస్టు 15న స్వాతంత్రం వచ్చినప్పటికీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలో (ప్రత్యక్ష పోలీసు చర్య) ద్వారా సంస్థాన ప్రజలకు మరో 13 నెలల తర్వాత విముక్తి లభించిందన్నారు. ఈ చారిత్రక దినోత్సవానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17వతేదిన తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని మార్చి 12, 2024న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇందులో భాగంగా, సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో 79వ హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిం చనున్నారు. ఈ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా హాజరుకానున్నారని తెలిపారు.

## కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యురాలిగా సుప్రియ

**హైదరాబాద్,సెప్టెంబరు16,ప్రభాతవార్త:** టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, అన్నపూర్ణ స్టూడియోస్ ప్రతినిధి సుప్రియ యార్లగడ్డకు కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. కేంద్ర సెన్సార్ బోర్డు (సీబీఎఫ్‌సీ) సభ్యురాలిగా ఆమె నియమితులయ్యారు. కేంద్ర ప్రభుత్వం సెన్సార్ బోర్డును పునర్వ్యవస్థీకరిస్తూ 18 మంది సభ్యులతో కూడిన నూతన జాబితాను విడుదల చేయగా, తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి సుప్రియకు చోటు దక్కింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 16న అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది.

కొత్తగా నియమితులైన వారిలో సుప్రియతో పాటు బాలీవుడ్ నటులు ప్రీతి జింటా, సునీల్ శెట్టి, పంకజ్ త్రిపాఠి, ప్రముఖ దర్శకుడు ప్రియ దర్శన్, బెంగాలీ నటుడు ప్రసేన్‌జిత్ ఛటర్జీ, వినోద్ అనుపమ్, మనోజ్ జోషి, అభిషేక్ జైన్, రిక్కీ కేజ్, హన్సరాజ్ హన్స్, యతీంద్ర మిశ్రా, రూపాలీ గంగూలీ, నీల మదబ్ పాండా, పల్లవి జోషి, నిషిగంధ వాద్, వామన్ కేంద్రే, రమేశ్ పతంగె వంటి సినీ ప్రముఖులు ఉన్నారు.

# రైతులకే రాయితీ నిధులు

**- తొలుత పూర్తి మొత్తం సొమ్ము చెల్లించాల్సిందే - తర్వాతే బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ**

**- 36 రకాల యంత్ర పరికరాల సరఫరా - వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో మార్పులు**

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త :** తెలంగాణవ్యాప్తంగా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈసారి పథకం అమలు విధానంలో కీలక మార్పు చేసింది. రైతులు ముందుగా యంత్ర పరికరాల పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేసిన తర్వాత రాయితీ మొత్తాన్ని వారి ఖాతాల్లో పొందే విధానాన్ని అమలు చేయనున్నారు. అలాగే 36 రకాల యంత్ర పరికరాలను రాయితీపై ఇవ్వనున్నారు. అయితే ముందస్తు చెల్లింపు సన్న, చిన్నకారు రైతులకు భారంగా మారవచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు రైతులు రాయితీ పోగా మిగిలిన మొత్తాన్ని డీడీ రూపంలో చెల్లిస్తే ప్రభుత్వం తన వాటా రాయితీని సంబంధిత కంపెనీలకు చెల్లించి యంత్ర పరికరాలను అందించేది. ఇక నుంచి మాత్రం రైతులు ముందుగా పథకం కింద మంజూరైన యంత్ర పరికరాల పూర్తి ధరను చెల్లించి ప్రభుత్వం సూచించిన కంపెనీల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. ఈ మార్పు రాష్ట్రంలోని సన్న, చిన్నకారు రైతులకు ఆర్థికంగా సవాల్‌గా మారే అవకాశం ఉంది. ఖరీదైన ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, డ్రోన్లు, ఇతర వ్యవసాయ యంత్రాలను ముందుగా పూర్తి ధరకు కొనుగోలు చేయాలంటే పెద్ద మొత్తంలో నగదు అవసరం. అనంతరం రాయితీ వచ్చే వరకు ఆ మొత్తాన్ని సమకూర్చుకోవడం రైతులకు భారంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున వ్యవసాయ యంత్ర పరికరాలను రాయితీపై అందించేవారు. అయితే 2025–26లో పథకం అమలు ఆశించిన స్థాయిలో జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 13,140 యూనిట్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కేవలం 1,680 యూనిట్లు మాత్రమే రైతులకు అందాయి. యంత్ర పరికరాల నిమిత్తం రైతులకు రూ.10.43 కోట్లు కేటాయించగా రూ.8.38 కోట్ల రాయితీని మాత్రమే విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం వరకు రాయితీ ఉండేది. రూ.లక్షలోపు విలువైన పరికరాలను మండల స్థాయి కమిటీ, అంతకంటే ఎక్కువ ధర ఉన్న వాటిని జిల్లా స్థాయి కమిటీ ఎంపిక చేయాల్సి ఉండేది. అయితే వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పటికీ లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియలో జాప్యం జరగడంతో చాలా మంది రైతులకు పథకం ప్రయోజనం అందలేదు. మరోపక్క రాయితీపై ప్రభుత్వం అందించే కొన్ని యంత్ర పరికరాల ధరలకు, బయట మార్కెట్ ధరలకు మధ్య వ్యత్యాసం తక్కువగా ఉండటమూ రైతుల అనాసక్తికి కారణమైంది. దరఖాస్తు నుంచి మంజూరు వరకు జరిగే ప్రక్రియలో జాప్యం కూడా పథకంపై ఆసక్తిని తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పిచికారీ యంత్రాలు, డ్రోన్లు, గడ్డి కట్టలు కట్టే యంత్రాలు, భూమిని చదును చేసే పరికరాలు తదితర 36 రకాల వ్యవసాయ యంత్ర పరికరాలను రాయితీపై అందించనున్నారు. తెలంగాణలో సన్న, చిన్నకారు రైతుల సంఖ్య గణనీయంగా ఉండటంతో ముందుగా పూర్తి ధర చెల్లించే విధానం వారికి ఇబ్బందికరంగా మారవచ్చని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. కనీసం రూ.50 కోట్ల వరకు నిధులు పెంచి, మరిన్ని యూనిట్లు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి. వానాకాలం సాగుకు సమయం దాటిపోతున్న నేపథ్యంలో ఈసారి మంజూరైన యంత్ర పరికరాలను త్వరగా అందించాలని రైతులు కోరుతున్నారు. కనీసం యాసంగి సాగు ప్రారంభమయ్యేలోపైనా పరికరాలు అందుబాటులోకి వస్తే రైతులకు కొంత ప్రయోజనం చేకూరుతుందని చెబుతున్నారు.

# సౌదీ గడ్డపై హౌతీల క్షిపణి దాడులు

**- యన్బులో ఆరామ్‌కో కేంద్రమే లక్ష్యం - మక్కా సమీపంలో డ్రోన్‌ను కూల్చివేసిన సౌదీ వైమానిక రక్షణ దళాలు**

**రియాద్, సెప్టెంబరు 16:** యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియా భూభాగంలోకి యుద్ధాన్ని విస్తరించినట్లు ప్రకటించారు. ఎర్ర సముద్ర తీరంలోని సౌదీ అరామ్‌కోకు చెందిన కీలక చమురు కేంద్రం యన్బుతో పాటు దక్షిణ ప్రాంతంలోని ప్రముఖ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు హౌతీ సైనిక ప్రతినిధి యహ్యా సారీ బుధవారం సాయంత్రం వెల్లడించారు. యన్బులోని సౌదీ అరామ్‌కో కేంద్రంపై డజన్ల కొద్దీ బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు సరీ తెలిపారు. ఈ దాడి కారణంగా భారీగా మంటలు చెలరేగడంతో పాటు విస్తృతంగా నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన నిర్దిష్ట ఆధారాలను హౌతీలు విడుదల చేయలేదు. మరో ఆపరేషన్‌లో భాగంగా ఖమీస్ ముషైత్ వైమానిక స్థావరంపై పలు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. అయితే సౌదీ ప్రభుత్వం, అరామ్‌కో సంస్థలు ఇప్పటివరకు ఎలాంటి నష్టాన్ని అధికారికంగా ధృవీకరించలేదు. హౌతీల ప్రకటనలకు స్వతంత్రంగా కూడా ఎలాంటి నిర్ధారణ లభించలేదు. యన్బు సౌదీ అరేబియాకు అత్యంత కీలకమైన చమురు కేంద్రం. యుద్ధ పరిస్థితుల్లో హార్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో, సౌదీ అరేబియా తన ముడి చమురులో అధిక భాగాన్ని ఎర్ర సముద్రంలోని యన్బు పోర్టు ద్వారా తరలిస్తోంది. సుమారు 1,200 కిలోమీటర్ల పొడవైన ఈస్ట్‌వెస్ట్ "పెట్రోలైన్" పైప్‌లైన్ తూర్పు ప్రావిన్స్ నుంచి ముడి చమురును యన్బుకు చేరుస్తుంది. ఈ నేపథ్యంలో యన్బుపై దాడి జరిగితే సౌదీ చమురు ఎగుమతుల ప్రత్యామ్నాయ మార్గంపై ప్రభావం పడే అవకాశం ఉంది. అరామ్‌కో 2025 వార్షిక నివేదిక ప్రకారం యన్బు రిఫైనరీ రోజుకు సుమారు 2.5 లక్షల బ్యారెళ్ల ముడి చమురును శుద్ధి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అదనంగా యన్బు అరామ్‌కో సినోపెక్ రిఫైనింగ్ కంపెనీ రోజుకు సుమారు 4 లక్షల బ్యారెళ్ల శుద్ధి సామర్థ్యాన్ని కలిగి ఉంది. అందువల్ల యన్బు ప్రాంతంలోని చమురు మౌలిక సదుపాయాలు వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యం కలిగినవిగా పరిగణిస్తున్నారు. అయితే యన్బులోని అరామ్‌కో కేంద్రంపై దాడి, నష్టం జరిగినట్లు సౌదీ అధికారులు ధృవీకరించలేదు. స్వతంత్రంగా కూడా ఎలాంటి ఆధారాలు అందుబాటులో లేవు. అంతేకాకుండా, ఆరోపించిన దాడి ఏ తేదీన జరిగిందో కూడా హౌతీలు స్పష్టంగా వెల్లడించలేదు. దాడి వల్ల జరిగిన నష్టం భవిష్యత్తులో ధృవీకరించబడితే, యన్బు చుట్టూ ఇప్పటికే ఉన్న చమురు సరఫరా అంతరాయాలు మరింత పెరిగే అవకాశం ఉంది. మక్కా సమీపంలో డ్రోన్ కలకలంబుధవారం తెల్లవారుజామున మక్కా సమీపంలో చోటుచేసుకున్న మరో ఘటనతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. సౌదీ రక్షణ శాఖ ప్రతినిధి అల్‌మాలికీ ప్రకారం.. రాయల్ సౌదీ ఎయిర్ డిఫెన్స్ ఫోర్సెస్ ఓ అనుమానాస్పద డ్రోన్‌ను అడ్డుకుని ధ్వంసం చేశాయి. అది మక్కాకు దక్షిణంగా ఉన్న నిషేధిత గగనతలంలోకి ప్రవేశించేలోపే కూల్చివేసినట్లు ఆయన తెలిపారు. 2017 తర్వాత తొలిసారిగా మక్కా పవిత్ర నగరంలో సౌదీ అరేబియా భద్రతా హెచ్చరికను జారీ చేసింది. జెడ్డా, తాయిఫ్ నగరాల్లోనూ ఇదే తరహా భద్రతా హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, కొద్ది నిమిషాల్లోనే వాటిని ఉపసంహరించుకున్నారు. మక్కాలోని రెండు పవిత్ర మసీదులు, అక్కడికి వచ్చే యాత్రికుల భద్రత తమకు "రెడ్ లైన్" వంటిదని అల్‌మాలికీ పేర్కొన్నారు. అయితే హౌతీలు ఈ ఆరోపణలను పూర్తిగా ఖండించారు. యెమెన్ నుంచి పవిత్ర స్థలాలకు ఎలాంటి ముప్పు లేదని యహ్యా సరీ పేర్కొన్నారు. సౌదీ ప్రభుత్వం చేసిన ప్రకటన తప్పుడు సమాచారమని హౌతీ వర్గాలు తమ అధికారిక వార్తా సంస్థ ద్వారా వెల్లడించాయి. ఖమీస్ ముషైత్‌లోని సౌదీ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు హౌతీలు మరో ప్రకటనలో తెలిపారు.



# బండ్లగూడ హత్య కేసులో 8 మంది అరెస్టు

**- పరారీలో నలుగురు - వ్యక్తిగత కక్షతోనే హత్య చేశారన్న పోలీసులు**



హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న సిపి సుమతి

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :** వ్యక్తిగత కక్షల కారణంగానే హత్య జరిగిందని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి వెల్లడించారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్ చౌరస్తా వద్ద సుప్రీం వైన్స్ లో 14వ తేదీ రాత్రి జరిగిన రౌడీషీటర్ నయీమ్ హత్య తీసుకు సంబంధించి బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపి సుమతి హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నయీమ్ హత్య కేసులో పాండిచ్చేరి రాష్ట్రంలోని యానాం ప్రాంతానికి చెందిన సయ్యద్ రబ్బానీ(21), ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన ఒట్ల దినకర్(35) పాత నేరస్తుడు, హైదరాబాద్ లోని చాంద్రాయణగుట్ట ఉప్పుగూడకు చెందిన ఒలిపోల్ల మహేశ్(23), హైదరాబాద్ ఛత్రినాక శివగంగనగర్ కు చెందిన పాత నేరస్తుడు రాసుమల్ల సాకేత్(26), హైదరాబాద్ తార్నాకకు చెందిన పాత నేరస్తుడు అలకుంట వెంకట్(22), చాంద్రాయణగుట్ట ఉప్పుగూడకు చెందిన కొడిగంటి రాఘవేందర్ అలియాస్ రఘు(27), ఛత్రినాకకు చెందిన వల్లపుదాసు చరణ్‌గౌడ్(18), మహ్మద్ బద్రుల్లా హుస్సేన్(44), ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన తొడేటి వెంకటేశ్ ను అరెస్టు ఈ కేసులో అరెస్టు చేశామని తెలిపారు. కీలక నిందితుడు ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన రౌడీషీటర్ కనకం ఉమామహేశ్(32), మహ్మద్ ఇస్మాయిల్ జాబీ, భోలే, కార్తీక్ నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి వేట కొడవలి, ఇనుపరాడ్, టయోటా వాహనం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నయీమ్, కనకం ఉమా మహేశ్, సయ్యద్ రబ్బానీ, ఒట్ల దినకర్ చిన్ననాటి స్నేహితులు. కొంతకాలంగా వీరి మధ్యన విభేదాలు ఏర్పడడంతో నయీమ్ తమను నిత్యం బెదిరిస్తూ దూషించేవాడని నిందితులు చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నయీమ్‌ను హతమార్చేందుకు కుట్ర పన్నినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సయ్యద్ రబ్బానీ తనకు జైలులో పరిచయమైన రసుమల్ల సాకేత్‌ను సంప్రదించగా అతడి ద్వారా మరికొందరితో హత్య చేయడానికి ప్రణాళిక రూపొందించారు. హత్యకు సంబంధించి ఖమ్మంలో మంతనాలు జరిపి
అక్కడ దినకర్, బద్రుల్లా అలియాస్ బద్రీ, ఉమామహేశ్ లను కలిశారు. ఓ హోటల్‌లో బస చేసి హత్య చేయడానికి ప్రణాళిక రూపొందించుకున్నారు. హైదరాబాద్‌కు చేరుకున్న నిందితులు నయీమ్ కదలికలపై సమాచారం సేకరించి బండ్లగూడలోని సుప్రీమ్ వైన్స్ వద్ద 14వ తేదీ రాత్రి అతడిపై దాడి చేసి కత్తులతో హత్య చేశారు. నయీమ్‌పై గతంలోనూ పలు క్రిమినల్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఇల్లందు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న అతడిపై ఇల్లందు, హయత్‌నగర్, వనస్థలిపురం, ఉప్పల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదైనట్లు వెల్లడించారు. నయీమ్ ను హత్య చేసిన నిందితులను ఇరవై నాలుగు గంటల్లోనే మల్కాజిగిరి పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి అరెస్టు చేశారని తెలిపారు. ఎల్బీనగర్ డీసీపీ బి.అనురాధ మార్గదర్శకత్వంలో ఏసీపీ ప్రత్యక్ష పర్యవేక్షణతో ఎస్వోటీ, నాగోల్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ సమావేశంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# విమానంలో నగ్నంగా మహిళ హల్‌చల్

**వాషింగ్టన్, సెప్టెంబరు 16:** అమెరికన్ ఎయిర్ లైన్స్ విమానంలో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. బాల్టిమోర్ నుంచి మియామీకి వెళ్తున్న విమానంలో ఓ మహిళ అకస్మాత్తుగా దుస్తులన్నీ విప్పేసి నగ్నంగా తిరిగింది. విమానంలో అటు ఇటు తిరుగుతూ కేకలు వేసింది. దీంతో సహచర ప్రయాణికులంతా బెంబేలెత్తిపోయారు. అంతటితో ఆగకుండా తోటి ప్రయాణికుల ఎదుట అసభ్యంగా ప్రవర్తించడంతో విమాన సిబ్బంది అప్రమత్త మయ్యారు. చివరకు విమానం మియామీ చేరుకున్న వెంటనే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఫ్లైట్ యుఎస్1779లో ఈనెల 11న ఈ ఘటన జరిగినట్లు నివేదికలు వెల్లడించాయి. బాల్టిమోర్ /వాషింగ్టన్ ఇంటర్నేషనల్ థర్గుడ్ మార్షల్ ఎయిర్‌పోర్ట్ నుంచి విమానం రాత్రి 9 గంటల తర్వాత బయలుదేరింది. షెడ్యూల్ ప్రకారం బయలుదేరాల్సిన సమయం కంటే దాదాపు రెండు గంటలు ఆలస్యంగా విమానం టేకాఫ్ అయింది. విమానం గాల్లో ఉండగా 9డి సీటులో కూర్చున్న మహిళ తన దుస్తులన్నింటినీ తొలగించినట్లు ఇతర ప్రయాణికులు గుర్తించారు. అనంతరం ఆమె తోటి ప్రయాణికుల సమక్షంలో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విమాన సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని లీడ్ ఫ్లైట్ అటెండెంట్ వెంటనే కాక్‌పిట్ సిబ్బందికి తెలియజేశారు. అనంతరం విమాన సిబ్బంది, ఎయిర్‌లైన్ ఆపరేషన్స్ సెంటర్ మధ్య సమాచారం మార్పిడి జరిగింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విమానం మియామీ చేరుకున్న వెంటనే పోలీసులను సిద్ధంగా ఉంచాలని సిబ్బంది కోరారు. అయితే ఈ ఘటన కారణంగా విమానాన్ని దారి మళ్లించలేదు. విమానం తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఫ్లోరిడాలోని మియామీ వైపు వెళ్లింది.



# బిజినెస్‌మాన్ మామ హత్యకేసులో కొత్తకోణం!

**కాన్పూరు, సెప్టెంబరు 16:** కాన్పూర్‌కు చెందిన ఫార్మా వ్యాపారి వినీత్ మనోచా హత్య కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న షూటర్ హతుడు వినీత్ కుమారుడు సుబ్రత్‌కు ఆరుసార్లు ఫోన్ చేసినట్లు వెల్లడైంది. దాంతో హత్యలో అతడి పాత్రపై కూడా పోలీసులు దృష్టి సారించారు. ఈ హత్య వెనుక లోతైన కుట్ర కోణం ఉండవచ్చని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. సెప్టెంబర్ 5న మనోచా హత్య జరగగా అంతకు రెండు రోజుల ముందే నిందితుడు విశాల్ గౌతమ్ కొత్త సిమ్ కార్డును కొనుగోలు చేశాడు. ఆ కొత్త నెంబర్ నుంచే సుబ్రత్‌కు ఆరుసార్లు కాల్స్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇదే నెంబర్‌తో మనోచా కోడలు షాలుతో కూడా నిందితుడు మాట్లాడినట్లు తేలింది. హత్య కోసమే ప్రత్యేకంగా సేకరించిన సిమ్ నుంచి సుబ్రత్‌కు ఎందుకు కాల్స్ వెళ్లాయనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ రఘుబీర్ లాల్ వెల్లడించారు. మే 1 నుంచి సెప్టెంబర్ 6 మధ్య కాలంలో సుబ్రత్, షాలు, విశాల్‌కు చెందిన ఏడు మొబైల్ నెంబర్ల కాల్ డేటాను పోలీసులు విశ్లేషిస్తున్నారు. మే 1 నుంచి సెప్టెంబర్ 5 మధ్య సుబ్రత్, విశాల్ ఏకంగా 309 సార్లు మాట్లాడుకున్నట్లు కాల్ రికార్డుల ద్వారా స్పష్టమవుతోంది. ఈ కేసులో ఇప్పటికే మనోచా కోడలు షాలు, షూటర్ విశాల్ గౌతమ్, అతని స్నేహితుడు రాజ్ కిశోర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. షాలు సూచన మేరకే తాను ఈ హత్యకు పాల్పడ్డానని, ఇందుకు ప్రతిఫలంగా తనకు రూ.6 లక్షల నగదుతోపాటు ఉద్యోగం ఇస్తానని ఆమె హామీ ఇచ్చినట్లు విశాల్ వాంగ్మూలం ఇచ్చాడు. ప్రస్తుతం షాలు, విశాల్‌ను కస్టడీకి కోరిన పోలీసులు వారిని విచారించిన అనంతరం సుబ్రత్‌ను కూడా ప్రశ్నించాలని యోచిస్తున్నారు. ఆస్తి పత్రాలు, 2022లో రాసిన వీలునామాతోపాటు సుబ్రత్ అప్పుల్లో ఉన్నాడన్న సమాచారాన్ని కూడా పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

# కుటుంబ కలహాలతో.. భార్యా భర్తలు బలవన్మరణం..

**- ఓ అమ్మా నాన్నా! మమ్మల్నెందుకు అనాథలను చేశారు?**

**- కొణిజర్ల మండలంలో విషాదం - అనాథలైన ఇద్దరు చిన్నారులు**



అనాథలైన చిన్నారులు

**కొణిజర్ల సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** ఓ భార్యాభర్తలు.. కుటుంబ కలహాలతో క్షణికావేశంలో తీసుకున్న ఓ అనాలోచిత నిర్ణయం.. వారిని బలవన్మరణం వైపు నడిపించి ప్రాణాలు బలితీసుకుంది. ఆ తల్లిదండ్రులు కన్న కలలకు తోడు కన్న బిడ్డల్ని సైతం అనాథలను చేసి అనంత లోకాలకెళ్ళినారు.. విషాద ఘటన కొనిజర్ల మండలం, అనంతారం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొనిజర్ల మండల పరిధిలో అనంతారం గ్రామానికి చెందిన తేజావత్ హరిప్రసాద్ (32) వృత్తి ఆటో డ్రైవర్, అన్నవరం గ్రామానికి చెందిన సునీత (28)తో సుమారు 15 ఏళ్ళ క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కాగా వారిలో మనోహర్ 7వ తరగతి, భార్గవి 5వ తరగతి చదువుతున్నారు. బుధవారం ఉదయం హరి ప్రసాద్ (చిన్నోడు)ఆటో నడపటానికి ఖమ్మం వెళ్ళగా, అతని సునిత పిల్లలను స్కూల్ కు పంపింది. ఖమ్మం వెళ్ళిన గంట తరువాత హరి ప్రసాద్ తన సోదరుడుకి ఫోన్ చేసి.. అన్నా నన్ను క్షమించు నేను చనిపోతున్నానను , నా పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సమాచారం అందించాడు. దీంతో విషయం తెలుసుకున్న అతని భార్య సునిత ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కాగా హరి ప్రసాద్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానిక పోలీసులకు సమాచారం అందించగా సెల్ ఫోన్ సిగ్నల్ ఆటో నెంబర్ ఆధారంగా ఖమ్మం ఖానాపురం సమీపంలో గల సాగర్ కెనాల్ వంతెన వద్ద ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లగా ఆటో , చరవాణి, చెప్పులు మాత్రమే కనిపించాయి. దీంతో పోలీసులు కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనే అనుమానంతో ఎన్డిఆర్ఎఫ్ బృందాలతో సాగర్ కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. మరో వైపు స్థానిక ఎస్ఐ సూరజ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇట్టి ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

# ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో ఓమహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడకు చెందిన తెండెల రాణి (29) మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో తన ఇంట్లో చున్నితో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకోగా స్థానికులు గమనించి జోడిమెట్లలోని సూర్య ఆసపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రాణికి 12 సంవత్సరాల క్రితం శ్రీనివాస్ అనే వ్యక్తితో వివాహం కాగా భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఆమె గత సంవత్సర కాలంగా శివారెడ్డిగూడలో వేరుగా ఉంటుంది. ఆమె మానసిక, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతుండటంతో మందులు వాడుతున్నది. దీంతో ఆమె ఆహారం సరిగా తీసుకోకపోవడం ఆరోగ్యం క్షణించింది. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈమేరకు మృతురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ షేక్‌హీనా తెలిపారు.

## మిలటరీ ఆయుధాల చోరీ కేసులో నిందితుడు మల్లేష్‌కు అస్వస్థత ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స

**హైదరాబాద్, సెప్టెంబరు 16, ప్రభాతవార్త:** సంచలనం రేపిన బొల్లారంలోని మిలటరీ ఆయుధ గోదాములో ఆయుధాలు, మందు గుండు సామాగ్రి చోరీ కేసులో నిందితుడు మల్లేష్ అలియాస్ రాజు అస్వస్తతకు లోనవడంతో జైలు అధికారులు ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. దే శ వ్యాప్తంగా సంచలనం రేపిన మిలటరీ ఆయుధాలు, మందు గుండు సామాగ్రి చోరీ ఘటన గత నెల 30వ తేదీన జరగగా 31వ తేదీన దీని పై బొల్లారం పోలీసులకు ఫిర్యాదు అందింది. పది రోజుల తరువాత ఈ నెల 11వ తేదీన మల్లేష్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో పాటు అత ని వద్ద నుంచి చోరీకి గురైన ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 12వ తేదీన నిందితుడిని రిమాండుకు తరలించగా అప్పటి నుంచి అతను చంచల్‌గూడ జైల్లో వున్నాడు. తనను మిలటరీ నుంచి క్రమశిక్షణారాహిత్యం కింద బలవంతంగా పదవీ విర మణ చేయించినందుకు ఉన్నతాధికారులపై కక్షతో తాను ఈ నేరం చేసినట్లు మల్లేష్ చెప్పాడు. కాగా ఆయుధాలు, మందు గుండు సామాగ్రి చోరీ కేసులో మల్లేష్‌ను మరింత గా విచారించేందుకు పోలీసులు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు సికింద్రాబాద్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనిపై విచారణ జరుగుతోంది. మరోవైపు మల్లేష్ కొంతకాలంగా మూత్ర పిండాలు, కాలేయం వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ కారణంగానే అతను సోమవారం రాత్రి జైల్లో అస్వస్తతకు లోనవగా జైలు అధికారులు వెంటనే ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. అతని ఆరోగ్యం నిలకడగా వుందని చెబుతున్నా ఆసుపత్రి నుంచి అతను ఎప్పుడు డిశ్చార్జి అవుతాడనేది వైద్యులు వెల్లడించలేదు.

# యాచకుడిగా మారిన బిజెపి ఎమ్మెల్యే!



**ముంబయి, సెప్టెంబర్ 16:** మహారాష్ట్ర రాజకీయాల్లో అత్యంత సంపన్న ప్రజాప్రతినిధిగా పేరుపొందిన ఒక ఎమ్మెల్యే ముంబయి మహానగర వీధుల్లో సాధారణ భిక్షగాడిలా తిరుగుతూ యాచించడం ప్రస్తుతం తీవ్ర సంచలనంగా మారింది. రూ.3,300 కోట్లకు పైగా సంపద ఉన్న కుబేరుడు అధికార పార్టీకి చెందిన నాయకుడు ఇలా అభాగ్యుడి రూపంలో రోడ్లపై యాచిస్తుండటంతో స్థానిక ప్రజలతో పాటు ఆయన మద్దతుదారులు, నెటిజన్లు తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అసలు ఆయనకు ఎందుకిలా భిక్షమెత్తుకున్నారని పెద్ద ఎత్తున చర్చ సాగింది. ముఖ్యంగా బిచ్చగాడు సినిమా ఫాలో అయ్యారా ఎవరి కోసమైనా ఇలాంటి దీక్ష తీసుకున్నారా అని అంతా అనుమానాలు వ్యక్తం చేయగా అసలు కారణం వెలుగులోకి వచ్చింది. ముంబయిలోని ఘాట్ కోపర్ ఈస్ట్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రముఖ వ్యాపారవేత్త, బీజేపీ ఎమ్మెల్యే పరాగ్ షానే ఈ వినూత్న ప్రయోగానికి పూనుకున్నారు. జైన సంప్రదాయంలో అత్యంత పవిత్రంగా భావించే ఒక ప్రత్యేక మాసంలో భాగంగా ఆయన తన ఆధ్యాత్మిక గురువు మార్గదర్శనంలో ఈ భిక్షాటన దీక్షను చేపట్టారు. సమాజంలో తనకున్న హోదా, సంపద, అహంకారాన్ని పక్కనబెట్టి సాధారణ మానవుడిలా జీవితాన్ని అనుభవించడమే ఈ ఆధ్యాత్మిక విధానం యొక్క ముఖ్య ఉద్దేశం కాగా ఆయన ఈ దీక్షను పూర్తి చేశారు. గుర్తుపట్టని వేషధారణతో వీధుల్లో రోజంతా ఈ దీక్షలో భాగంగా పరాగ్ షా తనను ఎవరూ గుర్తుపట్టలేని విధంగా సాధారణ దుస్తులు ధరించి వేషధారణ మార్చుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ వీధుల్లోనే రోజంతా కాలినడకన తిరిగారు. యాచకుడిగా మారిన ఆయనకు దారి పొడవునా లభించిన ఆహారాన్ని మాత్రమే తింటూ రాత్రి సమయాల్లో రోడ్డు పక్కనే నిద్రించారు. కోట్లాది రూపాయల ఆస్తులు, సుఖభోగాలు ఉన్నప్పటికీ ఏకధాటిగా ఒకరోజు పాటు వీధిలోనే ఉంటూ జీవితంలోని కఠిన సత్యాలను స్వయంగా అనుభవించారు. ఈ వినూత్న ఆధ్యాత్మిక సాధన ముగిసిన అనంతరం ఎమ్మెల్యే పరాగ్ షా తన అనుభవాలను పంచుకున్నారు. శాసన సభ్యుడిగా ప్రజాప్రతినిధి హోదాలో ఉన్నప్పుడు ప్రజల నుంచి లభించే గౌరవ మర్యాదలు, ఆప్యాయతలు వేరుగా ఉంటాయని తెలిపారు. కానీ అదే వ్యక్తుల ముందుకు ఒక భిక్షగాడిగా వెళ్లినప్పుడు వారి దృక్పథం పూర్తిగా మారిపోతుందని, అప్పుడు ఎదుటివారే మన కంటే ఎంతో ఉన్నతంగా కనిపిస్తారని చెప్పారు.

# మిశ్రా ఇంటర్వ్యూలో సక్సెస్ అయితేనే సిఇఒగా ఎంపికయ్యారు!

# ఇంటర్వ్యూ లేదన్న ఆరోపణలపై అయోధ్య కమిటీ స్పష్టత

**అయోధ్య, సెప్టెంబరు 16:** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయానికి ఇటీవల రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను సీఈవోగా నియమించిన చేసిన విషయం తెలిసిందే. ఆయన ఇంటర్వ్యూకు హాజరుకాలేదని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీ రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు వివరణ ఇచ్చింది. జితేంద్ర ఇంటర్వ్యూకు హాజరు కాలేదన్న వార్తలు అవాస్తవం అని, టాప్ త్రీ అభ్యర్థుల్లో ఆయన కూడా ఉన్నారని, దానికి సంబంధించిన డాక్యుమెంటరీ ఆధారాలు ఉన్నాయని ట్రస్టు జనరల్ సెక్రటరీ స్వామి గోవింద దేవ్ గిరి ఓ ప్రకటనలో తెలిపారు. రామ మందిరం నిర్వహణ చూసుకుంటున్న శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర తన ప్రకటనలో మీడియా వార్తలను ఖండించింది. అత్యున్నత ప్రమాణాల ప్రకారం పారదర్శకంగా ఇంటర్వ్యూ నిర్వహించినట్లు జనరల్ సెక్రటరీ తెలిపారు. మెరిట్ ఆధారంగానే సెలెక్షన్ జరిగినట్లు ఆయన వెల్లడించారు. రామజన్మభూమి తీర్థ ఏర్పాటు చేసిన ప్యానెల్ మిశ్రాను ఎంపిక చేసింది. దీంతో ఆయన రామాలయం తొలి సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇంటర్వ్యూలో భాగంగా సుమారు 5585 దరఖాస్తులను పరిశీలించారు. మూడు నగరాల్లో ఎంపిక ప్రక్రియ జరిగిందని, ఢిల్లీ ఎన్సీఆర్, పుణె, సంబల్‌పుర్ పట్టణాల్లో ఎంపిక ప్రక్రియ జరిగినట్లు ఆ స్టేట్మెంట్‌లో పేర్కొన్నారు. తొలుత 16 మంది అభ్యర్థులను షార్ట్ లిస్టు చేశారని, ఆ తర్వాత ఆగస్టు 11, 12 తేదీల్లో అయోధ్యలో ఫేస్ టు ఫేస్ ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. అయితే తొలి రోజు తొలి సెషన్‌లోనే ఎయిర్ మార్షల్ మిశ్రా ఇంటర్వ్యూకు హాజరయ్యారు. మిశ్రా ఇంటర్వ్యూకు హాజరుకాలేదని ఐపీఎస్ ఆఫీసర్ రాజేశ్ పాండే ఆరోపించారు. ఆయన కూడా సీఈవో పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. సీఈవోగా నియమితుడైన వ్యక్తి కనీసం షార్ట్‌లిస్టు చేసిన 16 అభ్యర్థుల్లో కూడా లేరని రాజేశ్ పాండే ఆరోపించారు. ఇదే అంశంలో ట్రస్టుకు లేఖ రాసినట్లు మాజీ ఐపీఎస్ ఆఫీసర్ అమితాబ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఒకవేళ పాండే ఆరోపణలు నిజమే అయితే అప్పుడు ఆ ఎంపిక ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం అవుతాయని ఠాకూర్ అన్నారు. ట్రస్టు దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు.

# ఉగ్రజాబితాల్లోకి షెహజాద్‌భట్టి నెట్‌వర్క్ - తాజాగా కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:** పాకిస్తాన్ గ్యాంగ్‌స్టర్, ఉగ్రవాది షహజాద్ భట్టికి చెందిన నెట్వర్క్‌పై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. షహజాద్ భట్టి ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర హోంశాఖ బుధవారం వెల్లడించింది. ఆయుధాలు, పేలుడు పదార్థాలు, డ్రగ్స్ అక్రమ రవానా, యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం వంటి కార్యకాలపాలకు ఈ నెట్వర్క్ పాల్పడుతున్నట్లు కేంద్రం పేర్కొంది. భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కోసం ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గానికి చెందిన వ్యక్తుల్ని, డ్రగ్స్‌కు బానిసైన వ్యక్తుల్ని సోషల్ మీడియా, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆకర్షించి ఈ ముఠా నియమించుకుంటున్నట్లు దర్యాప్తులో తేలింది. ఆగస్టు 12న షహజాద్ భట్టి నెట్వర్క్‌పై దేశవ్యాప్తంగా సమన్వయంతో భద్రతా సంస్థలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ చర్యలో 14 రాష్ట్రాల్లో 253 మందిని అదుపులోకి తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ నెట్వర్క్‌కు సంబంధించి 80కి పైగా ఎఫ్ఐఆర్లు నమోదు కాగా, 200 మందిని అరెస్ట్ చేశారు. పాకిస్తాన్ నుంచి డ్రోన్ల ద్వారా భారత్‌లోకి ఆయుధాలు, డ్రగ్స్, పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాకిస్తాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో తయారైనట్లు ఉంది.



# చిట్లిన జుట్టు !

వాతావరణ కాలుష్యం మన కురులపై చూపే దుష్ప్రభావ మెంతో ! దానితోడు రసాయనాలు ఎక్కువ. ఉండే షాంపూలను వాడితే జుట్టు మరింత పాడవుతుంది. మరేం చేద్దామంటారా? తలస్నానానికి ముందు ఈ చికిత్సలు ప్రయత్నిస్తే సరి. కప్పు నీటిలో కొన్ని వేపాకు లు, 10-15 తులసి ఆకులు వేసి మరిగించాలి. గోరువెచ్చగా అయ్యాక నీటిని వడకట్టి పక్కన ఉంచాలి. ఆకులను మిక్సీ పట్టి, ఆ మిశ్రమంతో పాటు 3 స్పూన్ల కలబంద గుజ్జును ఆ నీటికి కలపాలి. ఆపై మాడు నుంచి కురుల వరకు దీన్ని పట్టించి, పావుగంట య్యాక తలస్నానం చేస్తే సరి.ఇది తలపై ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంతోపాటు కురులు చిట్లడాన్నీ నివారిస్తాయి. శీకాయ, ఉసిరి ప్యాక్ కూడా కురులకు దివ్యౌషధం. అయితే దీని తయారీకి రెండు రోజులు కేటాయించాలి మరి. ఒక ఇసుప కడాయి తీసుకొని సమపాళ్లలో రెండు పొడులనూ తీసుకొని నీటిలో నానబెట్టాలి. రెండోరోజు మాడు, కురులకు పట్టించి, మృదువుగా రుద్దాలి. పావుగంట అయ్యాక గోరువెచ్చని నీటితో తలస్నానం చేసి చూడండి.మెరిసే కురులు సొంతమవుతాయి.ఇవి చుండ్రునీ నివారిస్తాయి. ముల్తానీ మట్టి మోముకి చేసే మేలెంతో మనకు తెలుసు. మాడునీ ఆరోగ్యంగా ఉంచుతుందని తెలుసా? రెండు స్పూన్ల ముల్తానీ మట్టికి మజ్జిగను కలిపి మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. అయిదు నిమిషాలు పక్కన పెట్టి, తర్వాత తలకు రాసుకోవాలి. ఆరాక చల్లని నీటితో తలస్నానం చేయాలి. జుట్టు బరకగా, పొడిబారుతున్నట్లు కనిపిస్తోంటే దీన్ని ప్రయత్నించండి. వాటికి తేమను అందించి మృదువుగా చేయడమే కాదు.. చెమట కారణంగా ఏర్పడే దురద, దద్దుర్లనూ తగ్గిస్తుంది.

# మోము మిలమిల !



ఎక్కడ చూడూ జ్వరాలే! రోగనిరోధకశక్తి పెరుగుతుందనో, ప్లేట్‌లెట్స్ సంఖ్య పెరగాలనో బొప్పాయి తినేవారి సంఖ్యా ఎక్కువే కదూ! మరి వాటి గింజలనేం చేస్తున్నారు? పడేస్తున్నారా! వద్దండీ బాబూ.. వాటితో అందాన్ని పెంచుకోవచ్చు. ఎలాగంటే..

✦.బొప్పాయి గింజ లను మెత్తగా మిక్సీ పట్టాలి. దానికి కాస్త తేనె చేర్చి, కడిగిన ముఖానికి పట్టించి అయిదు నిమిషాలు వదిలేయాలి. ఆపై చేతిని తడి చేసుకుంటూ మరో అయిదు నిమి షాలు మృదు వుగా రుద్ది, గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది మంచి స్క్రబ్‌లా పనిచేస్తుంది.

✦ బొప్పాయి గిజంల్ని బాగా ఎండబెట్టాలి. తరవాత మెత్తగా చేసుకుని పొడిగా, శుభ్రంగా ఉండే సీసాలో భద్రపరచుకోవాలి. అవసరమైనప్పుడు స్పూను పొడికి తగినంత తేనె, పాలు కలిపి పేష్‌ప్యాక్‌లా చేసుకుంటే సరి మెరిసే మోము మీ సొంతం.

✦ స్పూను బొప్పాయి గింజల పొడికి అరచెంచా చొప్పున బొప్పాయి గుజ్జు, పెరుగు, తగినన్ని నీళ్ల కలిపి, ముఖానికి పట్టించండి. ఈ ప్యాక్ ముడతలను దరిచేరనీయదు.

✦ ఈ గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఎ,సి,ఇ విటమిన్లు వృద్ధాప్య ఛాయల్ని దరిచేరనీయవు. ఆల్ఫా హైడ్రాక్సీ యాసిడ్స్ చర్మకణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. దీనిలోని పపైన్ అనే ఎంజైమ్, మినరల్స్ ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించ డమే కాదు. ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచీ చర్మాన్ని కాపాడతాయి. అయితే ఎంత సహజసిద్ధమైనవైనా ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మాత్రం తప్పని సరి.

# పొదుపు ప్రణాళిక ఇలా!

నెలనెలా కొంత పొదుపు చేయాలి... అనుకోవడం వరకూ సరే! పొదుపు చేయాలనే ఉంటుంది కానీ చేద్దాంలే అని ఆలోచించడంలోనే సమయం మించిపోతుంది. ఖాతా ఖాళీ అవుతుంది. కాబట్టి, రికరింగ్, సిప్, చిట్... ఇలా ఏదైనా పెట్టుకోండి. ఆటోమేటిగ్గా డబ్బులు కట్ అయ్యేలా చూసుకోండి. జీతం పడినరోజే కట్ అయ్యేలా పెట్టుకుంటే మరీ మంచిది. నెలకి ఎంత ఖర్చు పెడుతున్నారు? దేనికి ఎక్కువ మొత్తం వెచ్చిస్తున్నారు? వీటిని గమనించుకోవాలి. అప్పుడే అనవసర ఖర్చు ఎక్కడవుతుందో తెలుస్తుంది. చదవాలి, ఆన్‌లైన్ వ్యాయామం, గేమ్స్ అంటూ బోలెడు యాప్ డబ్బులు కట్టి, సబ్‌స్క్రైబ్ చేస్తాం. కానీ, ఉపయోగించడం. అలాంటివి రివ్యూ చేసుకోవచ్చు. అనవసరమనిపిస్తే ఆపొచ్చు. అంటే అవసరమైన వరకే ఉపయోగించే వీలన్నమాట. డిజిటల్ స్టేట్ మెంట్‌లు వచ్చాక బడ్జెట్ వేయడమే మర్చిపోతున్నాం. అవసరమైతే యూపీఐ బ్యాంకు ఖాతా తెరిచి చూస్తాం. అలా కాకుండా... స్వయంగా రాయండి. వ్యక్తిగత ఖర్చులు, సేవింగ్స్, ముఖ్యమైనవి విభజించి రాయాలి. దానికి కట్టుబడి ఉండాలి. తెలివిగా ఖర్చు పెట్టడం అలవాటు అవుతుంది. తక్కువలో వ్యాపకాలు, పర్యటనలు ఎంటర్టైన్మెంట్ వగైరాకి డబ్బు కేటాయించు కోవడమూ తెలుస్తుంది. పెళ్లి, ఆసుపత్రి, బంధువులకు పెట్టుబడులు.. ఇలా అనుకోని ఖర్చులు చాలానే వస్తుం టాయి. కాబట్టి, ఎమర్జెన్సీ ఫండ్స్ సిద్ధం చేసుకోవాలి. 'రేపు' ఎలాంటి పరిస్థితులైనా ఎదుర వ్వొచ్చు. కాబట్టి, సిద్ధంగా ఉండాల్సిందే. అలాగని సంతోషాలను త్యాగం చేయనక్కర్లేదు. ఆనం దాల్నీ, భవిష్యత్తునీ సమన్వయం చేసుకోవాలి. అందుకు ఈ అలవాట్లు సాయపడతాయి. చేసుకుంటారుగా మరి?



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**వ్యథ**


# సన్నగా ఉంటే సమస్యలు వస్తాయా ?

ప్రశ్న: నా వయస్సు 22 ఏళ్లు. ఎత్తు 5 అడుగుల 6 అంగుళాలు. బరువు 40 కిలోలు. నేను ఎంబీఏ రెండవ సంవత్సరం చదువుతున్నాను. నాకు థైరాయిడ్, ఇతర హార్మోన్ సమస్యలు లేవు. రెండు నెలల క్రితం వ్యక్తిగత సమస్య కారణంగా తీవ్రమైన భయం, ఆందోళనకు గురయ్యాను. డాక్టర్ ఇచ్చిన మందులు వాడడంతో ప్రస్తుతం తగ్గింది. నేను సన్నగా ఉండటంతో కొందరు భవిష్యత్తులో హార్మోన్ సమస్యలు వస్తా యని, మరికొందరు నాకు అనోరెక్సియా నర్వోసా ఉందని, పెళ్లి తర్వాత పిల్లలు పుట్టరని భయపెడుతున్నారు. బరువు తక్కువగా ఉంటే ఇన్ని సమస్యలు వస్తాయా? - కవిత (పేరు మార్చాం) చిత్తూరు

జవాబు: మీ ఎత్తుకు, వయస్సుకు సంబంధించి మీ బరువు సాధారణ స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉంది. మీ బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) సుమారు 14.2గా ఉంది. పెద్దల్లో సాధారణ బిఎంఐ సాధారణంగా 18.5 నుంచి 24.9 మధ్య ఉంటుంది. కాబట్టి మీ బరువు తక్కువగా ఉండటానికి కారణాన్ని ఒకసారి వైద్యపరంగా పరిశీలించు కోవడం మంచిది. అయితే సన్నగా ఉండటం ఒక్కటే ఒక వ్యాధికి సంకేతం కాదు. కొందరు సహజం గానే సన్నగా ఉంటారు. కుటుంబ లక్షణాలు, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ, జీవనశైలి, ఒత్తిడి, ఆందోళన తదితర అంశాలు కూడా బరువుపై ప్రభావం చూపుతాయి.మీరు ఇటీవల తీవ్రమైన భయం, ఆందోళ నకు గురయ్యారని, చికిత్సతో ప్రస్తుతం తగ్గిందని చెప్పారు. ఇది మంచి పరిణామం."కేవలం బరువు తక్కువగా ఉందని అనోరెక్సియా నర్వోసా ఉందని చెప్పడం సరైంది కాదు. బరువు పెరుగుతామనే తీవ్రమైన భయం, కావాలనే ఆహారాన్ని పరిమితం చేయడం, బరువు తక్కువగా ఉన్నప్పటికీ తాము లావుగా ఉన్నామని భావించడం, శరీరాకృతిపై అసాధారణమైన ఆందోళన వంటి లక్షణాలను కూడా వైద్యులు పరిశీలిస్తారు.అలాగే"పెళ్లి తర్వాత పిల్లలు పుట్టరు" అని భయపెట్టడం కూడా సరైనది కాదు. బరువు తక్కువగా ఉండటం ఒక్కటే భవిష్యత్తులో సంతానలేమికి కారణమవుతుం దని చెప్పలేం. అయితే చాలా తక్కువ బరువు ఎక్కువకాలం కొనసాగితే శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోవడం వల్ల బలహీనత, రక్త హీనత, ఎముకల ఆరోగ్యం దెబ్బతినడం వంటి సమస్యలు రావచ్చు. మహిళల్లో నెలసరి క్రమం తప్పడం లేదా కొంతకాలం ఆగిపోవడం, అండోత్పత్తి తగ్గడం వంటి సమస్యలు కూడా రావచ్చు. దీనివల్ల సంతానో త్పత్తి సామర్థం తాత్కాలికంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. కాబట్టి డాక్టర్ ద్వారా పరీక్షలు చేయించుకొని జాగ్రత్తలు పాటించడం మంచిది. నిపుణుల సలహాతో సమతుల ఆహారం తీసుకుని క్రమంగా బరువుపెరగడం మంచిది. అలాగే మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గించుకోవడం అవసరం.



# పూజలో పుస్తకాలు !



వినాయక శబ్దం లోని 'వి' అనేది విశ్వం, విశిష్టత, విశాలతలకు ప్రతీక. వినాయకుడు నాయకులలో విశిష్టుడు, విశ్వ పూజనీయుడు, 'శుక్లాంబరధరం విష్ణుం' అంటూ గణేశుని విష్ణువుగా భావించి పూజిస్తాం. విష్ణుమూర్తి వలె గణేశుడు వ్యాపన శక్తి కలిగినవాడు. ప్రసన్నత ప్రతిఫలించే గజముఖుణ్ణి 'ప్రసన్న వదన ధ్యాయేత్' అంటూ అర్చిస్తాం. వ్యాసుడు మహాభారతాన్ని వినాయకుడి చేత రాయించదలచు కున్నాడు. అలా చెప్పినప్పుడు 'ఆపకుండా చెబితే రాస్తాను' అంటూ గణేశుడు షరతు పెట్టాడు. బదులుగా వ్యాసమహర్షి అర్థం చేసుకుని రాయాలింటూ ప్రతి షరతు విధించాడు. ఏదైనా వేగంగా సాగాలి అన్నది గణపతి సందేశం. ఏ విషయాన్నైనా అర్థం చేసుకున్న తర్వాతే లిఖించాలి అన్నది మహర్షి ప్రబోధ వినాయకుడు లిఖించిన భారతం పంచమవేదమైంది. తొలి లేఖకుడైన గణపతి పూజలో పుస్తకాలు,కలము ఉంచడం సంప్రదాయమైంది.

# శనగపప్పు పూర్ణం



**కావలసినవి :** శనగపప్పు, మినపగుండ్లు, బెలనం-1, కప్పు చొప్పున, బియ్యం-ఒకటింబావు కప్పు, ఉప్పు-తగినంత, నెయ్యి-చెంచా, యాలకుల పొడి-చిటికెడు,నూనె-వేగడానికి సరిపడా

**తయారీ :** మినపగుండ్లు, బియ్యం, శనగపప్పులను విడివిడిగా నానబెట్టాలి. 4 గంటల తర్వాత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్‌చేసి 2 గంటల తర్వాత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసి 2 గంటలు పక్కన ఉంచాలి. శనగపప్పును కుక్కర్‌లో 4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి, నీరు వడకట్టాలి. చల్లారాక పప్పు గుత్తితో మెదపాలి లేదా మిక్సీలో బరకగా వచ్చేట్టు గ్రైండ్ చేసుకోవాలి. అదే కుక్కర్‌లో పప్పుతో పాటు బెల్లం వేసి చిన్నమంట మీద కలుపుతూఉడికించాలి. ఇందులో యాలకుల పొడి వేసి, పిండి గట్టి పడుతున్నప్పుడు నెయ్యి వేసి దించాలి. చల్లారాక మనకు కావలసిన సైజులో ఉండలు చుట్టి, తయారు చేసు కున్న పిండిలో ముంచి కాగిన నూనెలో బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి.

# 'ది ప్యారడైజ్' థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్:

**: సంపూర్ణేష్ బాబుల**



న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్"ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు.

**బిర్యాని క్యారెక్టర్ తో అందరినీ సంప్రైజ్ చేశారు కదా?**

డైరెక్టర్ శ్రీకాంత్ దగ్గర నుంచి కాల్ వచ్చింది. వెళ్లి కలిసాను. అందులో బిర్యాని క్యారెక్టర్ చెప్పిన ప్పుడు నాకు చాలా కొత్తగా అనిపించింది. ఇప్పటి వరకు నేను అలాంటి క్యారెక్టర్ చేయలేదు. చాలా సీరియస్‌గా ఉంటుంది. ఇందులో నానికి బెస్ట్ ఫ్రెండ్ క్యారెక్టర్ చేస్తున్నాను. సినిమా త్రూ అవుట్ నా క్యారెక్టర్ ఉంటుంది.

**మీరు కామెడీ నుంచి ఒక్కసారి ఇలాంటి సీరియస్ రోల్ చేయడం ఎలా అనిపించింది?**

మూడు సంవత్సరాల క్రితం నాకు ఇలాంటి క్యారెక్టర్ వచ్చి ఉంటే నా కెరీర్ లో జరిగిన కొన్నిమిస్టేక్స్ జరిగేవి కావు. నాని అన్న, శ్రీకాంత్‌తో వర్క్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. నేను ఇంత పెద్ద సినిమా ఎప్పుడు చేయలేదు.

**నానితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?** నాని నాకు చాలా కంఫర్ట్ ఇచ్చారు.ఇంతపెద్ద సినిమాలో ఇన్ని రోజులు పనిచేయడం నాకు ఇదే మొదటిసారి.

**ఈ ఆఫర్ రావడం వెనుక సాయి రాజేష్ ఉన్నారు అని విన్నాం?**

అవునండి. నాకు సాయి రాజేష్ ఫోన్ చేసి నీకు శ్రీకాంత్ ఆఫీస్ నుంచి ఫోన్ వస్తుంది చక్కగా మాట్లాడి క్యారెక్టర్ చేయమని చెప్పారు.

**మీరు మోహన్ బాబు బ్యానర్ లో ఒక సినిమా చేశారు.. ఇప్పుడు ఆయనతో కలిసి నటిస్తున్నారు ఎలా అనిపిస్తుంది?** చాలా హ్యాపీ అండి. నేను మోహన్ బాబుతో నటించడానికి చాలా కాలం ఎదురు చూశాను.

**క్యారెక్టర్ చేయడానికి ఫిజికల్‌గా ఎలాంటి ఛాలెంజ్ ఎదుర్కొన్నారు?**

ఈ పాత్ర కోసం బరువు తగ్గమని చెప్పారు. తగ్గాను. అలాగే జుట్టు గడ్డం కూడా పెంచాను. డైరెక్టర్ ఏం చెప్తే అది ఫాలో అయ్యాను.

**నిర్మాత సుధాకర్ గురించి ?**

ప్రొడ్యూసర్ చాలా కంఫర్ట్‌గా చూసుకు న్నారు. సినిమాని చాలా గ్రాండ్‌గా నిర్మించారు. వరల్డ్ బిల్డింగ్ చాలా అద్భుతంగా వుంటుంది

# తెర

# 'పాటకు ప్రాణం' ఘనంగా ప్రారంభోత్సవం..

హెచ్.టీ సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై హేమల్ తుమ్మపూడి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి చిత్రం"పాటకు ప్రాణం" హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు సురేందర్ రెడ్డి, ప్రముఖ హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర సంగీతం అందిస్తు న్నారు. ఈ మ్యూజికల్ ఫిల్మ్‌లో యువ నటులు సుదర్శన్, సాత్విక జంటగా నటిస్తున్నారు. సీనియర్ నటుడు తనికెళ్ల భరణి కీలక పాత్రలో కనిపించ నున్నారు. వీరితో పాటు రాజీవ్ కనకాల, అనితా చౌదరి, రఘు కారుమంచి, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తు న్నారు...దర్శకుడు హేమల్ తుమ్మపూడి మాట్లాడుతూ.. ముందుగా మా లాంటి యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇక్కడికి విచ్చేసిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. ,ఈ సినిమాపై ఎంతో ప్యాషన్ తో, నమ్మకంతో పనిచేస్తున్న ఈ యువ దర్శకుడి కాన్ఫిడెన్స్ మీకు కూడా కనిపిస్తుందని అనుకుంటున్నాను. ఆయన ఎన్నారై అయిన ప్పటికీ, సినిమా చేయాలనే తపనతో ఈ ప్రాజెక్ట్‌ను చాలా అంకితభావంతో



తెరకెక్కిస్తున్నారు. హీరో సుధర్శన్ వంగల మాట్లాడుతూ.. ,మా కార్యక్రమానికి విచ్చేసి మమ్మల్ని ఆశీర్వదించిన మీడియా మిత్రులందరికీ, ముఖ్య అతిథులుగా వచ్చిన నిఖిల్‌కి, సురేందర్ రెడ్డిరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ..హీరోయిన్ సాత్విక మాట్లాడుతూ.. ,మా సినిమాకు మద్దతుగా వచ్చి ప్రోత్సహిస్తున్న మీడియా మిత్రులందరికీ, ప్రతి ఒక్కరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు..రాజీవ్ కనకాల మాట్లాడుతూ.. ,భరణి ఈ సినిమా చాలా చక్కగా వివరించారు. జెన్‌జెడ్ ప్రేక్షకుల కోసం ఇలాంటి సినిమా తీసుకొస్తున్న దర్శకుడు హేమల్‌కు ముందుగా అభినందనలు.

# 'ఏ నిమిషానికి ఏమి జరుగునో' నుంచి 'ఏదో బాగుందే..' పాట విడుదల



రాజు వెడ్స్ రాంబాయ్ చిత్రంతో హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అఖిల్ రాజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం'ఏ నిమిషానికి ఏమి జరుగునో'. ఒక విభిన్నమైన సస్పెన్స్ థ్రిల్లర్ రూపొందిస్తున్న ఈ సినిమాలో రతిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సాయితేజ దర్శ కుడు. లక్కీ మీడియా, కేడీ అండ్ కో బ్యానర్స్‌పై బెక్కెం వేణు గోపాల్, దీవెల శ్రీనివాసరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణనంతర పనులు జరుపుకుంటోన్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం నుంచి కృష్ణకాంత్ రచించిన ఏదో బాగుందే అనే లిరికల్ వీడియోను ప్రముఖ యువ కథానాయకుడు శ్రీవిష్ణు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు మాట్లాడుతూ సాంగ్ చాలా ఫ్రెష్‌గా ఉంది.. విజువల్స్ బాగున్నాయి. సాంగ్ అందరికి నచ్చుతుంది. సంగీత దర్శకుడు శశాంక్ మంచి ట్యూన్ అందించాడు. ఈ సినిమా టైటిల్‌తో సహా అన్ని ఫ్రెష్‌గా ఉన్నాయి. టైమ్ లూప్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందించారని తెలిసింది. ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తుంటాయి. తప్పకుండా ఈ సినిమా విజయం సాధించి ఈ సినిమాకు పనిచేసిన అందరికి మంచి పేరు తీసుకరావాలని కోరుకుంటున్నాను అన్నారు.అఖిల్ రాజ్, రతిక, షైనింగ్ ఫణి, రాజేష్ ఉల్లి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్: శశాంక్ తిరుపతి, కో ప్రొడ్యూసర్: ఠాగూర్, నితీష్, నిఖిల్, డీవోపీ: రవికిరణ్ బోయడపు, నిర్మాతలు: బెక్కెం వేణుగోపాల్, దీవెల శ్రీనివాసరావు, రచన దర్శకత్వం: సాయితేజ.


# 'బా బా బ్లాక్ షీప్' అక్టోబర్ 9న రిలీజ్



అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్'.దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియో పై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబర్ 9న సినిమా రిలీజ్ అవుతుంది. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ , విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళ్వీ మల్హోత్రా, కశ్యప్, రాజారవీంద్ర తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మేఘా లయా రాష్ట్రంలో పూర్తిగా చిత్రీకరణను జరుపుకున్న తొలి దక్షిణాది సినిమా ఇదే కావటం విశేషం. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, రీసెంట్‌గా రిలీజైన"ఆజా మేరీ జాన్ని సాంగ్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'వెవెలా ఊహాలే చూపినా..'నురిలీజ్ చేశారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ఈ పాటను విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. వెవెలా ఊహాలే చూపినా.. సాంగ్ నేపథ్యం విషయానికి వస్తే..తమకు కావాల్సిన ఓ అరుదైన బాక్స్ కోసం విలన్ గ్యాంగ్ వెతుకుతుంటుంది. అది హీరో, హీరోయిన్ దగ్గర ఉందని వారు భావిస్తుం టారు. అదే సమయంలో వాళ్లు విలన్స్ కంటపడతారు. మరోవైపు హీరో చేతిలో గన్ ఉంటుంది..అది ఊహించని రీతిలో పేలుతుంది. ఎలక్ట్రానిక్ కిలి, ఆర్కాడో సంగీత సారథ్యంలో ఈ సాంగ్‌ను కిట్టు విస్సాప్రగడ రాయగా..శ్రీ సాగర్ పాడారు. పాటను మళ్లీ మళ్లీ వినాలనిపించేలా డిఫరెంట్ బ్యాక్ డ్రాప్, మ్యూజిక్‌తో ఆసాంతం ఆకట్టుకుం టోంది. ఈ సందర్భంగా..చిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ ఇప్పటి వరకు రిలీజైన మా బా బా బ్లాక్ షీప్ మూవీ టీజర్, అజా మేరీ జాని సాంగ్‌కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు 'వెవెలా ఊహాలే చూపినా..' అనే సాంగ్‌ను మీ ముందుకు తీసుకొస్తున్నాం.

# 'ఆస్మాన్' టీజర్ విడుదల..

శ్రీమతి. కొండారు శ్రీనివాసరావు సమర్పణలో శ్రీ క్లీంకార సెల్యూలాయిడ్ బ్యానర్ మీద మేఘాంశ్ శ్రీహరి హీరోగా రామ్ నందన్ తెరకెక్కిస్తున్న చిత్రం ఆస్మాన్ ఈ సినిమాని వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం నిర్మిస్తున్నారు. శ్రీహరి జయంతి సందర్భంగా రిలీజ్ చేసిన మూవీ ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. తాజాగా మేఘాంశ్ శ్రీహరి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం నాడు టీజర్‌ను విడుదల చేశారు. మీరు ఇప్పుడు గొంగలి పురుగు దశలో ఉన్నారు.. అది దాటి సీతాకోక చిలుక దశలోకి మారాలి.. దానికి మార్గం నేనే.. మీరందరూ కూడా కనిపించే చీకట్లో ఉన్నారు.. అదే నిజం అంటూ అద్భుతమైన డైలాగ్స్, హీరో వాయిస్ ఓవర్‌తో ఉన్న ఈ టీజర్ ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగింది. ఇక ఈ టీజర్‌లోని విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్, ఎమోషన్స్ అన్నీ కూడా ప్రేక్షకుల్ని కట్టి పడేసేలా ఉన్నాయి. అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకునేలా కట్ చేసిన ఈ టీజర్‌లో హీరో మేఘాంశ్ శ్రీహరి సరికొత్తగా కనిపించారు.ప్రశాంత్ ఆర్ విహారి మ్యూజిక్, షోయబ్ కెమెరా వర్క్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవను న్నాయి. ఇక ఈ మూవీని తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, అరబిక్ భాషల్లో విడుదల చేయనున్నారు.



# 'కాగితం పడవలు' 18న రిలీజ్



వర్ధన్, కృష్ణప్రియ హీరో హీరోయిన్లుగా ఎంజీఆర్ తుకారాం దర్శకత్వంలో తెరకెక్కుతున్న రా అండ్ రస్టిక్ లవ్‌స్టోరీ 'కాగితం పడవలు'. ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్, నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టి.ఆర్. ప్రసాద్ రెడ్డి, వెంకట్రాజుల, గాయత్రమ్మ అంజనప్ప నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడు దలైన గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సెప్టెంబర్ 18న ఈ చిత్రం ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. నేను ఈ వేడుకకు రావడానికి కారణం డైరెక్టర్ తుకారాం. ఫలక్‌నుమా దాస్ అసిస్టెంట్ డైరెక్టర్స్ కావాలని కాస్టింగ్ కాల్ పెట్టాను. అప్పుడు వచ్చిన డైరెక్టర్ తుకారాం. తనకి ఇష్టమైన సినిమా"ఒసేయ్ రాములమ్మ అని చెప్పాడు. నిజంగా అలాంటి ఆన్సర్ నేను ఎవరి దగ్గర వినలేదు. తర్వాత కొంతకాలం పని చేశాక తను సొంతగా డైరెక్టర్ చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టాడని నాకు అర్థమై, తన ప్రయత్నాలు చేసు కోమని పంపించాను. హీరో వర్ధన్ మాట్లాడుతూ.. విశ్వక్ అన్న ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాకి ఎన్నోసార్లు ఎన్నో అడ్డంకులు వచ్చాయి. అడ్డంకులన్నిటినీ ప్రొడ్యూసర్లు అధిగమిం చారు. ఈరోజు ఎక్కడ వరకు వచ్చి ఈ వేడుక చేస్తున్నామంటే, దీనికి ప్రధాన కారణం మా నిర్మాతలు. ప్రొడ్యూసర్ కీర్తన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 18న సినిమా ఆడియన్స్ ముందుకు వస్తుంది. అందరికీ నచ్చుతుంది. తప్పకుండా చూస్తారని భావిస్తున్నాను. విశ్వక్ రావడం చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ తుకారాం మాట్లాడుతూ.. విశ్వక్ అన్న నమ్మిన వారి వెంట నిలబడతారు. నానాజీ మాట్లాడుతూ.. విశ్వక్ సేన్ తో పాగల్, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలు చేశానా. రెండిట్లో ఆయన నన్ను చితక్కొట్టారు. ఆయన ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. వేదవ్యాస్ మాట్లాడుతూ.. మా సినిమాని సపోర్ట్ చేయడానికి వచ్చిన విశ్వక్ అన్నకి థాంక్యూ. మాకు ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ కి, నిర్మాతలకు ధన్యవాదాలు.

## వెస్టిండీస్‌తో వన్డే సిరీస్:

# ముగ్గురు ఐపిఎల్ కెప్టెన్‌లు రీఎంట్రీ



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో ఈ నెల 27న తిరువనంతపురం వేదికగా ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత జట్టు ఎంపిక ప్రక్రియ అత్యంత ఆసక్తికరంగా మారింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ తుది జట్టును ఎంపిక చేయడంలో పలు కీలక అంశాలను పరిశీలిస్తోంది. ఫిట్‌నెస్ సాధించిన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా. వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ పునరాగమనంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఆసియా క్రీడలు షెడ్యూల్ కారణంగా పలువురు ప్రధాన ఆటగాళ్లు జపాన్ పర్యటనలో ఉండటంతో, వన్డే జట్టు కూర్పు సెలక్టర్లకు పెద్ద సవాలుగా పరిణమించింది. ఇదే సమావేశంలో అగార్కర్ పదవీకాలాన్ని 2027 వన్డే ప్రపంచకప్ వరకు పొడిగించే అంశంపై బోర్డు పెద్దలతో చర్చలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా టీమిండియాను పేస్ ఆల్‌రౌండర్ల కొరత సెలక్టర్లను వేధిస్తోంది. నితీశ్ కుమార్‌రెడ్డి ఆసియా క్రీడల్లో పాల్గొంటుండగా, సూర్యాన్ష్ షెడ్గే, వెంకటేశ్ అయ్యర్ గాయాల పాలయ్యారు. దీంతో పాండ్యా నేరుగా 50 ఓవర్ల మ్యాచ్‌లలో బౌలింగ్, ఫీల్డింగ్ చేయగలరా అనే అంశంపైనే ఆయన ఎంపిక ఆధారపడి ఉంది. మరోవైపు ఇషాన్ కిషన్ గైర్హాజరీతో పంత్‌కు 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కే అవకాశాలు మెరుగయ్యాయి. అయితే కేఎల్ రాహుల్ మొదటి ఎంపిక వికెట్ కీపర్‌గా ఉంటారు. శ్రేయస్ అయ్యర్ అందుబాటులో లేకపోవడంతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కు రాహుల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఒకవేళ పంత్ జట్టులోకి రాకపోతే ధ్రువ్ జురెల్‌ను ఎంపిక చేసి, పంత్‌ను ఇరానీ కప్ లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు సారథిగా పంపే వీలుంది. టాప్ ఆర్డర్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ల తర్వాత నాలుగో స్థానంలో రుతురాజ్ గైక్వాడ్ బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. రజత్ పటీదార్, యశస్వి జైస్వాల్ రిజర్వ్ బ్యాటర్లుగా ఉండే అవకాశముంది. స్పిన్ విభాగంలో హర్ష్ దూబె గాయపడటం, అక్షర్ పటేల్ ఆసియా గేమ్స్ వెళ్లడంతో రవీంద్ర జడేజా లేదా మానవ్ సుతార్ కు పిలుపు రావొచ్చు. పేస్ విభాగంలో విశ్రాంతి అనంతరం మహమ్మద్ సిరాజ్‌తో పాటు. ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ జట్టులో చోటు దక్కించుకోనున్నారు.

# తొలి టి20లో శ్రీలంక ఓటమి

## 119 పరుగులతో ఇంగ్లండ్ రికార్డు విజయం



**న్యూఢిల్లీ:** హాంప్‌షైర్ (ఇంగ్లాండ్) సౌతాంప్టన్ వేదికగా శ్రీలంకతో జరిగిన తొలి టీ20లో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 254 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇక లక్ష్య ఛేదనలో శ్రీలంక 19 ఓవర్లలో 135 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఇంగ్లండ్ 119 పరుగుల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఇంగ్లండ్ భారీ స్కోరుకు కెప్టెన్ హ్యారీ బ్రూక్ ప్రధాన కారకుడిగా నిలిచాడు. కేవలం 49 బంతుల్లోనే 114 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరోవైపు బ్రూక్ కు జోస్ బట్లర్ కూడా అద్భుతంగా సహకరించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 128 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. బట్లర్ 44 బంతుల్లో 80 పరుగులు చేశాడు. వీరి దూకుడుతో ఇంగ్లండ్ పవర్‌ప్లే ముగిసేసరికి 90 పరుగులు చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 254 పరుగులు చేయడం ద్వారా శ్రీలంకపై టీ20ల్లో తన అత్యధిక స్కోరును నమోదు చేసింది. అంతేకాకుండా వరుసగా రెండో టీ20లో 250కుపైగా పరుగులు చేసింది. 255 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. పాతుమ్ నిస్సాంక 12, కమిల్ మిశారా 10, లహిరు ఉదారా 5, చరిత్ అసలంక 10 పరుగులకే వెనుదిరిగారు. దసున్ శనక 24, దునిత్ వెల్లాలగే 33 పరుగులతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. చివరకు శ్రీలంక 19 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ బౌలర్లలో సోనీ బేకర్ కేవలం 12 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. అతనికి తోడుగా లియామ్ డాసన్, జేమీ ఓవర్టన్ చెరో రెండు వికెట్లు తీశారు. జోష్ టంగ్, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ తలో వికెట్ దక్కించుకున్నారు. ఇక శ్రీలంకను 119 పరుగుల భారీ తేడాతో ఓడించడం ద్వారా ఇంగ్లండ్ రికార్డు విజయాన్ని నమోదు చేసింది.




## వరల్డ్ టి20 ర్యాంకింగ్స్‌లో..

# నం.1 కిషన్

## రెండో స్థానానికి అభిషేక్

**న్యూఢిల్లీ:** ఆఫ్ఘానిస్తాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ సాధించిన అద్భుతమైన ఆరంభం ప్రభావం, తాజా ఐసిసి పురుషుల టీ20 ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. ఈ రెండు మ్యాచ్‌లలోనూ పలువురు భారత ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ఈ సిరీస్ మొదటి మ్యాచ్‌లో భారత ఓపెనింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ 82 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడారు. దీంతో పాకిస్థాన్‌కు చెందిన సాహిబ్‌జాదా ఫర్హాన్‌ను అధిగమించి, తాజా బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నారు. తాజా ర్యాంకింగ్స్‌లో అభిషేక్ కంటే ఇషాన్ కిషన్ ముందున్నాడు. ఈ ఇద్దరు భారతీయ ఆటగాళ్ల మధ్య 51 రేటింగ్ పాయింట్ల తేడా ఉంది. రెండో మ్యాచ్‌లో అర్ధశతకం సాధించిన సంజు శాంసన్ గణనీయమైన పురోగతిని సాధించి, నాలుగు స్థానాలు ఎగబాకి 30వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ సిరీస్ మొదటి రెండు మ్యాచ్‌లలో అద్భుత ప్రదర్శన కనబరిచిన వరుణ్ చక్రవర్తి, రెండు స్థానాలు ఎగబాకి ఐదవ స్థానానికి, జస్ప్రీత్ బుమ్రా ఏడు స్థానాలు మెరుగుపరుచుకుని 10వ స్థానానికి, అర్ష్‌దీప్ సింగ్ 11 స్థానాలు ఎగబాకి 14వ స్థానానికి, అలాగే అక్షర్ పటేల్ ఆరు స్థానాలు పైకి ఎగబాకి 27వ స్థానానికి చేరుకున్నారు. ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన అజ్మతుల్లా ఒమర్జాయ్ గణనీయంగా ముందుకు దూసుకెళ్లాడు. ఈ 26 ఏళ్ల ఆటగాడు సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో అజేయ అర్ధశతకం సాధించాడు.

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్:

# సుజీత్ విజయం

**లక్నో:** అక్టోబర్ 24 నుండి నవంబర్ 1 వరకు కజకిస్తాన్‌లోని అస్తానాలో జరగనున్న ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌ల కోసం లక్నోలో జరిగిన జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో, ప్రపంచ నంబర్ 1 సుజీత్ కల్కల్ పురుషుల 65 కేజీల విభాగంలో గెలుపొందాడు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో ఫైనల్‌లో అనుజ్ కుమార్‌ను 8-3 తేడాతో ఓడించి విజయం సాధించాడు. అలాగే పురుషుల 74 కేజీల విభాగంలో యశ్ అద్భుత ప్రదర్శన కనబరిచి ఫైనల్‌లో దీపక్‌ను 10-4 తేడాతో ఓడించాడు. 57 కేజీల విభాగంలో అక్షయ్ ధేరేపై 11-4 తేడాతో గెలుపొంది రాహుల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, 86 కేజీల ఫైనల్‌లో పుష్పేందర్ దలాల్, హిమాంశు అంటిల్‌పై 10-4 తేడాతో విజయం సాధించాడు. ఇక 97 కేజీల బౌట్‌లో విక్కీ 3-2 తేడాతో పర్వీన్ కుమార్‌ను ఓడించగా, 125 కేజీల విభాగంలో జస్పూరన్ సింగ్ 5-1 తేడాతో రోహిత్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. గ్రీకోరోమన్ విభాగంలో, 60 కేజీల కేటగిరీలో హర్ష్ లలిత్‌పై 9-0 తేడాతో ఘన విజయం సాధించాడు. ఉత్కంఠభరితమైన 67 కేజీల ఫైనల్‌లో సచిన్, కరణ్‌జిత్ సింగ్‌పై 6-5 తేడాతో, 77 కేజీల విభాగంలో లవ్‌ప్రీత్ సింగ్, వికాస్‌పై 10-8 తేడాతో గెలుపొందగా. 87 కేజీల విభాగంలో రోహిత్, రోహిత్ బురాను 5-2 తేడాతో ఓడించగా, 97 కేజీల విభాగంలో అభిమన్యు, వీరేంష్ కుండుపై 123 తేడాతో విజయం సాధించాడు. అలాగే 130 కేజీల ఫైనల్‌లో గుర్సేవక్‌పై జోగిందర్ ఫాల్ ద్వారా గెలుపొందాడు.



## మహిళల ప్రీమియర్ లీగ్..

# కొచ్చిలో అక్టోబర్ 28న ప్లేయర్ల వేలం

**ముంబై:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) ఐదవ ఎడిషన్ 2027 జనవరి 14 నుండి ఫిబ్రవరి 7 వరకు జరగనుంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి రాబోయే సీజన్‌కు సంబంధించిన కీలక తేదీలను బుధవారం ప్రకటించింది. కొత్త సీజన్‌కు ముందు మొదటి ప్రధాన గడువు సెప్టెంబర్ 28న జరిగే ప్లేయర్ రిటెన్షన్ గడువుగా పేర్కొంది. దీంతో తమ ప్రస్తుత స్క్వాడ్‌ల నుండి ఏ ఆటగాళ్లను నిలుపుకోవాలనుకుంటున్నారో నిర్ణయించుకోవడానికి ఐదు ఫ్రాంచైజీలకు అప్పటి వరకు సమయం ఉంటుంది. జట్టు కూర్పులో తదుపరి దశ అక్టోబర్ 28న గ్రాండ్ హయత్ కొచ్చిలో జరిగే డబ్ల్యూపిఎల్ ప్లేయర్ వేలంలో జరగనుంది. ఫ్రాంచైజీలు తమ జట్లలోని ఖాళీలను పూరించి, ఐదవ సీజన్ కోసం తమ జట్ల కూర్పును ఖరారు చేసుకుంటాయి. 2026 సీజన్‌లో ఫైనల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ రెండవ డబ్ల్యూపిఎల్ టైటిల్‌ను గెలుచుకుంది, దాని తర్వాత 2027 ఎడిషన్ జరగనుంది. ఈ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్ ఐదు ఫ్రాంచైజీలు కొనసాగుతున్నాయి. ఇవి అంతర్జాతీయంగా పేరుపొందిన ఆటగాళ్లతో పాటు, వర్ధమాన భారతీయ ప్రతిభకు కూడా ఒక వేదికను అందిస్తున్నాయి. ఈ వేలానికి ముందు ఫ్రాంచైజీలు తమ స్క్వాడ్‌లను సమీక్షించుకునేందుకు, ఆటగాళ్లను నిలుపుకునే విండో వారికి ప్రత్యేకంగా కీలకం కానుంది. సెప్టెంబర్ 28న వారు తీసుకునే నిర్ణయాలు, నెల రోజుల తర్వాత జరిగే కొచ్చి వేలం కోసం వారి వ్యూహాలను రూపొందిస్తాయి. షెడ్యూల్ ఖరారు కావడంతో ఫ్రాంచైజీల దృష్టి ప్లేయర్ల రిటెన్షన్‌పై కేంద్రీకృతంకానుంది.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.